ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 30.08.2026 | సంపుటి :13 సంచిక : 41 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరూ.. తొలగించొద్దు

### అనర్హులెవరూ జాబితాలో చేరకూడదు • 'సర్' గడువు పొడిగించండి

- ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయి
- ప్రక్రియకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది
- కేంద్ర ఎన్నికల కమిషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి లేఖ

ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదు.అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువు పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో 3 కోట్ల 38లక్షల ఓటర్లు ఉండగా అందులో సుమారు మూడో వంతు ఓటర్లు నిరూపించుకోవడం లేదా ఓటు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కాబట్టి అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు మరో నాలుగు వారాలు సమయం ఇవ్వడంతో పాటు తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ సవరించాలి.ఓటర్లకు అవసరమైన సహాయం అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలి - సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు మరో నాలుగు వారాలు సమయం ఇవ్వడంతో పాటు తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ సవరించాలని సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు సీఎం లేఖ రాశారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించేందుకు పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కనీసం రెండు సార్లు గ్రామ, వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటరు జాబితాను చదివి వినిపించాలన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా పోవద్దన్న సీఎం రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని రేవంత్ రెడ్డి కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువు పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు సీఎం లేఖ రాశారు. రాష్ట్రంలో 3 కోట్ల 38లక్షల ఓటర్లు ఉండగా అందులో మిగతా 2లో..

## తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత

- వారి గుర్తింపులో జాప్యం లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలి
- ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలి
- తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుపై నివేదికను సీఎంకు అందజేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ
- ఉద్యమకారులకు స్థలం, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ముఖ్యమంత్రి సుముఖత

2లో..



### అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

## సెప్టెంబర్ 7 నుంచి..

- సభ్యులకు సమాచారం ఇచ్చిన శాసనసభ, శాసన మండలి కార్యదర్శులు
- ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలపై ప్రశ్నలు ఇవ్వాలని ఎమ్మెల్యేలకు శాసనసభ కార్యదర్శి సూచన

**హైదరాబాద్(జనంసాక్షి):**సెప్టెంబర్ 7నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు శాసనసభ, శాసన మండలి కార్య దర్శులు సభ్యులకు సమాచారం ఇచ్చారు.వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలపై ప్రశ్నలు ఇవ్వాలని ఎమ్మెల్యేలకు శాసనసభ కార్యదర్శి సూచించారు. వచ్చే నెల 2లోపు ఇవి అందించాలని తెలిపారు. రూల్-39 ప్రకారం సభ్యులు అడిగే ప్రశ్నలకు సభలో మంత్రులు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ముందస్తు ప్రశ్నలను సంబంధిత శాఖలకు పంపించి తెలంగాణ ప్రభుత్వం సమాధానాలు సిద్ధం చేయనుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు శాసన సభ్యులకు కార్యదర్శి రేండ్ల తిరుపతి లేఖ రాశారు. మిగతా 2లో..



## 'సర్' నోటీసుల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- బీఎల్వోలు ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా ఇవ్వాలి
- కలెక్టర్లతో సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**ఎస్ఐఆర్‌లో నోటీసుల ప్రక్రియను పకడ్బందీగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. బీఎల్వోలు ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా ఇవ్వాలని సీఈవో స్పష్టం చేశారు. రెండు రోజుల ముందు విచారణ ప్రాంతం, తేదీ, సమయం ఓటర్లకు తెలపాలన్నారు. నోటీసులకు వారం రోజుల్లో వివరణ ఇచ్చే గడువును కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, విచారణ, వివరణల నమోదు ప్రక్రియలపై జిల్లాల కలెక్టర్లతో సీఈవో సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.నోమ్యాపింగ్, అనామలిస్ ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలకు ఇవ్వాలని సీఈవో తెలిపారు. నోటీసుతో పాటు సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. మిగతా 2లో..

## క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుంది

- సీఎం రేవంత్ యువకుడు.. ఉత్సాహవంతుడు. ఆయనకు ఆటంకాలు సృష్టించవద్దు
- గీత దాటిన వారిపై వేటు వేయకపోతే పార్టీకే నష్టం :గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. క్యాబినెట్, ప్రభుత్వంలో మార్పు రావాలన్నారు. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం మిగతా 2లో..

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే



- ఘటనపై వెంటనే ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- ఇది బీజేపీ, ఆర్ఎస్ఎస్ వైఖరి అంటరానితనానికి మరో రూపం
- ఆ పార్టీలు దళితలను గౌరవించేందుకు సిద్ధంగా లేవు
- రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం'
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలి
- మీడియా సమావేశంలో రాహుల్ డిమాండ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన వేదికను శుద్ధీకరణ చేసిన ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన ఆ ఘటన నేరమని అన్నారు. ఆ వ్యవహారంపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో పలు వ్యాఖ్యలు చేశారు. హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8వ తేదీన ఖర్గే కాంగ్రెస్ సభలో ప్రసంగించారు. ఆయన ప్రసంగం అనంతరం ఆగస్టు 10వ తేదీన కొందరు అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఆ ఘటనను ప్రస్తావించిన రాహుల్, శుద్ధీకరణ పేరుతో దళితులను అంటరానివారిగా చూపుతున్నారని విమర్శించారు. శుద్ధీకరణ అనేది అంటరానితనానికి మరో పేరు అంటూ అభిప్రాయపడ్డారు. 'దళితులు తాకకూడని వారు, అపవిత్రులు అన్న భావనను ఇది వ్యక్తం చేస్తోంది. రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. అలాంటి చర్యలు నేరం' అని రాహుల్ అన్నారు.అయితే ఆ ఘటనలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి చెందిన వారే ఉన్నారని, ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్ శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'బీజేపీ ఉత్తరాఖండ్ అధ్యక్షుడే శుద్ధీకరణను సమర్థిస్తున్నారు. అదే సమయంలో ప్రధాని మోదీ తాను అన్ని కులాలకు చెందిన వ్యక్తినని చెబుతున్నారు. మరి దళిత నాయకుడికి జరిగిన అవమానంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు' మిగతా 2లో..

## యువతరానికి స్ఫూర్తినివ్వడంలో క్రీడల పాత్ర కీలకం

### ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు. క్రీడాభిమానులకు శుభాకాంక్షలు చెప్పారు. యువతరానికి స్ఫూర్తిగా నిలవడంలో క్రీడల ప్రాధాన్యతను పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రశంసించారు. మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. అలాగే భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలిపారు. "ప్రతి క్రీడాకారుడికి..మీ అంకిత భావం, అభిరుచి, పట్టుదలఅందరికీ గర్వకారణం. మిగతా 2లో..



## భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి

### చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు మేలు చేయాలి : మంత్రి పొంగులేటి

**సూర్యాపేట (జనంసాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత చేపట్టిన భూముల రీ సర్వేకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి అక్టోబర్ చివరి నాటికి పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.డిసెంబర్ లో రెండో విడత సర్వే చేపట్టేందుకు సంసిద్ధం కావాలని చెప్పారు. దశాబ్దాల తరబడి గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చి పారదర్శకంగా అమలు చేస్తుందన్నారు.అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని కోరారు. భూములకు సంబంధించిన అంశాలన్నింటిని సానుకూల దృక్పథంతో ఆలోచించి పరిష్కరించినందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని, తద్వారా రెవెన్యూ వ్యవస్థపై నమ్మకం పెరిగేలా చూడాలన్నారు. శనివారం కలెక్టరేట్ లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మొదటి విడత సర్వే చేపట్టిన70 గ్రామాలలో సర్వేను పారదర్శకంగా నిర్వహించి గ్రామ సరిహద్దులు నిర్ధారించడంపై దృష్టి సారించాలని, కలెక్టర్లు, ఆదనపు కలెక్టర్లు ప్రత్యక్షంగా వీటిని పర్యవేక్షించాలని,ఎక్కడైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని చెప్పారు.ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్ గా తీసుకొని నిర్ణయించిన తేదీ కంటే ముందే సర్వే పూర్తి చేసేలా చూడాలని ,భూముల సమస్యల పరిష్కారానికి ప్రజలు పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా చూడాలని కోరారు.అలాగే రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపైన ఉందన్నారు. చట్టానికి లోబడి వాటిని కూడా పరిష్కరించేందుకు సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. సర్వే కోసం నియమించిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలని, విధులకు రాని వారిని అవసరమైతే తొలగించి వారి లైసెన్సు క్యాన్సల్ చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో భాగంగా మొదటి విడత మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 సమస్యలను పరిష్కరించడంలో మిగతా 2లో..

## ప్రళయం మిగిల్చిన విషాదం

- సర్వం కోల్పోయి, గల్లంతైన ఆప్తుల కోసం అన్వేషిస్తున్న నేపాల్ లోని కుటుంబాలు
- ఆకస్మిక వరదల్లో 600 దాటిన మృతుల సంఖ్య • శవాల ఫొటోల వద్ద ఆప్తుల రోదనలు

**ఖాట్మండు(జనంసాక్షి):**ఆసుపత్రుల వెలుపల గోడలకు అంటించిన మృతుల ఫొటోలను చూస్తూ కన్నీరుమున్నీరు అవుతున్న జనాలు. తమ సామగ్రి కోసం బురదలో, శిథిలాల మధ్య వెతుకుతున్న కుటుంబాలు. దెబ్బతిన్న భవనాల గుండా పసిబిడ్డను ఎత్తుకొని వెళ్తున్న ఓ బాధిత మహిళ. శిథిలాల మధ్య పడి ఉన్న ఓ కుక్క కళేబరం. నేపాల్?ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు సృష్టించిన బీభత్సానికి ఇవి కొన్ని సజీవ సాక్ష్యాలు. మరోవైపు రోజులు గడుస్తున్న కొద్దీ గల్లంతైన వారి బంధువుల్లో ఆశలు ఆవిరి అవుతున్నాయి. మరోవైపు సహాయక బృందాలు అత్యంత ప్రతికూల వాతావరణంలోనూ ప్రాణాలకు తెగించి బాధితుల కోసం గాలిస్తున్నాయి.బుధవారం నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు ఒక్కసారిగా గ్రామాలు, పట్టణాలను ఊడ్చేసింది. వరద ఉద్ధృతికి ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు అన్నీ కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పెను విపత్తు నుంచి కోలుకోవడానికి ఇప్పుడు నేపాల్ తీవ్రంగా శ్రమిస్తోంది.

### భారీగా పెరిగిన మృతుల సంఖ్య

శనివారం నాటికి నేపాల్‌లో మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2400 మంది గల్లంతయ్యారు. పైగా వరద ప్రభావిత ప్రాంతాల్లో తరచూ వర్షాలు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ రెస్క్యూ బృందాలు మిగతా 2లో..





## కొత్త సరస్సు నీరు రంగుమారుతోంది

### నేపాల్‌కు చైనా వరద హెచ్చరిక

**ఖాట్మండు(జనంసాక్షి):**హిమనీనదం బద్దలై ఇప్పటికే నేపాల్‌లో వరదలు రాగా.. ఆ విపత్తు వల్ల పేరుకుపోయిన పెద్ద రాళ్లు, బురద, మంచు, ఇతర శిథిలాలతో టిబెట్ వైపున ఏర్పడిన సరస్సు పొంగుతోంది. దానిపై చైనా మరోసారి హెచ్చరిక చేసింది. ఏ క్షణాన మిగతా 2లో..

## నేపాల్‌కు తక్షణ సాయం అందించాలి

### ప్రధాని మోడీకి ఖర్గే లేఖ

2లో..

## బర్డ్‌ఫ్లూపై బీఅలర్ట్

### వైరస్ వ్యాప్తిపై భారత్ అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో సూచన



**న్యూయార్క్(జనంసాక్షి):**బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జంతువులు, పక్షులలో ఈ వైరస్ కేసులు వేగంగా వ్యాప్తి చెందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. జంతువుల నుంచి మానవులకు బర్డ్‌ఫ్లూ సోకే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. బర్డ్‌ఫ్లూను ఎదుర్కొనేందుకు ఆరోగ్య వ్యవస్థలను ముందస్తుగా సిద్ధం చేయాలని ఆసియా-పసిఫిక్ దేశాలకు సూచించింది. అయితే భారత్‌లో ప్రస్తుతం స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్న సమయంలోనే, డబ్ల్యూహెచ్‌ఓ బర్డ్‌ఫ్లూ అలర్ట్ ఇవ్వడంతో ఈ హెచ్చరికకు మిగతా 9లో..

## వెనెజువెలాతో ప్రపంచంలోనే అతిపెద్ద చమురు డీల్

### 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలపై నియంత్రణకు ఒప్పందం జరిగింది: ట్రంప్

2లో..

## 22ఏ భూములపై త్వరలోనే కార్యాచరణ

### పార్టీ నేతలతో బిజెపి చీఫ్ రామ్ సమీక్ష



## తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ అయింది. కమిటీ సభ్యులు కేశవ రావు, కోదండరామ్, రాములునాయక్, మోతె శోభన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీలతో జరిపిన సంప్రదింపుల వివరాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేశారు. ఉద్యమకారుల గుర్తింపు కసరత్తును జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం వారికి సూచించారు. ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేందుకు, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నట్లు కమిటీ వెల్లడించింది.

## ప్రళయం మిగిల్చిన విషాదం

ఎంతో శ్రమించి 163 మంది విదేశీయులతోపాటు, దాదాపు 2500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు ఆసుపత్రుల వెలుపల, చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను చూసేందుకు కుటుంబాలు బారులు తీరుతున్నాయి. తమకు తెలిసిన వారు ఎవరైనా ఉన్నారేమోననే ఆశతో పేర్లు, ఫొటోలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. బతికున్న వారి జాబితాలో తమ వారి పేర్లు కనిపించకపోవడంతో, భారమైన హృదయంతో, మరణించిన వారి ఫొటోలు ఉన్న మరో జాబితా వైపు వెళు తున్నారు. ఈ హృదయవిదారకమైన దృశ్యాలు చూపరులను కన్నీటి పర్యంతం చేస్తున్నాయి. కాగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బంది రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా శ్రమిస్తున్నారు. వర్షాలను సైతం లెక్కచేయ కుండా, బురదను తవ్వుకుంటూ గల్లంతైన వారి కోసం అన్వేషిస్తు న్నారు.అప్పర్ త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద వందలాది మంది కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అక్కడ టన్నుల కొద్దీ బురద పేరుకుపోయింది. నేపాల్ హోంమంత్రి సుదన్ గురుంగ్ స్వయంగా ప్రొక్లెయిన్లతో ఆ బురద తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఆ టన్నెల్‌లో చిక్కుకుపోయిన 350 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు ఆన్‌లైన్ ఖబర్ అనే న్యూస్ పోర్టల్ పేర్కొంది.

**మహా విధ్వంసం**

మధ్య నేపాల్‌లోని గ్రామాల్లో విధ్వంసం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. భవనాలు కొన్ని అడుగుల మేర బురదలో మునిగిపోయాయి. వాహనాలు సగం వరకు బురదలో కూరుకుపోయాయి. రోడ్లు, ఇతర మౌలిక వసతులు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. ఇక ప్రాణాలతో బయటపడిన వారికి, ఉండడానికి ఓ చోటు, వైద్యం, పోయిన సామగ్రి వెతుక్కోవడం కష్టమైపోతోంది. నువాకోట్ జిల్లాలోని దేవిఘాట్ గ్రామంలో ప్రజలు మోకాళ్ల లోతు బురదలో, శిథిలాల గుండా నడుస్తూ తమ వస్తువుల కోసం వెతుకుతున్నారు. ఒక వ్యక్తి శిథిలాల గుండా గ్యాస్ సిలిండర్ మోసుకెళు తున్నాడు. ఎందుకంటే అతను ఆ ముంపు నుంచి కాపాడుకోగలిగిన ఏకైక వస్తువు అది ఒక్కటే. ఎక్కడ చూసినా దెబ్బతిన్న ఇళ్లు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన వాహనాలు కనిపిస్తున్నాయి. ఇది వరద సృష్టించిన మహా విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ప్రస్తుతం త్రిశూలిలో ఏర్పాటు చేసిన ఆర్మీ రిలీఫ్ క్యాంప్ బాధితులకు కాస్త ఆసరాగా మారింది. ఆర్మీ సిబ్బంది పిల్లలకు, వృద్ధులకు సాయం చేస్తున్నారు. వైద్యులు తాత్కాలిక వైద్య శిబిరాల్లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. ఈ క్యాంప్‌ల్లోనే గల్లంతైన, మరణించిన, రక్షించబడిన వారి వివరాలను అందిస్తున్నారు. సహాయక చర్యల కోసం 5000 మందికిపైగా నేపాల్ ఆర్మీ సిబ్బందితో కలిపి మొత్తం 11వేల మందికిపైగా భద్రతా సిబ్బంది రంగంలోకి దిగారు.

మళ్లీ వర్షాలు కురిసే అవకాశం!

వాతావరణ శాఖ రానున్న రోజుల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. ఇది రెస్క్యూ సిబ్బంది పనిని మరింత కష్టత రం చేసే అవకాశం ఉంది. అయినప్పటికీ, గతంలో ఇలాంటి విపత్తులను ఎదుర్కొన్న అనుభవంతో, గల్లంతైనవారిని వెతకడం, బాధితులకు సహాయం చేయడం, పునర్నిర్మాణ ప్రక్రియను ప్రారంభించడంపై నేపాల్ దృష్టి సారించింది.

## నీరు రంగుమారుతోంది.. నేపాల్‌కు చైనా వరద హెచ్చరిక

అయినా అది ఉప్పొంగి, కిందికి దూసుకురావొచ్చని పేర్కొంది. నీటి రంగులో మార్పును అందుకు కారణంగా చెప్పింది. నేపాల్ విదేశాంగశాఖతో ఈ సమాచారాన్ని షేర్ చేసుకుంది. "విపత్తు తర్వాత ఏర్పడిన సరస్సు రంగు మారుతోంది. ముదురురంగులోకి వస్తోంది. అంటే అది బద్దలయ్యేందుకు అవకాశం ఉంది" అని చైనా అధికారులు వెల్లడించారు.నది లేక ఇతర వనరుల్లో నీటి రంగు మారడం అనేది వరదలు వచ్చేముందు ప్రధానంగా కనిపించే సూచన పర్వత ప్రాంతాలు, నీటి వనరులకు ఎగువభాగంలో భారీ వర్షాలు కురిసినప్పుడు.. అక్కడి నుంచి కిందికి ప్రవహించే నీటిలో మట్టి, రాళ్లు, ఇసుక, ఆకులు, ఇతర వ్యర్థాలు కొట్టుకొస్తుంటాయి. దాంతో నీటి రంగులో మార్పు వస్తుంటుంది. అంటే ఎగువ నుంచి నీటి ప్రవాహం ఉందని అర్థం. అలాగే వరద ముంచుకొచ్చే ముందు నదీ ప్రవాహ శబ్దంలో కూడా మార్పు వస్తుందని నిపుణులు చెప్తుంటారు. ఇలాంటి సమయాల్లో లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తారు. ఇప్పుడు చైనా అధికారులు కూడా లోతట్టు ప్రాంత ప్రజలకు ఇలాంటి సూచనలే చేశారు. చైనా వైపున చోచెన్ నది, నేపాల్ వైపున పురెపు నది కలిసే దగ్గరలో ఈ సరస్సు ఏర్పడింది. అందులోని నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని చైనా జలవనరుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. శుక్రవారం నాటికి.. సుమారు 25 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరింది. సరస్సు తెగితే సంభవించే నష్టాన్ని అంచనా వేయడానికి చైనా ఫ్లడ్ మోడలింగ్ అధ్యయనం చేపట్టింది. ఈ సరస్సు గట్టులో కొంతభాగం తెగితే.. నీటి ప్రవాహం గరిష్ఠంగా సెకనుకు 500 క్యూబిక్ మీటర్లు ఉండొచ్చు. అయితే ఆ పరిమాణం నది ఒడ్డుకే పరిమితమై ఉంటుందని పేర్కొనడం కాస్త ఊరటనిచ్చే విషయం. శుక్రవారం ఆ సరస్సు ఉప్పొంగి.. లెండేఖోలా, త్రిశూలీ నదుల్లోకి ప్రవహించింది. తర్వాత ఆ ప్రవాహ తీవ్రత అదుపులోకి వచ్చిందని చైనా మీడియా వెల్లడించింది. డ్రోన్లు, శాటిలైట్ చిత్రాల ఆధారంగా డ్రాగన్ ఈ లెక్కలు చెప్తోంది.

### బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం

**వర్షాలు కురిసే ఛాన్స్**

విశాఖపట్టణం:బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని.. ఈ అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మ న్యం జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని అంచనా వేశారు. బంగాళాఖాతంలో సంభవిస్తున్న వాతావరణ మార్పుల కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, సెప్టెంబర్ 2 వరకు ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని తెలిపారు.

## అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరూ తొలగించొద్దు

73 లక్షల 39వేలు మృతి, డూప్లికేట్, ఆబ్‌సెంట్, ఇతర ప్రాంతాలకు షిఫ్టయిన ఏఎస్‌డీడీ కేటగిరీలో పెట్టారని సీఈసీకి రాసిన లేఖలో సీఎం వివరించారు. అన్‌మ్యాపింగ్, అనామలిస్ కేటగిరీల్లో మరో 92 లక్షల 86 వేల మందికి నోటీసులు ఇస్తున్నారన్నారు. సుమారు మూడో వంతు ఓటర్లు నిరూపించుకోవడం లేదా ఓటు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు.ఏఎస్‌డీడీ కేటగిరీలో సుమారు 62 శాతం అంటే 45 లక్షల 19 వేల మంది శాశ్వతంగా షిఫ్ట్ అయిన కేటగిరీలో పెట్టారన్న సీఎం ఓటర్ల పరిశీలన విధానంలో పలు లోపాలున్నాయన్నారు. తాత్కాలికంగా బయటకు వెళ్లిన వారు శాశ్వతంగా షిఫ్టెడ్‌కు తేడా చూపలేదన్నారు. బీఎల్‌ఓలు వెళ్లిన సమయంలో ఏదైనా పనిపై తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని కూడా శాశ్వతంగా షిఫ్టెడ్?గా పెట్టారన్నారు. నిజంగా శాశ్వతంగా అడ్రస్ మారిన వారు కొత్త ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకునేలా సహకరించకుండా అప్పటి వరకున్న చోట ఓటు తొలగించారని సీఎం వివరించారు. నివాసం మారిన వారికి నోటీసు ఇవ్వకుండానే తొలగించారన్నారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు పోయిందన్న విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం ఏఎస్‌డీడీ ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివాలి**

తెలంగాణ రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి లేఖలో తెలిపారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించడంతో అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని సవరించాలని రేవంత్‌రెడ్డి కోరారు. పల్లెలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయాలన్న రేవంత్‌రెడ్డి కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని ముఖ్యమంత్రి కోరారు.కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు డాక్యుమెంట్లను సమర్పించేందుకు వారం సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్రం స్థాయిలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్న సీఎం మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా ఆమోదించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచించారు.

**పూర్తి సహకారం ఇస్తాం**

హైదరాబాద్‌లో నియోజకవర్గానికి 78 వేలకుపైగా నోటీసులు అందుకుంటున్న వారు ఉన్నందున కొద్దిమంది ఈఆర్‌వోలు సరిపోరన్నారు. అదనపు ఈఆర్‌వోలను కూడా నియమిండంతో పాటు నోటీసుల్లోనే విచారణ తేదీ, సమయాలను పేర్కొంటూ క్షేత్రస్థాయిలో విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అర్హత ఉన్న ప్రతీ ఓటరుకు న్యాయం జరిగేలా కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

## నేపాల్‌కు తక్షణ సాయం అందించాలి

**ప్రధాని మోడీకి ఖర్గే లేఖ**

న్యూఢిల్లీ(జనంసాక్షి): నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన



ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.

### యువతరానికి స్ఫూర్తినివ్వడంలో క్రీడల పాత్ర కీలకం

తరతరా లకు స్ఫూర్తినిచ్చే ప్రతిభావంతుడైన దిగ్గజ మేజర్ ధ్యాన్ చంద్‌కు నివాళు లర్పిస్తున్నా" అని అన్నా రు."క్రీడలు అంటే కేవలం గెలవడం మాత్రమే కాదని నేనెప్పుడూ నమ్ముతా. కలలు కనడం, కష్టపడటం, ఎదురుదెబ్బలను తట్టుకొని ముందుకు సాగడం నేర్పిస్తాయి. జాతీయ క్రీడాదినోత్సవం నాడు యువతను మరింత ఎక్కువగా గేమ్స్ ఆడేలా ప్రోత్సహిద్దాం" శిఖర్ ధావన్ అన్నారు.

## క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుంది

వస్తుందని పేర్కొన్నారు. "ఏ పార్టీలోనూ క్రమశిక్షణ లేదు. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ తగాదాలు తగ్గించాల్సిన అవసరం ఉంది. సీనియర్ నేత చిన్నారెడ్డి పార్టీ లైన్ దాటి మాట్లాడటం సరికాదు. గీత దాటిన వారిపై వేటు వేయకపోతే పార్టీకే నష్టం. ప్రభుత్వం, పార్టీలో లీకేజీలు కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉంది.ఇప్పుడిస్తున్న పింఛన్లను రూ.3 వేలకు పెంచాలి. 22ఏను రద్దు చేసి సమస్యలను పరిష్కరించాలి. ఉచితాలు క్రమంగా తగ్గించాలి. సీఎం రేవంత్‌రెడ్డి యువకుడు.. ఉత్సాహవంతుడు. ఆయనకు ఆటంకాలు సృష్టించవద్దు. స్వేచ్ఛగా పనిచేసుకోనివ్వాలి. ప్రస్తుతం సామాన్యుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత లేదు. మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన పథకాలు కొనసాగిస్తూనే కొత్తవి కూడా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం ఇంకా ఎక్కువగా జరగాల్సిన అవసరం ఉంది" అని సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

## 'సర్' నోటీసుల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

అభ్యంతరాలు, క్లెయిమ్‌ల వివరాలను ప్రతీవారం రాజకీయ పార్టీలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో జీఎస్ చారి పాల్గొన్నారు.

## వెనెజువెలాతో ప్రపంచంలోనే అతిపెద్ద చమురు డీల్

వాషింగ్టన్ (జనంసాక్షి):అమెరికా-వెనెజువెలా మధ్య అతిపెద్ద చమురు ఒప్పందం కుదిరింది. వెనెజువెలాలోని 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలపై నియంత్రణకు ఒప్పందం జరిగినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఇది ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద ఇంధన ఒప్పందం అని పేర్కొన్నారు. అగ్రరాజ్యంతో చేసుకున్న ఈ ఒప్పందంతో తమ దేశ పునరుద్ధరణ, 17 చమురు క్షేత్రాల అభివృద్ధి ముడిపడి ఉందని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. దీనివల్ల దాదాపు 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ఒప్పందం ఇరుదేశాలకు పెద్ద విజయమని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పేర్కొన్నారు. ఇది వెనెజువెలాకు బిలియన్ల కొద్దీ ప్రైవేట్ పెట్టుబడులను తీసుకువస్తుందని.. అమెరికాలో గ్యాస్ ధరలు తగ్గడానికి దారితీస్తుందని తెలిపారు. వారి నుంచి కొనుగోలు చేసే చమురును వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను నింపడానికి, సైనిక అవసరాలకు వినియోగించే అవకాశం ఉందన్నారు.

చమురు వెంటనే వెలికి తీయలేం..

ఆరు నెలలుగా ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధం వల్ల అమెరికాలో చమురు కొరత ఏర్పడుతోంది. ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గమైన హర్మూజ్‌లో సైతం ఉద్రిక్తతలు కొనసాగుతుండడంతో.. గ్యాస్ నిల్వలు పెంచుకోవడానికి ట్రంప్ వెనెజువెలాపై దృష్టి సారించారు.

## 22ఏ భూములపై త్వరలోనే కార్యాచరణ

**పార్టీ నేతలతో బిజెపి చీఫ్ రామ్ సమీక్ష**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గొంతుకను వినిపిస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. 22-ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22-ఏ వ్యవహారంపై చేసే దీక్షపై సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయను న్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలాబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం బీజేపీ తదుపరి కార్యాచరణపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి అసెంబ్లీ వరకు రైతుయాత్ర చేపట్టేందుకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ సిద్ధమవుతున్నారు.

## సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తం కండి

**కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకదృష్టి**

**అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర ఆదేశాలు**

హైదరాబాద్:సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తగా ఉంటే విజృంభిస్తాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన అధికారులో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు.

# భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

భాగంగా భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేలా సమస్యలను సరిచేసేలా పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు.15 రోజుల్లో ఎల్ 3 సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 2వ విడత ఇలాంటి సమస్యలు రాకుండా ఇండ్ల మంజూరు సమయంలోనే ఇబ్బందులు రాకుండా శాసనసభ్యులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.మంజూరు ఉత్తర్వులను ఆధారం చేసుకుని ఎక్కడైనా ఇందిరమ్మ ఇంటికి ఒక బిల్లు వచ్చి ఉండి తదుపరి బిల్లు రానట్లయితే సంబంధితులపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు.ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు పేదవాడికి అన్ని పన్నులు, రవాణాచార్జీలు కలుపుకొని 230 రూపాయలకే సిమెంట్ బస్తా ఇచ్చే విధంగా సిమెంట్ కంపెనీలతో మాట్లాడి నిర్ణయించడం జరిగిందని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అసంపూర్తిగా వివిధ దశల్లో ఉన్న వాటిని గుర్తించి 15 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు .ఇందిరమ్మ మొదటి విడతలో చేపట్టిన అసంపూర్తిగా ఉన్నవి కూడా దసరా లోపు పూర్తి కావాలని పేర్కొన్నారు.నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ కింద 500 గృహాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్లకు దగ్గరలో ఇసుక ఎక్కడ దొరికితే అక్కడ నుండి ఇచ్చేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు.గతంలో ఇంటి పట్టాలకు భూములను గుర్తించి ఇంకా పంపిణీ చేయని వాటిని వెంటనే జాబితా రూపొందించి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తహసిల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో తప్పనిసరిగా మార్పులు కనిపించాలని, ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలు ఎక్కడ చేయకూడదని అన్నారు. భూములకు సంబంధించి 45 దరఖాస్తులు తన లాగిన్ లోనే ఎక్కువ రోజులు ఉంచుకోవడంపై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసిల్దార్ ను వివరణ కోరాలని మంత్రి ఆదేశించారు.రీ సర్వేకు సర్వేయర్ల సమస్య ఉన్న చోట అవసరమైతే పక్క మండలాల నుండి సర్దుబాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. సర్వే నిర్వహించిన రోజే ఆన్లైన్లో రికార్డులు అప్డేట్ చేయాలని చెప్పారు.సర్వే వల్ల రెవెన్యూ రికార్డుల పూర్తి ప్రక్షాళన కలుగుతుందని, దీనివల్ల 90 శాతం పైగానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.అనంతరం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అన్నారు. ఇల్లు అనేది ప్రతి పేదవాడికి ఎంతో ముఖ్యమని, మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో మిగిలిపోయిన, అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన ఇండ్లను దసరాలోపే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేలా అధికారులు చూడాలని కోరారు.ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ సమస్యలు పరిష్కరించాలని, నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి ద్వారా పేదవారికి సంబంధించిన నిజమైన భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించిన ఎల్ 3 సమస్యలు పరిష్కరించాలన్నారు.నకిరేకల్ కు మంజూరైన జిల్లా కోర్టు విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎల్ 3 సమస్యల పరిష్కారంలో జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని కోరారు.మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ రిజిస్ట్రేషన్ కార్యాలయం, అడవిదేవులపల్లి మండలంలో తహసిల్దార్ కార్యాలయాల మంజూరు, మిర్యాలగూడ మున్సిపాలిటీ అయినందున మిర్యాలగూడకు ఎక్కువ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ శాలిగౌరారం మండలం మాదారం చెరువు శిఖం భూమి ఆక్రమణ, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సమస్యను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడుతూ సాదా బైనమాల సమస్యల పరిష్కారంలో లింక్ డాక్యుమెంట్లు అడుగుతున్నారని, అలాగే ఆర్ఓఎఫ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించి ముగ్గు పోసుకున్న వారికి ఇండ్లు ఇవ్వాలని కోరారు.మరో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సాదా బైనామాల సమస్యలు పరిష్కారం కావడం లేదని, నక్ష మ్యాపులాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు.నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలని, అలాగే అటవీ ,అసైన్డ్ పట్టాల లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని, ఎల్ -3 సమస్యలు పరిష్కరించాలని కోరారు.సమావేశం ప్రారంభమైన వెంటనే రెవెన్యూ సిసిఎల్ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, ల్యాండ్ సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతమ్ వారి వారి శాఖలకు సంబంధించిన అంశాలను వివరించారు.సమీక్షలో భాగంగా రెవెన్యూ శాఖ మంత్రి సూర్యాపేట ,యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల నుండి కొంతమంది తహసిల్దారులతో రీసర్వేపై సమీక్షిస్తూ సర్వే జరుగుతున్న తీరు, సమస్యలు, ప్రజల నుండి వస్తున్న అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు జిల్లా కలెక్టర్లు తప్పనిసరిగా సర్వే జరుగుతున్న గ్రామసభలకు హాజరుకావాలని ఆదేశించారు.నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, వారి జిల్లాలకు సంబంధించిన సమీక్షలో వారు తీసుకున్న చర్యలపై మంత్రులకు వివరించారు.ఉమ్మడి నల్గొండ జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్టర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీలు, తహసిల్దారులు, పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గే సభా వేదికను శుద్ధి చేయడం నేరమే

అంటూ ప్రశ్నించారు.ఇక ఆగస్టు 13వ తేదీన రాజ్యసభలో ఆ అంశాన్ని మల్లికార్జున ఖర్గే ప్రస్తావించారని రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఘటనకు పాల్పడిన వారిపై అంటరానితన నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఖర్గే డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ అధ్యక్షుడి తరఫున మేం న్యాయం కోరుతున్నాం. ఉత్తరాఖండ్?లో ఖర్గేకు న్యాయం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనకు న్యాయం జరిగే చూడాలి' అని రాహుల్ అన్నారు.

'దళితలను గౌరవించేందుకు బీజేపీ సిద్ధంగా లేదు'

ఘటనను కేవలం ఒక రాజకీయ వివాదంగా చూడకూడదని, దేశంలో కుల వివక్షకు సంబంధించిన సమస్యగా చూడాలని రాహుల్ కోరారు. దళితలను గౌరవించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధంగా లేవని ఆరోపించారు. దేశంలో దళితులపై వివక్ష ఇంకా కొనసాగుతోందని అన్నారు. రాజ్యాంగం ఇలాంటి వివక్షను నిషేధించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో దళిత పిల్లలను పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, నేలలు ఊడ్చించడం వంటి ఘటనలు జరుగుతున్నాయంటూ ఆరోపణలు చేశారు. గ్రామాల్లో సామూహిక బావుల నుంచి దళితులకు నీళ్లు తీసుకునేందుకు అనుమతి ఇవ్వని ఘటనలు ఉన్నాయని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు. కొన్ని టీ దుకాణాల్లో దళితుల కోసం ప్రత్యేకంగా పేపర్ లేదా ప్లాస్టిక్ కప్పులు, ఇతరుల కోసం గాజు కప్పులు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. దళిత వరుడు గుర్రంపై ఊరేగింపుగా వెళ్లే సమయంలో దాడులకు గురవుతారనే భయంతో హెల్మెట్ ధరించే పరిస్థితులు కూడా ఉన్నాయని అన్నారు. ఇదే మన దేశ వాస్తవ పరిస్థితి అంటూ వ్యాఖ్యానించారు.

'రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం'

దేశంలో ప్రస్తుతం రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జవహర్?లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్?భాయ్ పటేల్ వంటి నాయకుల ఆలోచనలతో రూపొందిన రాజ్యాంగం ఉందని, మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. 'వేల సంవత్సరాలుగా దళితులపై హింస, వివక్ష కొనసాగింది. రాజ్యాంగం దాన్ని చట్టవిరుద్ధం చేసింది. అయినప్పటికీ నేటికీ ఇలాంటి ఘటనలు కనిపిస్తున్నాయి' అని అన్నారు. అదే విషయాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాజస్థాన్ కాంగ్రెస్ నేత టికారామ్ జూలీ, కేంద్ర మాజీ మంత్రి జితిన్ రామ్? మాంఝీ వంటి దళిత నేతలు వేర్వేరు సందర్భాల్లో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారని రాహుల్ పేర్కొన్నారు. ఒక దళితుడు ఎంత విజయవంతమైతే, అతడిపై దాడులు అంత తీవ్రంగా ఉంటాయని అన్నారు. అయితే హల్ద్వానీ ఘటనపై కాంగ్రెస్ విమర్శలు చేయడాన్ని ఇప్పటికే బీజేపీ ఖండించింది. పార్టీ ఇలాంటి కార్యకలాపాలను సమర్థించదని కేంద్ర మంత్రి జేపీ నడ్డా గతంలో స్పష్టం చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## ప్రోటోకాల్ ఉల్లంఘనపై దానం ఆగ్రహం

- అధికారుల తీరుపై మండిపాటు



**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** ఖైరతాబాద్ డబుల్ బెడ్ రూంల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ నెలకొంది. ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బంజారాహిల్స్ కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ గృహలక్ష్మి లబ్దిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ కార్యక్రమంలో పాల్గొని లక్కీ డ్రా ద్వారా లబ్దిదాలను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఎమ్మెల్యే రాకముందే అధికారులు లక్కీ డ్రాను ప్రారంభించారు. దీనిపై దానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను వచ్చేలోపే గృహలక్ష్మి లక్కీ డ్రా ప్రారంభించడంపై దానం నాగేందర్ మండిపడ్డారు. ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని అధికారులపై సీరియస్ అయ్యారు. ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన దానం నాగేందర్.. కార్యక్రమం మధ్యలోనే అలిగి వెళ్లిపోయారు. కాగా.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ప్లాట్ల లక్కీ డ్రా హైదరాబాద్ క్యూర్ పరిధిలో కొనసాగుతోంది. కోర్ అర్బన్ ప్రాంతంలోని తొలి విడతలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరగనుంది. నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## ప్రతి పల్లెలో ఇందిరమ్మ ఇల్లు.. అభివృద్ధి దిశగా గ్రామాలు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్



**ఎల్కతుర్తి (జనంసాక్షి) :** ప్రతి పల్లెలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణమవుతున్నాయని, అభివృద్ధి దిశగా గ్రామాలు వెలుగొందుతున్నాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని సూరారం దండేపెల్లి వీరనారాయణపూర్ వల్బాపూర్ ఇందిరానగర్ గ్రామాలలో పల్లె పల్లెకు పొన్నమన్న ప్రజా పాలనలో భాగంగా వివిధ గ్రామాలలో పర్యటించిన మంత్రి పోన్నం ప్రభాకర్ గౌడ్‌కు వివిధ గ్రామాల సర్పంచులు గ్రామ శాఖ అధ్యక్షులు ఘనంగా ఆహ్వానం పలికి సమస్యలపై పొన్నం ప్రభాకర్ కు విన్నవించారు ఈ సందర్భంగా వీరనారాయణ పూర్ సర్పంచి పుల్లూరి శ్రీధర్ రావు మాట్లాడుతూ గ్రామము అన్ని రకాలుగా అభివృద్ధి దశలో ఉందని ఇందిరమ్మ ఇండ్ల విషయంలో గాని రోడ్ల విషయంలో గాని పైలెట్ ప్రాజెక్టు గ్రామం ప్రభుత్వము చెయ్యగా ప్రస్తుతము కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి దశలో ఉందని పుల్లూరు శ్రీధర్ రావు అన్నారు దండేపల్లి గ్రామ సర్పంచ్ గోలీ సంపత్ మాట్లాడుతూ గ్రామానికి రోడ్లు కాలనీ కి రోడ్లు అవసరమని అన్నారు వివిధ గ్రామాల సర్పంచులు మహిళ సంఘాల నాయకులు మంత్రికి ఘనస్వాగతం పలికారు ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గ్రామాల గురించి మాట్లాడుతూ పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెకు ప్రజా పాలన అయిదు గ్రామాలను ఎంపిక చెయ్యగా గ్రామములో. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరై మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగంగా స్టీల్ ప్లేట్లను పంపిణీ చెయ్యడం జరిగిందని వాటిని వినియోగించుకోవాలని అన్నారు పేపర్ ప్లేట్లను వాడడం వలన అనారోగ్యానికి గురవుతారని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటి ఇంటికి చేరాయని అన్నారు రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ నీ కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు డివిజన్ అధికారులు మండల శాఖ అధికారులు గ్రామ శాఖ అధికారులు సర్పంచులు ఉప సర్పంచులు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులు అరెస్ట్

**గుడిహత్నూర్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను గుడిహత్నూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ ఎల్. శ్రీకాంత్ పోలీసు సిబ్బందితో కలిసి గుడిహత్నూర్ గ్రామంలోని జవహర్‌నగర్ పాత పెట్రోల్ పంపు వద్ద తనిఖీలు చేపట్టగా, గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. పోలీసులు విచారించగా వారు గుడిహత్నూర్‌కు చెందిన జాదవ్ కృష్ణ (28), సీతాగోంధికి చెందిన ముక్తా నితిన్ (23)గా గుర్తించారు. ఇద్దరికి నిర్వహించిన యూరిన్ డ్రగ్ స్క్రీనింగ్ పరీక్షల్లో గంజాయి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి సేవించే అలవాటు నుంచి బయటపడేందుకు ఇద్దరూ స్వచ్ఛందంగా డీ–అడిక్షన్ చికిత్స పొందేందుకు ముందుకు రావడంతో ఎన్‌ఈపీఎస్ యాక్ట్ సెక్షన్ 64 ఏ ప్రకారం న్యాయస్థానం ముందు హాజరుపరిచి డీ–అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక నష్టాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుడిహత్నూర్ పోలీసులు సూచించారు.




## విద్యారంగానికి వెన్నెముక ఇంటర్ విద్యా వ్యవస్థ

- అధ్యాపక సంఘాల నేత మధుసూదన్ రెడ్డి

**మీర్‌పేట (జనంసాక్షి) :** విద్యారంగానికి వెన్నెముక లాంటి ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు దశాబ్దాలుగాచేసిన కృషి వెలకట్టలేనిదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఇంటర్ అధ్యాపకుల కృషి వల్లనే మన తెలుగు విద్యార్థులు దేశ దేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని విశ్లేషించారు. రంగారెడ్డి జిల్లా మీర్ పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నాడు కెమిస్ట్రీ అధ్యాపకులు కంచనపల్లి నరసింహ చారి పదవీ విరమణ సభలో మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీర్పేట జూనియర్ కళాశాలలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఉండడానికి కారణం నిబద్ధత గల అధ్యాపకుల కృషియే ప్రధాన కారణం అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ సమర్థవంతమైన సమాజ నిర్మాణానికి తరగతి గది పునాది వంటిదని పేర్కొన్నారు. సమాజంలోని అవకతవకలను ఎదుర్కొనడానికి అవసరమైన నవ యువ తరాన్ని, సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించగల శక్తి తరగతి గదికే ఉందని చెప్పారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న సమర్థవంతమైన బోధకుల వల్లనే నాణ్యమైన విద్య అన్ని వర్గాల పిల్లలకు అందుతుందని కళాశాల ప్రిన్సిపల్ ఆవుల వెంకన్న చెప్పారు. ఈ సభలో వైస్ ప్రిన్సిపల్ కందుల ప్రతాప్ , సీనియర్ రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ప్రభాకర్ రెడ్డి, పలువురు సీనియర్ అధ్యాపకులు విద్యార్థులు నరసింహ చారి సేవలను కొనియాడారు.

# ములుగు ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వండి

- ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేక వ్యాధులపై పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయండి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మంత్రి సీతక్క విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర



**హైదరాబాద్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కోరారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ఆమె భేటీ అయ్యారు. ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, వైద్య సిబ్బంది నియామకం, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు తదితర అంశాలపై మంత్రి సీతక్క వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో డ్రైనేజీ, పారిశుద్ధ్య పనుల కోసం అత్యవసరంగా రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే రోగుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఓపీ (ఔట్ పేషెంట్) గదుల నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రి నిర్వహణ, సేవల మెరుగుదలకు 50 మంది ఐహెచ్ఎఫ్ఎంఎస్ వర్కర్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు రూ.1.20 కోట్ల నిధులు కేటాయించాలని మంత్రి సీతక్క కోరారు. 132 టెక్నికల్ పోస్టులకు గాను ప్రస్తుతం కేవలం 14 మంది పనిచేస్తున్నారని, మిగిలిన పోస్టులను భర్తీ చేసేందుకు అత్యవసరంగా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగుల సౌకర్యార్థం అత్యవసరంగా ర్యాంప్ ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే 5 నుంచి 10 పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కంటి సంబంధిత శస్త్రచికిత్సల కోసం క్రిటికల్ కేర్ బ్లాక్‌లో అధునాతన ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ములుగు జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావాలంటే ఆసుపత్రిలో ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ములుగు వంటి ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హీమోఫీలియా వంటి వ్యాధులు అధికంగా కనిపిస్తున్న నేపథ్యంలో, ఈ వ్యాధులపై ప్రత్యేక అధ్యయనం, నిర్ధారణ, చికిత్స కోసం ములుగు జిల్లాలో ఒక ప్రత్యేక రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. మంత్రి సీతక్క వినతిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. సంబంధిత అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## ఇద్దరిని బలిగొన్న వేపచెట్టు వివాదం

- గొడ్డళ్లతో నరుకున్న ఇరువర్గాలు
- అడ్డుకోబోయిన ఎస్ఐకి తీవ్ర గాయాలు






**సూర్యాపేట, ఆగస్ట్ 29 (జనంసాక్షి) :** సూర్యాపేటజిల్లాలో ఓ చిన్న వివాదం పెద్దదిగా మారి ఇద్దరి ప్రాణాలను బలి తీసుకున్నది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య చిచ్చు రేగింది. దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో ఒకరిపై ఒకరు వేసుకున్న గొడ్డలి వేట్లకు ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్ కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతోపాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మహమ్మద్ అలీ షబ్బీర్, ఎంపీ సురేష్ కుమార్ షట్కర్



**కామారెడ్డి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ తో కలసి పాల్గొన్నారు. కామారెడ్డి నియోజకవర్గం బిక్నూర్ మండలం రామేశ్వరం పల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఈ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు సులభంగా అందడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు అర్హత పొందే అవకాశం కలుగుతుంది అని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, మహిళా సాధికారత పథకాలు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ. ప్రజా సంక్షేమ మే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోంది. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. అని అన్నారు. కేంద్రం మరియు రాష్ట్ర స్థాయిలో ప్రజలకు ఉపయోగపడే పథకాలను సమన్వయంతో అమలు చేయడానికి కృషి చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రాణి రాజు, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాజీ డీసీసీబీ అధ్యక్షులు ఎడ్ల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్, గ్రామ వీడీసీ అధ్యక్షులు సూర్యకాంత్, సొసైటీ చైర్మన్లు భీంరెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, సర్పంచులు రేఖ, కృష్ణ రావు, లింగ రెడ్డి, సంతోష్, సీనియర్ నాయకులు విజయ్ గౌడ్, మహిపాల్, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు

## మెట్రో స్టేషన్లలో ఆన్‌లైన్ సమస్యలు

- ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు తెలరుచోక ప్రయాణికుల ఇబ్బంది
- అంతా సర్దుకుందంటున్న మెట్రో అధికారులు

**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** హైదరాబాద్ మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో మెట్రో అధికారులు స్పందించారు. మెట్రో రైలు సేవల్లో ఎలాంటి సాంకేతిక లోపం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం నగరంలో మెట్రో రైలు సేవలు సాఫీగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. నగరంలోని మెట్రో స్టేషన్లలోనూ ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేవని చెప్పుకొచ్చారు. ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెట్రో సేవలు సాఫీగానే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు ఆలస్యంగా ఓపెన్ అయ్యాయని అధికారులు తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ కారణంగానే గేట్లు తెరవడంలో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. ప్రస్తుతం ఎల్బీనగర్ సహా హైదరాబాద్‌లోని అన్ని మెట్రో స్టేషన్లలో సేవలు సాధారణ స్థితిలో కొనసాగుతున్నాయని ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు వెల్లడించారు. అయితే ఆన్‌లైన్‌లో ముందుగానే టికెట్లు కొనుగోలు చేసుకున్న ప్రయాణికులు మెట్రో స్టేషన్ల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టికెట్ తీసుకున్నప్పటికీ ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద స్కానింగ్ సమస్యలు తలెత్తడంతో ప్రయాణికులు క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్ సేవలు పనిచేయకపోవడంతో మెట్రో స్టేషన్ సిబ్బంది కూడా చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ టికెట్ తీసుకున్న తర్వాతా గేట్ల వద్ద వేచి ఉండాల్సి రావడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తరచుగా ఆన్‌లైన్ టికెటింగ్, స్కానింగ్ సేవల్లో అంతరాయాలు ఏర్పడుతుండటంపై మెట్రో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించి ఆన్‌లైన్ టికెటింగ్, స్కానింగ్ సేవలను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## కాన్పూర్-మధురై మధ్య ప్రత్యేక రైళ్లు

**వరంగల్, ఆగస్ట్ 29 (జనంసాక్షి) :** కాన్పూర్ సెంట్రల్– మధురై మార్గంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ సెప్టెంబర్ 2 నుంచి రెండు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. నవంబర్ 28 వరకు ఈ రైళ్లు కాన్పూర్ సెంట్రల్– మధురై మధ్య నడుస్తాయి. కాన్పూర్ సెంట్రల్ – మధురై (01925) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 2 నుంచి నవంబర్ 25 వరకు ప్రతీ బుధవారం ఉదయం 8.10 గంటలకు కాన్పూర్ సెంట్రల్ నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 7.15 గంటలకు మధురై చేరుకుంటుంది. అదే విధంగా మధురై–కాన్పూర్ సెంట్రల్ (01926) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 5 నుంచి నవంబర్ 28 వరకు ప్రతీ శనివారం తెల్లవారుజామున 2.30 గంటలకు మధురై నుంచి బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు కాన్పూర్ సెంట్రల్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు రెండు తెలుగు రాష్ట్రాల్లోని సిరిపూర్ కాగజ్‌నగర్, రామగుండం, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వేస్టేషన్‌లలో ఆగుతాయి. వీటిలో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, థర్డ్ ఏసీ ఎకానమి, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని దక్షిణమధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఎ. శ్రీధర్ శనివారం తెలిపారు.

## కొత్త కారు ప్రారంభంలో విషాదం

- అదుపుతప్పి మామపైకి దూసుకెళ్లిన కారు

**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** కొత్త కారు కొన్న ఓ కుటుంబం సంతోషం నిమిషాల వ్యవధిలోనే విషాదంగా మారింది. కారుకు పూజ చేయించడం కోసం అల్లుడితో పాటు గుడికి వెళ్లిన మామ.. అదే కారు కిందపడి ప్రాణాలు కోల్పోయారు. నగరానికి చెందిన ఓ దంపతులు ఇటీవల కొత్త కారును కొనుగోలు చేశారు. దానికి పూజ చేయించేందుకు తమ బంధువు(మామయ్య) రామచంద్రరావును ఆహ్వానించారు. దీంతో అల్లుడు, కుమార్తెతో కలిసి పెద్దమ్మగుడికి వెళ్లారాయన. అల్లుడు కారును డ్రైవింగ్ చేస్తుండగా.. ఒక్కసారిగా అదుపుతప్పి రామచంద్రరావు మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన కుటుంబసభ్యులు.. హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎంఐఎం ఎమ్మెల్సీ రహ్మత్ సస్పెన్షన్

- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని పార్టీ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌పై పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన పార్టీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేసినట్లు పార్టీ జాయింట్ సెక్రటరీ ఎస్ఏ హుస్సేన్ అన్వర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మిర్జా రహ్మత్ బేగ్ తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా పత్రాన్ని వెంటనే శాసన మండలి చైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించారు. నాలుగు రోజుల క్రితం అత్తాపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని రహ్మత్ బేగ్‌పై ఆరోపణలు వచ్చాయి. అయితే.. ఈ ఆరోపణలే పార్టీ నిర్ణయానికి కారణమని ఎంఐఎం అధికారికంగా వెల్లడించలేదు. ప్రస్తుతం ఆయనపై పార్టీ తీసుకున్న చర్య రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## నేడు నీట్ పిజి ఎంట్రెన్స్ టెస్ట్

**వరంగల్, ఆగస్ట్29 (జనంసాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం జరగనున్న నీట్ పీజీ–2026 పరీక్షల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా చేరరాదని ఆమె సూచించారు. ఈ ప్రాంతాల్లో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మైకులు, డీజేలతో ఊరేగింపులకూ అనుమతి ఉండదన్నారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల పరిసరాల్లోని ఇంటర్నెట్ కేంద్రాలు, జిరాక్స్ దుకాణాలు, స్టేషనరీ షాపులను మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ కోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిఘాను మరింత పెంచామని, అవసరమైన సమాచారం సేకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# భిన్నత్వంలో ఏకత్వం దేశ సంస్కృతి

సంపాదకీయం

ప్రపంచం నేడు సెక్యులరిజం పునాదులపై పరిఢవిల్లుతోంది. రాజ్యం మతం నుంచి బయటకు వచ్చి, పౌరులందరినీ సమానంగా చూడాలనే భావన ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలకు మూలాధారంగా మారింది. భూమిపై ఏర్పడే భౌతిక ప్రభుత్వానికి శాంతిభద్రతలను కాపాడటం, నేరాలను అదుపు చేయడం, పౌరుల హక్కులను రక్షించడం వంటి బాధ్యతలు ఉంటాయి. పాలనలో మతపరమైన జోక్యం ఉండకూడదనే ఆలోచన కూడా ఈ క్రమంలోనే బలపడింది.

మతం వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించినది. రాజ్యం మాత్రం ప్రతి పౌరుడికీ సమానమైనదిగా ఉండాలి. ఈ తాత్విక భావన ఆధునిక కాలంలో పుట్టినది మాత్రమే కాదు. ప్రాచీన తత్వవేత్తల ఆలోచనల్లోనూ సమిష్టి పాలన, పౌరుల భాగస్వామ్యం, మెజారిటీ ఆధిపత్యానికి పరిమితులు ఉండాలనే భావనలు కనిపిస్తాయి. మెజారిటీ పేరుతో ఒక వర్గాన్ని నిరంతరం విస్మరిస్తే, ఆ వర్గం సమాజంలో అంతర్గత శత్రువుగా మారే ప్రమాదం ఉందని అప్పుడే గుర్తించారు. అందుకే ప్రజలందరినీ కలుపుకొని సాగించే పాలనే స్థిరమైన పాలన.

కాలం మారింది. ప్రపంచం ఆధునికత వైపు ప్రయాణించింది. కులం, మతం వంటి సంప్రదాయ గుర్తింపులను మాత్రమే ఆధారంగా చేసుకున్న సామాజిక వ్యవస్థల నుంచి బయటకు వచ్చి హేతువాదం, శాస్త్రీయ ఆలోచన, మానవ హక్కులు, వ్యక్తి స్వేచ్ఛ వైపు ప్రపంచ సమాజం అడుగులు వేసింది. ఆవిష్కరణలు, పారిశ్రామిక విప్లవం, శాస్త్రసాంకేతిక అభివృద్ధి నవీన యుగానికి బాటలు వేశాయి. సమాజం నిరంతరం పరివర్తన చెందుతున్నప్పుడు, గతంలోని విలువలను అందరికీ ఒకే ప్రమాణంగా రుద్దడం ఆధునిక ప్రపంచ స్వభావానికి విరుద్ధం.

ప్రపంచంలోని ప్రతి దేశానికీ తనదైన చరిత్ర ఉంటుంది. సంప్రదాయం ఉంటుంది. సాంస్కృతిక ప్రత్యేకత ఉంటుంది. పౌరులు తమ ఇళ్లలో తమకు నచ్చిన మత విశ్వాసాలను, ఆచారాలను పాటించవచ్చు. అది వారి వ్యక్తిగత స్వేచ్ఛ. కానీ రాజ్యం మాత్రం ఏ ఒక్క మతానికి, కులానికి లేదా వర్గానికి చెందదు. అది మొత్తం ప్రజలది. ప్రజాస్వామ్య రాజ్యం తన పౌరులను విశ్వాసాల ఆధారంగా విడదీయకుండా, హక్కులు మరియు బాధ్యతల పరంగా సమానంగా చూడాలి.

**భారతదేశం వంటి భిన్నత్వంతో కూడిన దేశానికి ఈ సూత్రం మరింత కీలకం. భిన్న మతాలు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులు, భిన్న కులాలు, భిన్న జీవన విధానాలు కలిసి ఉన్న సమాజంలో మెజారిటీ ఆధిపత్యం కంటే సమాన పౌరసత్వమే దేశ ఐక్యతకు పునాది. రాజ్యాంగం అందించిన సెక్యులరిజం, ప్రజాస్వామ్యం, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం వంటి విలువలే ఈ దేశాన్ని కలిపి ఉంచే బలమైన బంధాలు.**

ప్రపంచ దేశాలు ఏ దిశగా ప్రయాణిస్తున్నాయి? ఆధునిక సమాజాలు ఎక్కడ నిలబడ్డాయి? మనం మాత్రం ఎలాంటి విభజన రేఖలను గీస్తున్నాం? అనే ప్రశ్నలే ఇప్పుడు ప్రధానమైనవి. సమాజాన్ని వెనక్కి తీసుకెళ్లే గుర్తింపుల రాజకీయాల కంటే, భవిష్యత్తు వైపు నడిపించే ఆధునిక, శాస్త్రీయ, మానవతా దృక్పథం అవసరం. పౌరుల ఇళ్లలో మతం ఉండవచ్చు; వారి ఆరాధనలో సంప్రదాయం ఉండవచ్చు. కానీ ప్రజా జీవితంలో రాజ్యాంగమే అత్యున్నత విలువగా ఉండాలి. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ, ప్రతి పౌరుడికి సమాన గౌరవం, సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన దేశభక్తి. భారతదేశాన్ని ముందుకు నడిపించగల అమృతధార కూడా అదే.

# యూఏపీఏ - చట్టమా? లేక విచారణే శిక్షగా మారిన వ్యవస్థా?

ఒక ప్రజాస్వామ్య దేశాన్ని అంచనా వేయాలంటే కేవలం ఎన్నికల వ్యవస్థను చూడటం సరిపోదు. అధికారాన్ని ఎలా వినియోగిస్తున్నది, చట్టాలను ఎలా అమలు చేస్తున్నది, భిన్నాభిప్రాయాలను ఎంత మేరకు సహిస్తున్నది, వ్యక్తిగత స్వేచ్ఛకు ఎంత విలువ ఇస్తున్నదో కూడా చూడాలి. రాజ్యాంగం రాష్ట్రానికి అధికారాలను ఇచ్చినట్టే పౌరులకు హక్కులను కల్పించింది. ఈ రెండింటి మధ్య సమతుల్యతే ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష.

దేశ సమగ్రత, జాతీయ భద్రతను కాపాడేందుకు ప్రత్యేక చట్టాలు అవసరమే. అదే సమయంలో అవి రాజ్యాంగ పరిమితుల్లోనే అమలవ్వాలి. ఈ నేపథ్యంలో చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం యూఏపీఏ (Unlawful Activities (Prevention) Act)పై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ ప్రాధాన్యమైనది. ఉగ్రవాదం, వేర్పాటువాద హింస, తీవ్రవాద నెట్‌వర్కులను ఎదుర్కోవడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. అయితే దాని కఠినమైన బెయిల్ నిబంధనలు, సుదీర్ఘ విచారణలు, దర్యాప్తు అధికారాలు, శిక్షల శాతం వంటి అంశాలు న్యాయ, రాజకీయ, రాజ్యాంగపరమైన చర్చలకు కేంద్రంగా మారాయి.

యూఏపీఏ 1967లో అమల్లోకి వచ్చింది. 2004, 2008, 2012, 2019 సవరణలతో దీని పరిధి విస్తరించింది. ముఖ్యంగా వ్యక్తులను కూడా ఉగ్రవాదులుగా ప్రకటించే అవకాశం, దర్యాప్తు అధికారాల విస్తరణ వంటి అంశాలు చర్చకు వచ్చాయి. ప్రభుత్వాలు వీటిని జాతీయ భద్రత అవసరాలుగా సమర్థించగా, ప్రతిపక్షాలు, పౌరహక్కుల సంఘాలు దుర్వినియోగం జరిగే అవకాశాలపై ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రజాస్వామ్యంలో చట్టం ఎంత కఠినమైనదైనా, దాని అమలు న్యాయబద్ధంగా ఉండాలి. నేరస్థుడు తప్పించుకోకూడదు; అదే సమయంలో నిర్దోషి అనవసరంగా శిక్షించబడకూడదు.

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం 2019-2023 మధ్య దేశవ్యాప్తంగా 10,440 మంది యూఏపీఏ కింద అరెస్టు కాగా, 335 మందికి మాత్రమే శిక్షలు నమోదయ్యాయి. సంవత్సరాల వారీగా 2019లో 1,948 అరెస్టులు, 34 శిక్షలు; 2020లో 1,321 అరెస్టులు, 80 శిక్షలు; 2021లో 1,621 అరెస్టులు, 62 శిక్షలు; 2022లో 2,636 అరెస్టులు, 41 శిక్షలు; 2023లో 2,914 అరెస్టులు, 118 శిక్షలు నమోదయ్యాయి. ఈ గణాంకాలను నేరుగా అరెస్టు శిక్ష నిష్పత్తిగా చూడటం సరికాదు. ఒక ఏడాది నమోదైన కేసులు అదే ఏడాది తీర్పుకు రావు. అయినప్పటికీ, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, విచారణ ఆలస్యం, తక్కువ శిక్షల సంఖ్య దర్యాప్తు నాణ్యత, న్యాయవ్యవస్థ సామర్థ్యం, విచారణ వేగంపై ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఇక్కడే ప్రధాన ప్రశ్న తలెత్తుతోంది.

**విచారణే శిక్షగా మారుతోందా?**

యూఏపీఏలోని సెక్షన్ 43డి(5) కారణంగా బెయిల్ పొందడం సాధారణ క్రిమినల్ కేసులతో పోలిస్తే కష్టతరంగా ఉంటుంది. కేసులోని ప్రాథమిక ఆధారాలను పరిశీలించినప్పుడు ఆరోపణలు మొదటి చూపులో నిజమని కోర్టుకు అనిపిస్తే బెయిల్‌పై కఠిన పరిమితులు ఉంటాయి. ప్రభుత్వం దీనిని తీవ్రమైన జాతీయ భద్రతా నేరాల్లో అవసరమైన రక్షణగా పేర్కొంటుంది. విమర్శకులు మాత్రం విచారణ పూర్తికాకముందే నిందితులు దీర్ఘకాలం జైలులో ఉండాల్సి వస్తోందని వాదిస్తున్నారు.


బెయిల్ అనేది నేరం నుంచి విముక్తి కాదు. విచారణ పూర్తయ్యే వరకు వ్యక్తిగత స్వేచ్ఛను కొనసాగిస్తూ, కోర్టు షరతులకు లోబడి విచారణను ఎదుర్కొనే అవకాశం మాత్రమే. ఒక వ్యక్తి చివరకు నిర్దోషిగా విడుదలైనా, జైలులో కోల్పోయిన సంవత్సరాలు, కుటుంబ జీవితం, ఉపాధి, సామాజిక గౌరవం తిరిగి రావు. అందువల్ల విచారణ ఆలస్యం కేవలం న్యాయపరమైన సమస్య కాదు; అది కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును, ఉపాధిని, సామాజిక జీవితాన్ని ప్రభావితం చేసే మానవీయ సమస్య.

**రాజ్యాంగం చెప్పేదేమిటి?**

యూఏపీఏపై చర్చ రాజ్యాంగంలోని 19, 21, 22 అధికరణాలతో ముడిపడి ఉంది. అధికరణ 19(1)(a) భావప్రకటన స్వేచ్ఛను, 19(1)(బి) శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును, 19(1)(c) సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కును కల్పిస్తుంది. అయితే జాతీయ భద్రత, ప్రజా శాంతి, దేశ సమగ్రత వంటి కారణాలతో సహేతుకమైన పరిమితులు విధించవచ్చు. అధికరణ 21 జీవన హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుంది. సుప్రీంకోర్టు వివరణల ప్రకారం గౌరవప్రదమైన జీవితం, న్యాయమైన ప్రక్రియ, మానవ గౌరవం, వేగవంతమైన విచారణ, న్యాయ సహాయం వంటి అంశాలు కూడా దీని పరిధిలోకి వస్తాయి. అధికరణ 22 అరెస్టుకు కారణాలు తెలియ జేయడం, న్యాయవాదిని సంప్రదించే అవకాశం, చట్టబద్ధమైన గడువులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచడం వంటి రక్షణలను కల్పిస్తుంది.

**సుప్రీంకోర్టు చెప్పిన ముఖ్యమైన విషయాలు**

Maneka Gandhi v. Union of India (1978) తీర్పులో అధికరణ 21కు విస్తృత అర్థాన్ని ఇస్తూ, వ్యక్తిగత స్వేచ్ఛను పరిమితం చేసే ప్రక్రియ న్యాయబద్ధంగా, సహేతుకంగా, నిష్పాక్షికంగా ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. Hussainara Khatoon కేసులు (1979-80) విచారణ ఖైదీల సమస్యను వెలుగులోకి తెచ్చాయి. వేగవంతమైన విచారణ పొందడం కూడా జీవన హక్కులో భాగమని కోర్టు స్పష్టం చేసింది. State of Rajasthan v. Balchand (1977)లో "బెయిల్ సాధారణం, జైలు మినహాయింపు" అనే సూత్రం ప్రాచుర్యం పొందింది. Gudikanti Narasimhulu v.Public Prosecutor (1978)లో వ్యక్తిగత స్వేచ్ఛను దృష్టిలో ఉంచుకుని బెయిల్ విషయంలో యాంత్రికంగా వ్యవహరించ రాదని న్యాయమూర్తి వి.ఆర్. కృష్ణయ్యర్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా Union of India v. K.A. Najeeb (2021) కేసులో యూఏపీఏ కింద విచారణ అసాధారణంగా ఆలస్యం అయితే, వ్యక్తిగత స్వేచ్ఛను దృష్టిలో ఉంచుకుని కోర్టులు



బెయిల్ ఇవ్వగలవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ హక్కులు పూర్తిగా పక్కనపడిపోవని ఈ తీర్పు గుర్తుచేస్తుంది. Arup Bhuyan v. State of Assam కేసులో కూడా కేవలం ఒక సంస్థతో సంబంధం ఉందనే కారణంతో మాత్రమే శిక్ష విధించలేమని, నిర్దిష్ట సాక్ష్యాలు, చట్టపరమైన ప్రమాణాలు అవసరమని కోర్టు పేర్కొంది.

**విచారణ ఖైదీల సమస్య**

భారత జైళ్లలో అత్యధికులు విచారణ ఖైదీలేనని అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. అంటే కోర్టు ఇంకా నేరం నిరూపించకముందే వారు జైలులో ఉంటున్నారు. విచారణ ఖైదీ అంటే నేరస్థుడు కాదు. కానీ విచారణ ఆలస్యం వల్ల స్వేచ్ఛ కోల్పోవడం తీవ్రమైన సామాజిక సమస్య. చివరకు నిర్దోషిగా విడుదలైనా కోల్పోయిన సంవత్సరాలను తిరిగి ఇవ్వడం సాధ్యం కాదు.

అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలు కూడా ఇదే సూత్రాన్ని బలపరుస్తాయి. UDHR, ICCPR వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవం, న్యాయమైన విచారణ, నిర్దోషిత్వ భావనకు ప్రాధాన్యం ఇస్తాయి. భారతదేశం ICCPR సభ్యదేశం కావడంతో జాతీయ భద్రతా చట్టాల అమలులో రాజ్యాంగ విలువలతో పాటు మానవ హక్కుల ప్రమాణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**భద్రతా-స్వేచ్ఛల మధ్య సమతుల్యత**

యూఏపీఏ ఉండాలా లేదా అనేది మాత్రమే అసలు ప్రశ్న కాదు. ఉగ్రవాదం, తీవ్రవాద నెట్‌వర్కులు, విదేశీ ప్రేరిత హింసాత్మక కుట్రలను ఎదుర్కొనే సమర్థమైన చట్టాలు ప్రభుత్వానికి అవసరం. అదే సమయంలో నిర్దోషి వ్యక్తి విచారణ పూర్తికాకముందే సంవత్సరాల పాటు స్వేచ్ఛ కోల్పోకుండా ఉండే న్యాయపరమైన భరోసా కూడా అవసరం. పౌరహక్కుల సంఘాలు, న్యాయ వేత్తలు, సామాజిక ఉద్యమాలు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ వంటి వర్గాలు ఉద్యమకారులు, విద్యార్థులు, రచయితలు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మిక, రైతు నాయకులపై కొన్ని సందర్భాల్లో యూఏపీఏ ప్రయోగించడం ఆందోళనకరమని పేర్కొంటున్నాయి. ప్రజా ఉద్యమాలు, ప్రజాస్వామ్య నిరసనలను జాతీయ భద్రతా సమస్యలతో ముడిపెట్టకూడదని అవి వాదిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం జాతీయ భద్రత విషయంలో రాజీ పడలేమని, చట్టబద్ధమైన ప్రక్రియల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది.

జనంసాక్షి

అందువల్ల పరిష్కారం ఒకవైపు మాత్రమే లేదు. యూఏపీఏ వంటి చట్టాల అమలుపై నిరంతర న్యాయపరమైన పర్యవేక్షణ, పార్లమెంటరీ సమీక్ష, పారదర్శక దర్యాప్తు, వేగవంతమైన విచారణలు అవసరం. ప్రత్యేక కోర్టుల సామర్థ్యాన్ని పెంచడం, పెండింగ్ కేసులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించడం, కేసులను నిర్దిష్ట కాల వ్యవధిలో సమీక్షించడం, దర్యాప్తు సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, న్యాయ సహాయాన్ని అందు బాటులోకి తేవడం వంటి సంస్కరణలు అవసరం.

యూఏపీఏపై చర్చ చివరికి ఒక చట్టం గురించిన చర్చ మాత్రమే కాదు. అది భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం, రాష్ట్ర అధికారాల పరిమితి, పౌర హక్కుల భవిష్యత్తు గురించిన చర్చ. దేశ భద్రతను కాపాడుతూ పౌర స్వేచ్ఛలను ఎలా పరిరక్షించాలి? ఈ ప్రశ్నకు సమాధానం రాజ్యాంగబద్ధమైన సమతుల్యతలోనే ఉంది. చట్టం బలంగా ఉండాలి. కానీ న్యాయం అంతకంటే బలంగా ఉండాలి. రాష్ట్రం అప్రమత్తంగా ఉండాలి. కానీ పౌర స్వేచ్ఛ భయపడకూడదు. దేశం సురక్షితంగా ఉండాలి. అదే సమయంలో ప్రజాస్వామ్యం కూడా స్వేచ్ఛగా శ్వాసించాలి. చివరికి ప్రజాస్వామ్యాన్ని బలంగా నిలబెట్టేది కఠినమైన చట్టాలు మాత్రమే కాదు ఆ చట్టాలపై ప్రజలకు ఉండే విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేది శిక్షల తీవ్రత కాదు; న్యాయం నిష్పాక్షికత. చట్టం భద్రతను కాపాడాలి. న్యాయం స్వేచ్ఛను కాపాడాలి. ఈ రెండూ కలిసినప్పుడే ప్రజాస్వామ్యం సంపూర్ణంగా శ్వాసిస్తుంది.



మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ,
సెల్ : 78932 30218

# నాకు మా అమ్మ కావాలి?

**పాలుగారే ఈ పసివాడు ఏం పాపం చేసాడు? ఏం నేరం చేసాడు? తల్లి ఒడికి ఎందుకు దూరం అయ్యాడు? ఎవరు దూరం చేసారు? ఈ అంశానికి సంబంధించి, లోతైన చర్చ జరగాలి. గతనెల జూలై 23, 2026 న తీవ్రవాద కుట్రకేసులో, విశాఖపట్నంలోని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ప్రత్యేక న్యాయస్థానం.. 'చైతన్య మహిళా సంఘం' సభ్యులైన దేవేంద్ర, శిల్ప, స్వప్న లను దోషులుగా నిర్ధారించి, వారికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. వారిలో స్వప్న, ఈ పసివాడి తల్లి. అమ్మ ఒడిలో హాయిగా ఉండాల్సిన ఈ పసివాడు, తల్లి ప్రేమకు దూరమై తీవ్ర మనోవేదనకు గురౌతున్నాడు. అమ్మకోసం రాత్రి పూట, గుక్కపెట్టి ఏడుస్తున్నాడు! ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? ఆ తల్లి చేసిన నేరమేమి? ఆమె సాయుధ మావోయిస్టు పార్టీ సభ్యురాలు కాదు! ఆయుధం పట్టింది లేదు, ఎవరినీ హతమార్చింది లేదు! మరి ఎందుకీ శిక్ష? ఇప్పుడు ఉన్నది 'మావోయిస్టు రహిత భారతదేశం' అని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత.. మావోయిస్టు పార్టీ సభ్యులపై ఉన్న కేసులనే మానవీయంగా ఎత్తేయాల్సింది పోయి.. చట్టబద్ధంగా జీవిస్తున్న ప్రజాసంఘం కార్యకర్తలపై, ఈ అక్రమ కేసులు పెట్టి జైళ్లపాలు చేయడం.. ప్రజాస్వామ్య ప్రభుత్వం చేయవలసిన పనేనా? సాయుధ బాట వీడిన వాళ్లకు, చట్టబద్ధంగా పనిచేసే అవకాశం కల్పించడం అంటే ఇదేనా? ప్రభుత్వ నేతలారా ఆలోచించండి!**

మార్క్సిస్టు ఐడియాలజీ ఉన్న 'చైతన్య మహిళా సంఘం'లో, క్రియాశీలకంగా పనిచేసిన కార్యకర్తలు - దేవేంద్ర, శిల్ప, స్వప్న లు! అయితే ప్రభుత్వం దృష్టిలో, పోలీసుల దృష్టిలో ఈ సంఘం.. మావోయిస్టు పార్టీకి అనుబంధ సంఘం అనే ఆరోపణ ఉంది! సీఎంఎస్ తో పాటు, ఇంకా అనేక ప్రజాసంఘాల పట్ల, వాటి కార్యకలాపాల పట్ల కూడా, పోలీసులు చేస్తున్న ఆరోపణలు బలంగానే ఉన్నాయి! ఏదిఏమైనా సీఎంఎస్, మావోయిస్టు పార్టీకి అనుబంధ సంఘమా కాదా? అన్న చర్చను పక్కన పెడితే.. ప్రజలను సాయుధ విప్లవ పార్టీలలోకి వెళ్ళండి అని, ఏ ప్రజా సంఘం కార్యకర్తలు చెప్పరు! వీళ్లేకాదు, ప్రపంచంలో జరిగిన అనేక సాయుధ పోరాటాలలో.. సాయుధ విప్లవ పార్టీల పట్ల, సానుకూల వైఖరి ఉన్న ఏ ప్రజాసంఘాల నాయకులు కూడా, సాయుధ విప్లవోద్యమంలోకి ప్రజలను వెళ్ళమని చెప్పరు! అట్లా ఎవరైనా ఎక్కడైనా చెబితే.. అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది, చట్టప్రకారం నేరమే అవుతుంది! నిజానికి సాయుధ పోరాటంలోకి వెళ్లాలా వద్దా అన్నది, ఆ ప్రజల చైతన్య స్థితిని, వారి ఇష్టాన్ని బట్టి ఉంటుంది! ఈ కేసులో కీలక వ్యక్తి అయిన రాధ చైతన్య స్థితే, ఆమె మానసిక సంసిద్ధతే, ఆమె సాయుధ మావోయిస్టుగా మారడానికి కారణమైందే తప్పా .. ఈ మహిళా సంఘం కార్యకర్తల వల్ల ఆమె వెళ్లలేదు' అన్నది నిజం!

**నేడు ఈ సమస్య ఇంత జటిలం కావడానికి, పార్టీ అవలంభించిన చర్యలు కూడా ప్రధాన కారణమే!**

గతంలో చాలా చోట్ల అనేకమంది ఆడబిడ్డలు, మగ బిడ్డలు విప్లవోద్యమంలోకి వెళ్ళినప్పుడు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురై, మళ్లీ వారు వెనక్కి రావడానికి అనేక ప్రయత్నాలు చేస్తుండేవారు. తెలిసిన వాళ్ల ద్వారా చెప్పించేవారు. అంతేతప్పా, పోలీసు స్టేషన్ కు వెళ్లి కంప్లైంట్ ఇచ్చే పని చేయలేదు! ఎందుకంటే నిన్నటివరకు, ఇంటికి వచ్చిన సంఘ సభ్యులకు అన్నం పెట్టి ఆదరించారు కాబట్టి! అయితే ఈ తల్లిదండ్రుల ఆందోళనను గమనించిన పోలీసులు, కొన్ని చోట్ల ఆ పని చేస్తూ ఉంటారు. మరికొన్ని చోట్ల బలవంతంగా బెదిరించి కూడా, కంప్లైంట్ చేయిస్తుంటారు. ఇది విప్లవోద్యమాన్ని బలహీనపరచ డానికి, నిర్మూలించడానికి, పోలీసులు వేసే అనేక ఎత్తుగడల్లో ఇది ఒక పని. ఒక రకంగా ఈ పనులు, వారి విధి నిర్వహణలో భాగం కూడా! ఆ విధంగా 2017 లో, రాధ అనే అమ్మాయి మావోయిస్టు పార్టీలో చేరిన తర్వాత, వారి తల్లిదండ్రులు ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా, ఆనాడే ఎన్ఐఏ పోలీసులు ఈ ముగ్గురిమీదే కేసు ఫైల్ చేసి, కోర్టు ముందు హాజరు పరిచారు. ఈ ముగ్గురిలో ఇద్దరికీ, విచారణ పేరుతో బెయిలు రాకపోవడం వల్ల, కొంతకాలం జైల్లోనే ఉన్నారు. ఆ తర్వాత వీళ్లంతా, సంఘం కార్యకలాపాలకు దూరంగా ఉంటూ, పూర్తిగా తమ కుటుంబానికే పరిమితమై జీవిస్తున్నారు. ఈ విధంగా కొనసాగుతున్న ఈ కేసులో, ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకొని, ఈ సమస్య మరింత జటిలం కావడానికి.. పార్టీ నాయకత్వం అవలంబించిన చర్యలు కూడా, ఇక్కడ ప్రధాన కారణాలు అయ్యాయి!

2023 లో రాధ పోలీసులకు కోవర్టుగా మారిందని ఆధారాలు చూపిస్తూ, మావోయిస్టు పార్టీ రాధను చంపి ఘోరమైన తప్పు చేసింది! ఆ సంఘటన ప్రభావం వల్లనే, ఒక సాధారణ కేసు మరింత ప్రాధాన్యతను సంతరించుకుని, ఇప్పుడు ఈ ముగ్గురికీ, ఐదు సంవత్సరాల పాటు జైలు శిక్ష పడేలా చేసింది. ఇది ఎవరూ కాదనలేని బహిరంగ వాస్తవం! బిడ్డకోసం అప్పటికే పోలీసు కంప్లైంట్ ఇచ్చిన తల్లిదండ్రుల ఇంటికి, ఆ బిడ్డ పార్టీ చేతుల్లోనే హత్యకు గురికాబడితే, ఆ కుటుంబ సభ్యుల మానసిక స్థితి ఎట్లా ఉంటుంది? పార్టీ నాయకుల మీద వచ్చే ఆగ్రహం, కళ్ళ ముందు కనిపిస్తున్న ఈ ముగ్గురు కార్యకర్తల మీద వచ్చింది. వీళ్లకు కచ్చితంగా శిక్ష పడాలని, రాధ తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని మరింత గట్టిగా డిమాండ్ చేశారు.

ఏదిఏమైనా, విప్లవోద్యమంలో ప్రజా సంఘాల కార్యకర్తల పాత్ర ఎంత మేరకు ఉంటుందో, వివరంగా తెలిసిన ప్రభుత్వానికి.. ముందుచూపు లేకుండా, ఈ కేసులో ఉన్న కీలక వ్యక్తిని చంపిన పార్టీ నాయకత్వానికి మధ్య.. ఈ మహిళా సంఘం కార్యకర్తలు, ఒకరకంగా సమిధలు అయ్యారు! కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి! ఆ బాలుడు తల్లి లేనివాడయ్యాడు! ఈ వాస్తవ విశ్లేషణ కొంతమందికి ఇబ్బందిగా అనిపించవచ్చు. కానీ ఇప్పుడైనా నిజాలు మాట్లాడుకోవాలి. ఈ నిజాలు కొందరికి చేదుగానే ఉంటాయి, నిష్ఠూరంగానే ఉంటాయి. కానీ ఈ నిజాలే అంతిమంగా, మనందరి కళ్ళు తెరిపిస్తాయి! ఈ సమయంలో కూడా, "ఈ మొత్తం పరిస్థితికి రాజ్యమే కారణం అని, భూమి దద్దరిల్లేలా పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇచ్చే వాళ్ల వల్ల ఉపయోగం లేదు! మన తప్పిదాలను కూడా స్వయం విమర్శ చేసుకున్నప్పుడే, మంచి ఫలితాలు ఉంటాయి!

**రాధ విషయంలో మావోయిస్టు పార్టీ అవలంభించిన చర్యలను.. ఆనాడు ఈనాడు సమర్థించేవారిని, ఈ సందర్భంగా నేను సూటిగా ప్రశ్నిస్తున్నాను!**

స్వయం విమర్శే, సామాజిక విప్లవోద్యమాలకు దిక్సూచి వంటిదని వీళ్ళు ఎందుకు భావించరు? సరళ సంఘటనను సీరియస్ గా స్వయం విమర్శ చేసుకోకపోవడం వల్ల, సరియైన గుణపాఠాలు తీసుకోకపోవడం వల్ల, ఇప్పుడు రాధ సంఘటన పునరావృతం అయింది! దీని ఫలితం, ఈరోజు నాలుగు కుటుంబాలు బలై పోయాయి! ఈ నష్టాన్ని ఎవరు పూడుస్తారు? 'త్యాగం లేనిది, విప్లవం లేదు' అనే సమాధానాలు, వాస్తవాలను మరుగున పరచడం కోసం కాదు!

"మానవ సంబంధాలన్నీ, ఆర్థిక సంబంధాలుగా మారిపోతున్న





ఈ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ సమాజంలో.. రక్తబంధాలు, బంధుత్వాలు, ఆస్తులు, ఉద్యోగాలు అన్నీ వదులుకొని.. ఒక స్పష్టమైన రాజకీయ విప్లవ లక్ష్యంతో.. శ్రమను గౌరవించే, ఒక సమానత్వమైన నూతన సమాజాన్ని నిర్మాణం చేయాలని, పార్టీ నాయకత్వం చూపిన మార్గంలో ఉద్యమించడానికి వచ్చిన సహచరుల పట్ల, వర్గసంబంధ ప్రేమ కలిగి ఉండాలి! వారిలో వర్గచైతన్యాన్ని పెంపొందించాలి! రాజ్యం కుట్రను ఎదిరించలేని సహచరులను దూరం చేసుకోకుండా, వారిని మరింతగా ఎదిగించుకోవాలి! కోవర్టులుగా మారి తోటి సహచరులకు ప్రాణనష్టం కలిగించినప్పుడు, తప్పనిసరి పరిస్థితుల్లో సమిష్టి నిర్ణయంతో వారికి శిక్షలు అమలు పరచాలి! నష్టతీవ్రత తక్కువగా ఉన్నప్పుడు, వాళ్ళను వద్దనుకుంటే ఇంటికి పంపించాలి! వారితో ఉన్న కాంటాక్ట్స్ అన్నీ రద్దు చేసుకోవాలి! అంతేగానీ, వర్గ శత్రువులకు శిక్షలు విధించినట్లుగానే, సహచరులకు కూడా మరణశిక్షలు విధించడం, క్రూరమైన రాజ్యసంస్కృతి అవుతుందితప్పా, అది మానవీయ విప్లవ సంస్కృతి కాదు! ఎందుకంటే, ఆ తప్పుడు ధోరణులన్నీ వ్యవస్థీకృతమైన నేరాలు కాబట్టి.. అవి వ్యవస్థను మార్చడం ద్వారానే, పరిష్కరించబడడానికి అవకాశం ఉంటుంది కాబట్టి!"

**అడవి నుండి బయటకు వచ్చిన మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం, ఎందుకు ప్రేక్షకపాత్ర వహిస్తుంది?**

భారత రాజ్యాంగ ప్రకారం, సాయుధ పోరాట మార్గం తప్పే అయినా, అది భారతదేశ చరిత్రలోనే చెరగని ముద్ర వేసింది! ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యాలు, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా, ప్రజలు ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను నిర్మించుకోవాలనుకున్నారు. తమ అమూల్యమైన ప్రాణత్యాగాలతో చివరి నిమిషం వరకూ, మావోయిస్టు పార్టీకి అండగా ఉన్నారు. ఇప్పుడు ఆ పార్టీ లేదు, సాయుధ విప్లవోద్యమము లేదు. భారత ప్రభుత్వం ఉక్కు పాదంతో వాటిని అణచివేసింది. రక్తం ఏరులై పారింది. బతికి ఉన్న వారంతా, అడవి నుండి బయటికి వచ్చేసారు. కేంద్ర నాయకత్వం కూడా వచ్చింది. కానీ నమ్ముకున్న ప్రజలకు వాళ్ళు భరోసా ఇచ్చింది లేదు. ఆరు నెలల కాలం గడిచిపోయినా కూడా, ఉలుకూపలుకు లేదు! అందుకే ఈ సందర్భంగా నేను, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మాజీ నాయకత్వానికి, కొన్ని ప్రశ్నలు వేస్తున్నాను!

ప్రజలు తమ అసమాన త్యాగాలతో, ఈ దేశంలో విప్లవ పార్టీని నిర్మించుకున్నారు. మరొకవైపు శ్రామికవర్గ ప్రజల విముక్తి కోసం, శాస్త్రీయమైన 'మార్క్సిస్టు సిద్ధాంతం' గైడ్ లైన్ గా తోడుగా ఉంది. ఇంతటి అనుకూలమైన పరిస్థితులు కళ్ళ ముందు ఉన్నా కూడా, ఈ దేశంలో కమ్యూనిస్టు విప్లవోద్యమం ఎందుకు కనుమరుగైపోయింది? ఇందులో ప్రధానంగా నాయకత్వాల వైఫల్యాలు ఏమిటి? వంటిమొత్తం ఈ పరిస్థితి పైన, మీరు ఎప్పుడైనా సమీక్ష చేసుకున్నారా? స్వయం విమర్శ చేసుకున్నారా? ఒకవేళ చేసుకుంటే, ఆ కార్యాచరణ బహిర్గతం అవ్వాలి కదా? కనీసం ఉద్యమ సహచరులంతా ఎవరెవరు ఎక్కడ ఉన్నారో, ఏ పరిస్థితుల్లో ఉన్నారో తెలుసుకునే ప్రయత్నాలు చేసారా?

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం విఫలమైన తరువాత కూడా, దాన్ని సమీక్షించుకోకుండా, అందులో నుండి గుణపాఠాలు నేర్చుకోకుండా.. మళ్లీ సాయుధ పోరాట మార్గాలు ఎంచుకోవడం నాయకత్వం చేసిన అతి పెద్ద తప్పిదమనీ.. ఈ దేశంలో శ్రామిక వర్గ ప్రజల జీవన వికాసం కోసం, వారిని సామాజిక రాజకీయ చైతన్యంతో ఎదిగించుకోవడం కోసం.. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక పోరాటాలే శరణ్యమని, ఇప్పటికైనా గ్రహించారా? సాయుధ పోరాటం వల్ల నిర్బంధాలు నిషేధాలు పెరిగి, ఇంతకాలం ప్రజలకు దూరమయ్యాము. ఇప్పుడైనా ఒక ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక వేదికను నిర్మించాలి. మళ్లీ ప్రజలతో మమేకం అవ్వాలి. నమ్ముకున్న ప్రజలకు అండగా ఉండాలి అని, ఎందుకు ఆలోచించడం లేదు? ప్రజలంటే కేవలం, ఆదివాసులు మాత్రమే కాదు కదా? మనది త్యాగాల పార్టీ. అమరుల త్యాగాలు వృధా పోకూడదు. మనం నిరంతరం ప్రజల సమస్యల మీద ఉద్యమిస్తూ ప్రజలకు అండగా ఉన్నప్పుడే, ఆ త్యాగాలకు గౌరవం ఉంటుందనీ, మీరు ఎందుకు భావించడం లేదు! మనది వర్గ సమాజం అని, శాస్త్రీయంగా మనం భావిస్తున్నప్పుడు.. మీరు ఇప్పుడు సైలెంట్ గా ఉండడం అంటే, ఆ వర్గాలు రద్దయి, అసమానతలు పోయి సమానత్వం వచ్చిందా?

కగార్ ఆపరేషన్ లోనూ, అంతకు ముందుగానూ.. జైల్లో ఉన్న మావోయిస్టు పార్టీ సభ్యుల విడుదల గురించి; మావోయిస్టు పార్టీ సానుభూతిపరుల పేరుతో, అక్రమ కేసుల్లో విచారణకు కూడా నోచుకోకుండా, ఏళ్ల తరబడి జైల్లో మగ్గిపోతున్న వాళ్ళ విడుదల గురించి; ప్రజా సంఘాల కార్యకర్తలపై మోపబడిన అక్రమ కేసుల విచారణ గురించి - వారి విడుదల గురించి.. ఇప్పటివరకు మీరు, ఈ అంశం గురించి సీరియస్ గా ఎందుకు ఆలోచించడం లేదు! ప్రభుత్వాలతో ఎందుకు చర్చలు జరపడం లేదు? మీ సొంత బిడ్డలు కనబడకుండా తప్పిపోయినా, లేదా జైల్లో ఉన్నా, మీరు ఇట్లాగే వ్యవహరిస్తారా? నమ్ముకున్న ప్రజలను, ఉద్యమ సానుభూతిపరులను విస్మరించడం వర్గదృక్పథం అవుతుందా?

కామ్రేడ్ దేవ్ జీ, ముఖ్యంగా తల్లికి దూరమైన ఆ పసివాడ్ని చూడండి. ఐదు సంవత్సరాల పాటు కన్నతల్లి ప్రేమకు దూరంగా, ఆ పసిబిడ్డ ఈ నరకయాతన పడాల్సిందేనా? ఏమిటీ ఘోరం? ఆ పసివాడికి ప్రశ్నించే వయసే ఉంటే, పార్టీ నాయకత్వాన్ని - భారత ప్రభుత్వాన్ని ఈ విధంగా అడుగుతాడు..

"నాకు మా అమ్మ కావాలి! Where is my mother? మావోయిస్టు పార్టీ నిర్మాణంలో లేని మా అమ్మను, మావోయిస్టు అని మీరు ఎట్లా అంటారు? ఆమెపై కేసు ఎట్లా పెడతారు? ఆమెకు జైలు శిక్ష ఎట్లా వేస్తారు? ఇది ప్రజాస్వామిక దేశమేనా? పార్టీ నేతలు ఏం చేస్తున్నారు? మమ్మల్ని ఎందుకు బలి పశువులను చేసారు? నాకు మా అమ్మ కావాలి?" అని అడుగుతాడు. ఇలాంటి సంఘటనలప్పుడైనా కళ్ళు తెరవండి, స్పందించండి! జైల్లో మగ్గిపోతున్న ఉద్యమకారుల విడుదలకు, ఉద్యమ సానుభూతిపరుల విడుదలకు, కేంద్ర కమిటీ మాజీ నాయకులంతా ఐక్యమై, ప్రజలతో కలిసి ఉద్యమించాలి!

మూడు దశాబ్దాల కాలం సిపిఐ (మావోయిస్టు) పార్టీలో పనిచేసి, తెలంగాణ రాష్ట్ర మాజీ డిజిపి శివధర్ రెడ్డిగారి సమక్షంలో చట్టబద్ధమైన జీవితంలోకి వచ్చి, అత్యంత బాధ్యతాయుతంగా జీవిస్తున్న 'మాజీ మావోయిస్టు'నైన నేను.. ప్రస్తుత పరిస్థితి' గురించి, భారత ప్రభుత్వానికి, ఎన్ఐఏ అధికారులకు ఈ సందర్భంగా ఒక విజ్ఞప్తి చేస్తున్నాను!

మావోయిస్టు పార్టీలో పని చేసిన వాళ్లంతా, వాళ్ళ పట్ల సానుభూతి ఉన్నవాళ్లంతా, ఈ దేశ పౌరులే. ఇప్పటికీ ప్రజల ఆదరణ ఉన్నవాళ్లే. వాళ్ళంతా మీకు శత్రువులు కారు! మీరంతా ఆయుధాలు వదిలి చట్టబద్ధమైన జీవితంలోకి రండి! రాజ్యాంగ పరిధిలోనే, ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేయండి అని, భారత ప్రభుత్వం పిలిపిస్తే.. కొంత ఆలస్యంగానైనా సరే, అందరూ అడవి బాట వీడి, ప్రభుత్వం దగ్గరికి వచ్చి లొంగిపోయారు! వ్యక్తులుగానే కాదు, వందలాది మంది కామ్రేడ్స్, అధునాతన ఆయుధాలు పట్టుకుని వచ్చి, ప్రభుత్వం ముందు సరెండరయ్యారు! ప్రభుత్వం ఇచ్చిన పిలుపుకు విలువనిచ్చారు! మరి ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్వహించాల్సిన పాత్ర, అత్యంత బాధ్యతాయుతంగా ఉండాలి. జైల్లో శిక్షలు అనుభవిస్తున్న మావోయిస్టుల పట్ల, వారి సానుభూతిపరుల పట్ల మానవీయ దృక్పథంతో, వారిని జైలు జీవితం నుండి విముక్తిచేయాలి. కానీ అట్లా చేయడం లేదు. ప్రభుత్వం మావోయిస్టుల విషయంలో మాట తప్పిందనీ, పూర్తిగా కక్ష సాధింపు దిశగా వెళ్తోందనీ, ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే, స్పష్టంగా అర్థం అవుతుంది. సీఎంఎస్ కార్యకర్తలైన దేవేంద్ర, శిల్ప, స్వప్న లకు ఎన్ఐఏ కోర్టు ఐదు సంవత్సరాల పాటు శిక్ష విధించడం, అందరికీ చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇప్పుడు ఉన్నది 'మావోయిస్టు రహిత భారతదేశం' అని, భారత ప్రభుత్వం ప్రకటించిన తర్వాత, ఈ మహిళా సంఘం కార్యకర్తలకు ఐదు సంవత్సరాల జైలుశిక్ష వేయడం, కక్ష సాధింపు కాక మరేమిటి? ఈ ముగ్గురిమీద వచ్చిన ప్రధాన ఆరోపణ.. రాధ మిస్సింగ్ కేసు, మావోయిస్టు పార్టీ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారనే కదా! ఇప్పుడు ఆ రాధ లేదు, మావోయిస్టు పార్టీ కూడా లేదు! అలాంటప్పుడు ఆ భావజాల వ్యాప్తి పేరుమీద, ఈ ముగ్గురికీ ఐదు సంవత్సరాల శిక్ష వేయడం ఎంత అన్యాయం? ఇది నూటికి నూరు శాతం కక్షసాధింపు ధోరణి కాదా? ఇలాంటి చర్యల వల్ల లొంగిపోయిన మాజీ మావోయిస్టుల్లో.. ఒక అలజడిని, భయాన్ని, అభద్రతా భావాన్ని కలుగజేయడం కాదా? ఆలోచించండి..

ఓట్ల కోసం కోట్ల రూపాయలు కుమ్మరించి, పదవులు పొంది, అందిన కాడికి దోచుకుని, ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్న రాజకీయ నాయకుల పాలనలో.. ఆ ప్రజల వైపు నిలబడి, వారి హక్కుల కోసం పోరాడుతున్నది ఎవరు? ఆనాటి నుండి ఈనాటి వరకు వామపక్ష కమ్యూనిస్టులు, విప్లవకారులే అన్నది జగమెరిగిన సత్యం! ఒక్క మాటలో చెప్పాలంటే, దేశంలో రాజ్యాంగబద్ధమైన పాలన జరుగనప్పుడు, అప్పుడప్పుడు రాజ్యాంగేతర ఉద్యమాలు కూడా పుడుతూ ఉంటాయి. కనుమరుగవుతూ ఉంటాయి. ఇప్పుడు మావోయిస్టు పార్టీ కొనసాగించిన సాయుధ పోరాటం అంటే, అది గత చరిత్రే అవుతుందితప్పా, వర్తమానం కాదు! ఇప్పుడు రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక ఉద్యమాల ద్వారానే, ప్రజలను చైతన్యవంతం చేయాలి తప్పా, సాయుధ పోరాటాలకు ఈ దేశంలో ఇక తావు లేదు అని, మనకు గత వర్తమాన చరిత్ర తెలియజేస్తుంది. కాబట్టి, మాజీ మావోయిస్టుల పట్ల కక్ష సాధింపు ధోరణి కాకుండా, వారిని మానవీయ కోణంలో చూడాలని మనవి చేస్తున్నాను.

ఇక చివరిగా ప్రభుత్వానికి మరోసారి చేస్తున్న నా విజ్ఞప్తి.. పై ఫోటోలో ఉన్న ఆ పసివాడు, నా మనవడు. ఆ పసివాడి తల్లి స్వప్న, నా కూతురు (అన్న కూతురు). ప్రతి రోజు ఆ పసివాడు రాత్రి పూట నిద్రపోకుండా తల్లి కోసం ఏడుస్తూ ఉన్నాడు. అమ్మ కావాలి అంటున్నాడు. అటు జైల్లో ఉన్న మా కూతురు కూడా, కొడుకు కోసం దుఃఖిస్తూ ఉంది! మానసిక వేదనతో కుమిలిపోతోంది! దయచేసి ప్రభుత్వ నేతలు, పెద్దమనసుతో ఆలోచించండి. నా మనవడికి తల్లి ప్రేమను దూరం చేయకండి! మా కూతురు మీద ఉన్న కేసు కొట్టేసి, జైలు నుండి విడుదల చేయండి! అట్లాగే నా కూతురితో పాటు, ఉద్యమ సహచరులందరికీ కూడా, జైలు జీవితం నుండి విముక్తులను చేయండి! ప్రభుత్వాన్ని నమ్మి వచ్చిన మాజీ మావోయిస్టుల పట్ల, మానవీయ ప్రేమను చూపండి!

ముద్దగౌని సుభాష్ (రవి)
సామాజిక ఉద్యమ రచయిత
ఫోన్: 9000904284

# రేడియల్ రోడ్డు జంక్షన్‌పై రైతుల ఆందోళన

- ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సర్వే చేయడంతో రైతుల గుండెల్లో గుబులు
- డిజైన్‌ను పునఃపరిశీలించాలని తహసీల్దార్‌కు వినతి

**షాబాద్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రేడియల్ రోడ్డు జంక్షన్ నిర్మాణం కొరకు సర్వే నిర్వహించడంపై సంకేపల్లిగూడ, మల్లారెడ్డిగూడ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జంక్షన్ నిర్మాణం కోసం చేపడుతున్న సర్వేలో తమ సాగుభూములు పెద్దఎత్తున ప్రభావితమయ్యే అవకాశం ఉందని రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో రైతులు మాట్లాడుతూ... రేడియల్ రోడ్డు కూడలి నిర్మాణంలో భాగంగా సుమారు 46 ఎకరాల భూమి ప్రభావితమయ్యే అవకాశం ఉందని. జంక్షన్ డిజైన్‌లో ఒకవైపు తక్కువ విస్తీర్ణంలో, మరోవైపు ఎక్కువ విస్తీర్ణంలో భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని వారు పేర్కొన్నారు. దీంతో తమ సాగుభూములకు అన్యాయం జరుగుతోందని, పెగ్ మార్కింగ్‌ను అడ్డుకున్న రైతులు తమకు ముందస్తు సమాచారం లేదా నోటీసులు ఇవ్వకుండానే అధికారులు సర్వే నిర్వహించి భూముల్లో పెగ్ మార్కింగ్ చేపట్టడం అభ్యంతరం వ్యక్తం చేశారు.



సర్వే ప్రక్రియతో తమ భూములు ఎంత మేరకు కోల్పోతామో స్పష్టత లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. భూములే తమ జీవనాధారమని, సాగుభూములు కోల్పోతే కుటుంబాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ క్రమంలో రైతులు పెగ్ మార్కింగ్‌ను అడ్డుకుని తమ అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అనంతరం షాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రైతులకు నష్టం వాటిల్లకుండా డిజైన్ మార్చాలి రేడియల్ రోడ్డు నిర్మాణం, జంక్షన్ అభివృద్ధి వంటి ప్రభుత్వ పనులకు తాము వ్యతిరేకం కాదని రైతులు స్పష్టం చేశారు. అయితే అభివృద్ధి పనుల పేరుతో కొంతమంది రైతుల భూములపైనే అధిక భారం పడేలా డిజైన్ రూపొందించవద్దని కోరారు. జంక్షన్ డిజైన్‌ను సాంకేతికంగా మరోసారి పరిశీలించి, సాధ్యమైనంత మేరకు రైతుల భూములు తక్కువగా ప్రభావితమయ్యేలా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఏలుగంటి మధుసూదన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి... రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూములు కోల్పోయే పరిస్థితిపై రైతులు వ్యక్తం చేస్తున్న ఆందోళనను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రేడియల్ రోడ్డు జంక్షన్ డిజైన్‌ను మరోసారి పరిశీలించాలని తహసీల్దార్‌కు సూచించారు. రేడియల్ రోడ్డు జంక్షన్ డిజైన్‌పై మూడు రోజుల్లో పునఃపరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. రైతుల భూములకు సంబంధించి పూర్తి వివరాలను పరిశీలించి, సాధ్యమైన మేరకు సమస్యకు పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## అగ్రి వర్సిటీలో అగ్రి బీఎస్సీ కౌన్సిలింగ్ ప్రారంభం



**రాజేంద్రనగర్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2026–27 విద్యా సంవత్సరానికి బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల రెగ్యులర్ సీట్ల భర్తీకి గురువారం కౌన్సిలింగ్ ప్రారంభమైంది. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఈ నెల 29 వరకు తొలి విడత కౌన్సిలింగ్ కొనసాగనుంది. ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్. వేణుగోపాల రెడ్డి, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె. ఝాన్సీ రాణి కౌన్సిలింగ్‌ను ప్రారంభించారు. తొలిరోజు వివిధ కళాశాలల్లో 213 సీట్లు భర్తీ కాగా, మొదటి మూడు సీట్ల కేటాయింపు పత్రాలను కొత్తపల్లి రోష్ని, పూల పూజ, ఎం.ఏ. హాదీకి అందజేశారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎం. మల్లారెడ్డితో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌పీఎస్ బేగంపేట్‌లో అత్యాధునిక సైన్స్ థీమ్ పార్క్ ప్రారంభం



**ఖైరతాబాద్, ఆగస్ట్ 29 (జనం సాక్షి) :** బేగంపేట్‌లోని ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్)లో విద్యార్థుల్లో జిజ్ఞాస, విమర్శనాత్మక ఆలోచన, శాస్త్రీ య దృక్పథాన్ని పెంపొందించేందుకు అత్యాధునిక సైన్స్ థీమ్ పార్క్‌ను ప్రారంభించినట్లు హెచ్‌పీఎస్ బేగంపేట్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్కంద్ బాలి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడు తూ పద్మశ్రీ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ దొరైరాజన్ బాలసుబ్రమణియన్ ఈ పార్క్‌ను ప్రారంభించి అభినందించినట్లు తెలిపారు. భౌతికశాస్త్రం, గణి తం, జీవశాస్త్రం, అంతరిక్ష శాస్త్రం, ఇంజనీరింగ్‌కు సంబంధించిన 50 ఇంటరాక్టివ్ ప్రదర్శనలు, వర్కిం గ్ మోడళ్లు, 17 ఇండోర్ ఎగ్జిబిట్లు ఇందులో ఉన్నా యి. న్యూటన్ మూడో నియమం, పైథాగరస్ సిద్ధాంతం, పెరిస్కోప్, 3డీ డీఎన్ఏ మోడల్, ఆర్చ్ బ్రిడ్జ్, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ నమూనాలు ప్రధా న ఆకర్షణలుగా ఉన్నాయన్నారు. విద్యార్థులు సైన్స్‌ను చూడటం, తాకటం, అనుభవించడం ద్వారా నేర్చుకునేలా పార్క్‌ను రూపొందించినట్లు తెలిపారు. పరిశీలించడం, ప్రశ్నించడం, ఊహించ డం, అన్వేషించడం, కనుగొనడం, వివరించడం అనే అభ్యాస విధానంతో పార్క్‌ను రూపొందించి నట్లు తెలిపారు. ప్రొఫెసర్ దొరైరాజన్ బాలసుబ్ర మణియన్ మాట్లాడుతూ అనుభవపూర్వక అభ్య సనం విద్యార్థుల్లో ప్రశ్నించే, పరిశోధించే, శాస్త్రీయం గా ఆలోచించే నైపుణ్యాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

# ఓబీసీ కమిటీలను పునర్నిర్మించి పార్టీని మరింత పటిష్టం చేస్తాం

- డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి

**నారాయణపేట, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ఓబీసీ కమిటీలను పునర్నిర్మించి కాంగ్రెస్ పార్టీ నీ మరింత పటిష్టం చేస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కే.ప్రశాంత్ రెడ్డి అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో (సీవీఆర్ భవన్) జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఓబీసీ కమిటీల పునర్నిర్మా ణం,పార్టీ సంస్థాగత బలోపే తంపై సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టి పి సి సి పరిశీలకులు కోట్ల చంద్ర య్య హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడు తూ,ఓబీసీ కమిటీలను పునర్నిర్మించి పార్టీని మరింత పటిష్టం చేస్తామని అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు,ఓబీసీ వర్గాలను కాంగ్రెస్ పార్టీతో మరింత అనుసంధానం చేసి పార్టీ



కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఓబీసీ కమిటీలను పునర్నిర్మించ డంపై సమావేశంలో విస్తృ తంగా చర్చించారు. జిల్లా ఓబీసీ చైర్మన్‌తో పాటు మండల, టౌన్ ఓబీసీ అధ్యక్షుల నియామకాలు, మండల, గ్రామ,టౌన్ కమిటీల ఏర్పాటు,అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఓబీసీ కమిటీల పునర్నిర్మాణంపై సమీక్షించారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులు,కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పి స్తూ,అన్ని వర్గాలకు సము చిత ప్రాతినిధ్యం ఉండేలా కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షులు మండల అధ్యక్షులకు సూచించారు. జిల్లా,రాష్ట్రస్థాయి ఓబీసీ కమిటీలలో నియమించాల్సిన అర్హులైన నాయకుల పేర్లను సేకరించి పార్టీ అధిష్ఠానానికి ప్రతిపా దించాలని అన్నారు. పటిష్టమైన ఓబీసీ కమిటీల నిర్మాణం ద్వారా పార్టీని గ్రామస్థాయి నుంచి మరిం త బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై సమర్థవంతం గా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో జిల్లా ప్రధాన కార్య దర్శి ఎండి. సలీం, ఓబీసీ జిల్లా అధ్యక్షులు గొల్ల కృష్ణ య్య, మాజీ మండల అధ్య క్షుడు కె. నరహరి, దామర గిద్ద మండల అధ్యక్షుడు బర్ల హన్మంతు, కృష్ణయ్య, సుభాష్ గౌడ్, జట్రం లక్ష్మయ్యగౌడ్,వెంకట్రాములు, రవికుమార్ చారి, బండి. అనంద్,తదితరులు పాల్గొన్నారు.

# కంది పంట సాగుకు ప్రోత్సాహం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**షాబాద్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** శాస్త్రీయ పద్ధతుల్లో కంది పంట సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించవచ్చని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మిషన్ ఫర్ ఆత్మ నిర్భర్త ఇన్ పల్సెస్ 2026–27 పథకం కింద మండలంలో కంది పంటను ప్రోత్సహించేందుకు 85 హెక్టార్ల విస్తీర్ణంలో క్లస్టర్ ఆధారిత బ్లాక్ డైమాన్ స్టేషన్ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించి, పంట సాగు ప్రారంభ దిశ నుంచే సాంకేతిక సూచనలు అందిస్తూ పంట నమోదు చేసి అధిక దిగుబడికి ప్రోత్సాహం అందిస్తూ. అవసరమైన ఇన్పుట్ లను రైతులకు పంపిణీ చేసి ప్రదర్శన క్షేత్రాలను వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ పిడిఏ పద్మజ, కెవికె హయత్ నగర్ శాస్త్రవేత్త దిలీప్, షాబాద్ ఎఫ్పిఓ సీఈఓ చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు, సర్పంచులు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ ఉద్వాసన'

- 29 దేవాలయాల్లో పవిత్ర వ్యర్థాల సేకరణ
- ఏడు గుల్ల దేవాలయాలను సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్



**హైదరాబాద్, ఆగస్ట్ 29 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావాలను గౌరవించే లక్ష్యంతో జీహెచ్‌ఎంసీ చేప ట్టిన 'ప్రాజెక్ట్ ఉద్వాసన' ప్రత్యేక దైవిక వ్యర్థాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో 29 దేవాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అమీర్‌పేట్ సర్కిల్ పరిధిలోని సనత్‌నగర్‌లో ఏడు గుల్ల దేవాలయా లను సందర్శించి 'ఉద్వాసన పూజ' నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ఆలయాల నిర్వాహకులు,భక్తు లు, స్థానిక పౌరుల నుంచి సానుకూల స్పందన లభించింది. పాత ఫ్రేములు, విగ్రహాలు, క్యాలెండ ర్లు, ఇతర పవిత్ర వస్తువులను గౌరవప్రదంగా సేక రించి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వ హించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వాటిని అప్పగించారు. సేకరించిన వస్తువుల ను స్వచ్ఛంద సేవకులు వాటి స్వభావాన్ని బట్టి విడదీసి, వేర్వేరు విభాగా లుగా వర్గీకరిస్తున్నారు. పునర్వినియోగానికి అనువైన వస్తువులను జాగ్ర త్తగా రీసైక్లింగ్ కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టారు. పవిత్ర వస్తువుల నిర్వహణలో ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ, ప ర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ కా ర్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. 'ప్రాజెక్ట్ ఉద్వాసన'ను ఆలయ సంఘా లు, పౌరులు, స్వచ్ఛందసం స్థలు అభినందించిన ట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొన్నారు.

## రా చెరువులో కలకలం...!

- చేపల మృతిపై హైడ్రా అధికారుల పరిశీలన
- వివిధ ప్రాంతాల నుంచి నీటి నమూనాల సేకరణ
- పిహెచ్, టిడీఎస్ స్థాయిలు అధికంగా ఉన్నట్లు గుర్తింపు

**బోడుప్పల్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** బోడుప్పల్‌లోని రాచెరువులో పెద్ద సంఖ్యలో చేపలు మృతి చెందిన ఘటన కలకలం రేపుతోంది. చేపల మృతికి చెరువు నీటి కాలుష్యమే కారణమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగారు. శనివారం హైడ్రా ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ శ్రీవల్లి రాచెరువును సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆమె.. వివిధ



పాయింట్ల నుంచి నీటి నమూనాలను సేకరించారు. అనంతరం చెరువు పక్కనే ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కూడా పరిశీలించారు. చెరువు నీటిలో పిహెచ్ విలువ, టిడీఎస్ స్థాయిలు అధికంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. సేకరించిన నీటి నమూనాలను పరీక్షించిన అనంతరం నీటిలో కాలుష్యానికి సంబంధించిన అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. చేపల మృతికి అసలు కారణం ఏమిటనే దానిపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, చేపల మృతికి కారణాలను పూర్తిస్థాయిలో గుర్తించాలని ముదిరాజ్ సంఘం బోడుప్పల్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం బోడుప్పల్ అధ్యక్షుడు దొంతి నవీన్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఈగ నిఖిల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తితోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్



**గోపాలపేట, ఆగస్టు 29 (జనంసాక్షి) :** గోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడిగా పేరుగాంచిన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిల్లెల సురేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఫొటోలు దిగారు. పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# చేవెళ్ల అభివృద్ధికి రూ.5.46 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులు

- రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం
- ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**చేవెళ్ల, ఆగస్టు 29 (జనంసాక్షి) :** చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నిధులను ప్రాధాన్యత క్రమంలో వినియోగిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు, రామన్నగూడ వార్డుతో పాటు చేవెళ్ల మండలంలోని ఆలూరు, నాంచేరి గ్రామాల్లో ఎంపీ లాడ్స్ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర ప్రాథమిక సదుపాయాల అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నిధులను ప్రాధాన్యతగా కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు తన ఎంపీ లాడ్స్



నిధుల ద్వారా చేవెళ్ల నియోజకవర్గానికి మొత్తం రూ.5.46 కోట్ల నిధులను కేటాయించినట్లు ఎంపీ వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, పట్టణ ప్రాంతంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలను మెరుగుపరిచేందుకు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు ఎంతో కీలకమని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, అందిస్తున్న నిధుల ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎంపీ లాడ్స్ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ చేవెళ్ల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ దేవర మనీషా అనంత్ రెడ్డితో కలిసి ఆయన రోడ్డును ప్రారంభించారు. నూతన సీసీ రోడ్డు నిర్మాణంతో కాలనీ ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయించి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు బండారి శైలజా ఆగి రెడ్డి, దేవర మనీషా అనంత్ రెడ్డి, కల్యాణి యాదగిరి, కరికె మీనాక్షి సత్యనారాయణ, పైండ్ల మధుసూధన్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, పెద్దోళ్ల దయాకర్, సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, ఆలూర్, నాంచెరి సర్పంచ్లు భాగ్యశేఖర్ గౌడ్, పులుమామిడి అశోక్, సీనియర్ కంజర్ల ప్రకాష్, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, కుంచం శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్‌లో 'స్కిన్ అటెలిర్ హాస్పిటల్' ప్రారంభోత్సవం



**నిజాంపేట్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ పరిధిలో డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కుమార్తె నూతనంగా ఏర్పాటు చేసిన 'స్కిన్ అటెలిర్ హాస్పిటల్' ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి , కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ , ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి స్కిన్ అటెలిర్ హాస్పిటల్‌ను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిని పరిశీలించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన చర్మ వైద్య సేవలను ఆధునిక వైద్య సదుపాయాలతో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఆసుపత్రి విజయవంతంగా కొనసాగి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
ఆదివారం
30 ఆగస్టు 2026

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలి

- అవార్డు పూర్తయిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- సాగునీటి విడుదల విషయంలో స్పష్టతతో ముందుకెళ్లాలి
- అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి
- సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 29 (జనం సాక్షి) :** జిల్లాలో పురోగతిలో ఉన్న వివిధ సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, అవార్డు పూర్తయిన రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.నెట్టెంపాడు,గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి ఇంకా అవసరమైన భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టుల వారీగా వివిధ మండలాల పరిధిలో సేకరించాల్సిన భూములపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి పారుదల, రెవిన్యూ, భూ సేకరణ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేందుకు సహకరించాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించినప్పటికీ జిల్లాలో వివిధ రిజర్వాయర్ల పరిధిలో కొంతమంది రైతులు వరి సాగు చేయడం జరిగిందన్నారు. జూరాల కుడి కాలువ పరిధిలో ఉన్న చివరి డిస్ట్రిబ్యూటర్స్ వరకు నీటి సరఫరాపై సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పష్టతతో ఉండాలన్నారు. పంట చేతికి వచ్చేవరకు రైతులు నష్టపోకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా ముందుకెళ్లాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల భూసేకరణకు ఉన్న అన్ని అడ్డంకులను అధిగమించి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళు_న్నామన్నారు. సంబంధిత శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేసి నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని వివిధ ప్యాకేజీల్లో ఇంకా చేయాల్సిన భూసేకరణను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. గట్టు ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ కూడా వేగవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో జూరాల ప్రాజెక్టుకే కొద్ది రోజులుగా నిరంతరం ఇన్ఫ్లో ఉండడం వలన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా పలు రిజర్వాయర్లను నింపుకోవడం జరుగుతుందన్నారు. జూరాల కుడి కాలువతో పాటు వివిధ రిజర్వాయర్ల పరిధిలో కొందరు రైతులు తమ పొలాల్లో వరి సాగు చేసినప్పటికీ సరైన ప్రణాళికను అవలంబిస్తే పంటలు చేతికొచ్చే వరకు సాగునీరు అందించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కొన్నేళ్లుగా జిల్లాలోని రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతంగా ఖరీఫ్, రబీ సీజన్లను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నప్పటికీ జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి వరద రావడంతో జిల్లాకు మేలు జరుగుతోందన్నారు. రైతులు ఆరుతడి పంటలతోనూ ప్రయోజనం పొందేలా ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం అవగాహన కల్పించడం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఇరిగేషన్ సిఈ రహీముద్దీన్,ఎస్ఈ కేశవరావు,ఆర్డీవో శ్రీనివాసరావు,పలు మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల వద్దకే వెళ్లి ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 29 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా పరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు, పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఉన్న వారి వద్దకే వెళ్లి ఆన్‌సైట్‌లో ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసు అధికారులను టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమకు ఏవైనా సమస్యలు, ఇబ్బందులు లేదా నేరానికి సంబంధించిన ఫిర్యాదులు ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, అవసరమైన సందర్భాల్లో అక్కడికక్కడే ఆన్‌సైట్ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలి అని ఆయన తెలిపారు.ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు, గాయపడిన బాధితులు, పిల్లలు/మైనర్లు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు, అలాగే దూరప్రాంతాల్లో ఉన్న బాధితులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాధితుల భద్రత, గౌరవం,గోప్యతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలకు పోలీస్ శాఖ పై నమ్మకం మరింత పెరిగేలా ప్రతి పోలీస్ అధికారి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి అని ఎస్పీ తెలిపారు.

## విద్యార్థులకు మెరుగైన విద్యా, మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ నర్సింగ రావు



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 28 (జనం సాక్షి) :** విద్యార్థులకు మెరుగైన విద్యా, మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. శనివారం ధరూర్ మండలంలోని గుడ్డెం దొడ్డి గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ,జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, తాగునీరు, పరిశుభ్రత తదితర సౌకర్యాలను పరిశీలించి, ప్రిన్సిపాల్, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు,వారి ఆరోగ్యం,భద్రత,సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతగా, పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వంటశాల, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. తాగునీరు,వసతి గృహాలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చలో సెక్రటరియేట్ జయప్రదం చేయండి



**తూప్రాన్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** మాలలకు విద్య ఉద్యోగ అవకాశాలో జరుగుతున్న అన్యాయం పై మాలల అన్యాయం చేసి రోస్టర్ విధానం పై రద్దు చేయాలని కోరుతూ ఈనెల 31న జరిగే చిరు సెక్రెటరీ కార్యక్రమం విజయవంతం చేయాలని తూప్రాన్ లో పోస్టర్ విడుదల చేశారు .ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల అశోక్ కుమార్ మెదక్ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ మన్నే భాను ప్రసాద్ తూప్రాన్ కౌన్సిలర్ భైరం సత్యలింగం మాజీ కౌన్సిలర్ మామిడి వెంకటేష్ కొరబోయిన ప్రవీణ్ ఏరూపుల సాయి ప్రసాద్ సామల అనిల్ మన్నే రవీందర్ మొదబోయిన ఎల్లం గురం రాము పాల్గొన్నారు.

## గద్వాలలో 'రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా' ర్యాలీ



**గద్వాల, ఆగస్టు 29 (జనం సాక్షి) :** దేశ సమగ్రత, ప్రగతి లక్ష్యంగా ఒంగోలుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, హైకోర్టు అడ్వకేట్ వెంకట్ చేపట్టిన 'కాశ్మీర్ టు కన్యాకుమారి' పాదయాత్ర శనివారం నాటికి విజయవంతంగా 71వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి శనివారం ఒక భారీ ప్రదర్శన, ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్వాల స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పాదయాత్రకు తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు.ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక యువత మరియు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గద్వాల పురవీధుల గుండా సాగిన ఈ ప్రదర్శన పొడవునా దేశభక్తి నినాదాలు మిన్నంటాయి. ఒంగోలు నుండి ప్రారంభమైన ఈ యాత్రకు ప్రతి ప్రాంతంలోనూ ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని అడ్వకేట్ వెంకట్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశంలో శాంతిభద్రతలు, యువతకు ఉపాధి మరియు ఆర్థిక ప్రగతి సాధించడమే ఈ యాత్ర యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి గొప్ప ఆశయంతో సాగుతున్న పాదయాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం, యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే మరియు స్థానిక నేతలు వెంకట్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, తదుపరి ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడాభివృద్ధే లయన్స్ క్లబ్ ఆశయం



**మునిపల్లి, ఆగస్టు 29 (జనం సాక్షి) :** విద్యార్థులకు విద్యతో పాటు శారీరక అభివృద్ధి కూడా ఎంతో ముఖ్యమని, ఆరోగ్యకరమైన శరీరంతోనే విద్యలోనూ రాణించగలరని శేరిలింగంపల్లి రీజియన్ కార్యదర్శి లయన్ మంగళపర్తి వెంకటేశం, అమీన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ కట్లె సిద్ధిరాములు అన్నారు. భారతీయ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమీన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం క్రీడా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు కప్పులు, జ్ఞాపికలు, పతకాలు, ధ్రువపత్రాలతో పాటు క్రీడా సామగ్రిని అందజేశారు. విద్యార్థుల క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు కే. నాగరాజు, కే. కరుణాకర్ రెడ్డి సేవలను వారు అభినందించారు. కార్యక్రమానికి దాతలు, కార్యక్రమ నిర్వహణ అధ్యక్షులు లయన్ కూర నాగరాజు, సహాధ్యక్షులు మునిపల్లి రమేష్ సహకారం అందించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సీ.హెచ్. కల్పన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ కే. కరుణాకర్ రెడ్డి, కోశాధికారి కే. నాగరాజు, మాజీ లయన్స్ జోన్ చైర్మన్ బి. కృష్ణాగౌడ్, లయన్స్ సభ్యులు పి. సురేందర్, జి. లింగం, పి. రమాకాంత్, ఉపాధ్యాయులు పి. శ్రీవిద్య, ఎం. శైలజ తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన




**నారాయణపేట, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనీ టి జీ ఈ జే ఏ సి పిలుపు మేరకు ఉద్యోగ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో కృష్ణా మండలంలో శనివారం నిరసన తెలిపారు. తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వము నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పి ఆర్ సి, డి ఏ లు ప్రకటిం చకుండా మేనిఫెస్టోలో పెట్టిన సిపిఎస్ రద్దు 317 జీవో బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులకు నేటికీ న్యాయం చేయకపోవడాన్ని మూడు నెలలు కావచ్చునా నేటికీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమును సరిగ్గా అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా నిరసించారు.ఈ సందర్భం గా జేఏసీ నాయకులు వై.జనార్దన్ రెడ్డి,రాంగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీ,డి ఏ లు ప్రకటన,సి పి ఎస్ రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నారా యణపేట జిల్లా జేఏసీ అడిషనల్ సెక్రటరీ జనరల్ పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్దన్ రెడ్డి,జేఏసీ కో చైర్మన్ ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రామ్ గోపాల్, రెవిన్యూ ఉద్యోగసంఘం నాయకులుశ్రీశైలం,పంచాయతీ కార్యదర్శులు మహేష్, రాజు పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట అధ్యక్షులు నరేందర్,బాలరాజు ,మాగనూర్ మండలం అధ్యక్షులు బలరాం కృష్ణ మండల ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, గౌ.అధ్య క్షులు శివరాజ్ అసోసియేట్ అధ్యక్షులుఅనిల్ కుమార్, తయాప్ప,డి టి ఎఫ్ నాయ కులు అశోక్ నర్సింహా, శంక్రప్ప, వీరేష్, సహీన్, లక్ష్మీదేవి, రంగారావు,గీత,షబానా,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టుకు తగ్గుతున్న వరద

- రైతాంగంలో ఆందోళన

**జోగులాంబ గద్వాల ప్రతినిధి, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరద నీరు క్రమంగా తగ్గుముఖం పట్టడంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహం నెమ్మదించింది. ఈ విషయాన్ని ప్రాజెక్టు అధికారి సుదర్శన్ యాదవ్ శనివారం ఉదయం వెల్లడించారు.ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుండి ప్రాజెక్టులోకి కేవలం 9,400 క్యూసెక్కుల ప్రవాహం మాత్రమే కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.40 మీటర్ల నీటిమట్టం నమోదైంది. అలాగే ప్రాజెక్టులో ప్రస్తుతం 9.5 టీఎంసీల నీటి నిల్వ ఉందని, అవుట్ ఫ్లో 5,443 క్యూసెక్కులుగా ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువలకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.రైతాంగంలో కలవరం:ఒకవైపు వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో, జూరాల ప్రాజెక్టుకు వచ్చే వరద ప్రవాహం కూడా క్రమంగా తగ్గిపోతుండటం స్థానిక రైతాంగంలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కాలువల ద్వారా సాగునీటి విడుదల కొనసాగుతున్నప్పటికీ, ఇన్ ఫ్లో భారీగా పడిపోవడంతో రాబోయే రోజుల్లో పంటలకు నీరందుతుందో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలి



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ నోటీసుల పంపిణీ పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. నోటీసులు అందజేసిన ప్రతి ఓటరు నుంచి తప్పనిసరిగా అంగీకార పత్రం పొందాలని ఆదేశించారు. పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## ఎఫ్ఎల్ఎన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 29 జనం సాక్షి) :** ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్) లక్ష్యాలను సాధించేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ సమీక్ష సమావేశంలో పాఠశాలల పనితీరు, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, మూల్యాంకన ఫలితాలను ఆయన సమీక్షించారు. జిల్లాలోని 254 ఎఫ్ఎల్ఎన్ సామర్థ్య పాఠశాలల్లో ప్రతి విద్యార్థి నిర్దేశిత సామర్థ్యాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన లోపాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, తెలుగు, ఆంగ్లం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఆకస్మిక మూల్యాంకనాలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలను అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి ఎఫ్ఎల్ఎన్ అమలును పర్యవేక్షించాలని, తల్లిదండ్రుల సమావేశాల ద్వారా కార్యక్రమ ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాహారతి, డీఈఓ రోహిణి, సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 29 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా నోటీసుల పంపిణీనీ వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై శనివారం ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీ, హియరింగ్ అంశాలపై అధికారులతో మాట్లాడారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. సంబంధిత ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు బూత్ లెవెల్ అధికారులకు తరచూ దిశా నిర్దేశం చేయాలన్నారు. గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి ముందుకెళుతున్నట్లు చెప్పారు. విసి అనంతరం కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారులకు తగు సూచనలు చేశారు. నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ గరిష్ట సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందించి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా, మండలాల వారీగా ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించాలని, పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలు సాధించాలంటే ఆరోగ్య పరిరక్షణ ముఖ్యం

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**మావల ఆగస్ట్ 30 (జనంసాక్షి):** విద్యార్థులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు పోషకాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పోషకాహార లోపం నివారణకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. శనివారం స్థానిక భుక్తాపూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంతో పాటు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను సాధించాలంటే జీవన విధానంలో మార్పులు చేసుకోవాలి ఆరోగ్యంగా ఉండడానికి నిరంతరం వ్యాయామం పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనాన్ని నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా తీసుకో వాలని అన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు తదితర పోషకాహారాన్ని తమ ఆహారంలో భాగంగా చేసుకోవాలని అన్నారు. శరీర సాధారణ పనితీరు మెరుగ్గా ఉండేందుకు ప్రతిరోజూ తగినంత నీరు తాగడం కూడా చాలా అవసరమని తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరిమితంగా ఉపయోగించాలని కలెక్టర్ సూచించారు. చిన్న వయస్సులోనే మొబైల్ ఫోన్లు, టీవీలకు అధికంగా అలవాటు పడటం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. అధిక స్క్రీన్ టైమ్ వల్ల పిల్లల నిద్ర, ఏకాగ్రత, శారీరక చురుకుదనం వంటి అంశాలపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉందని, విద్యార్థులు చదువు, క్రీడలు, పుస్తక పఠనం వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తమకు ఎదురయ్యే సమస్యలను ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని అన్నారు.

ప్రస్తుత పాఠశాల భవనం పురాతనంగా మారినందున నూతన భవన నిర్మాణానికి సుమారు రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. అంతకు ముందు ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, కంటి సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, డీఎంహెచ్ఓ డా. సాధన, స్థానిక కౌన్సిలర్ ప్రకాష్, వైద్యులు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రమేష్ రెడ్డి, డీబీసీఓ కృష్ణ, ఆర్బీఎస్కే వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికీ గోదావరి జలాలు

- రెండు పంటలకు సాగు నీరు అందించడమే లక్ష్యం
- బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి
- జీవో 97 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 29 ( జనం సాక్షి ) : లిస్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి గోదావరి జలాలు తీసుకురావడమే ఏకైక ఎజెండా అని, రెండు పంటలకు సాగు నీరు అందించడమే లక్ష్యం అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ నుండి రిజర్వాయర్ కింద ఉన్న ఆయకట్టుకు పంట కాలువ ద్వారా ఎమ్మెల్యే కడియం శ్రీహరి సాగు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా తూము వద్ద గోదావరి జలా లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, కుంకుమ, పూలు సమర్పించారు. అనంతరం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ 2023 నవంబర్ లో ఎమ్మెల్యే గా ఎన్నికైన నాటి నుండి నియోజకవర్గం లో దేవాదుల కింద ఉన్న రిజర్వాయర్ల ద్వారా ప్రతీ గ్రామానికి సాగు నీరు అందించాలనే ఏకైక ఎజెండాతో పని చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే 6నెలల్లో పూర్తి ఆయకట్టుకు సాగు నీరు అందిస్తానని స్పష్టం చేశారు. బిఆర్ ఎస్ ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మాను కోవాలని హితవుపలికారు. గతంలో విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తిగా జీవో 97ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కోరారు. ప్రభుత్వ ఆలోచనమంచిదే అయినప్పటికీ విద్యార్థులు అందుకు ఒప్పుకోవడం లేదని విద్యార్థుల ఆందోళనలు దృష్టిలో పెట్టుకొని జీవో 97 ను రద్దు చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలు కుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నీల రాజమ్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధి కార ప్రతినిధి బిలిదె వెంకన్న,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలూకుంట్ల శిరీష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంబాటి కిషన్ రాజ్, నాయకులు నీల గట్టయ్య, రాపోలు మధు సూదన్ రెడ్డి, గట్టు రమేష్, బూర్ల శంకర్, నీల నరసింహులు, బొల్లు లక్ష్మి ,పురమాని రజాక్ యాదవ్,నాగరబోయిన శ్రీరాములు, కొలిపాక సతీష్, జైహింద్ రాజ్, సింగపురం దయాకర్, గోనెల ఉపేందర్,పోశాల కృష్ణమూర్తి, రాఘవ రెడ్డి, సింగపురం వెంకటయ్య,చింత ఎల్లయ్య, జీవి రమేష్, జీడి ప్రసాద్, కొర్ర వెంకటేష్,గట్టు కోటి, మామిండ్ల శ్రీనివాస్,గుర్రం పాతి కుమార్, పాపయ్య, రాజయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సవాళ్లను స్వీకరించి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 29 (జనం సాక్షి) :** విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా స్వీకరించి, సరైన మార్గంలో పయనిస్తూ తమ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం గుడి పేటలో గల కేంద్రీయ విద్యాలయంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలకు మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంతో పోల్చితే కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థుల సంఖ్య దాదాపు రెట్టింపు కావడం సంతోషంగా ఉందని, ప్రస్తుతం 600 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. వివిధ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలిసి చదువుకోవడం, పరస్పరం నేర్చుకోవడం వల్ల వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలలో చిన్న వయసు నుంచే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం అభినందనీయమని, జీవితంలోని ప్రతి రంగంలోనూ నాయకత్వ లక్షణాలు అవసరమని తెలిపారు. 5-6 సంవత్సరాల వయసు నుండి పిల్లలలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, క్రమశిక్షణ, బాధ్యతాయుత భావనలను పెంపొందించాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి కుటుంబంతో పాటు గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా, దేశ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను మంచి విద్యాసంస్థలలో చదివిస్తున్నారని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఫర్టిలైజర్ షాపుల దోపిడీ

- యూరియా, డీఏపీ అధిక ధరలకు విక్రయం

**తాండూర్, ఆగష్టు 29(జనం సాక్షి) :** మండలంలో ఫె ర్టిలైజర్స్ దు కానాలల్లో యూ రియా ఎమ్మార్పి 267 రూపాయలకు గాను 320-350కు, డిఏపీ 1350కి గాను1500 నుండి 1850 రూపాయలకు అమ్ముతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆప్ ద్వారా బుక్ చేసుకుని కొనుగోలు చేసినా నిర్ణయించిన ధరలకన్నా అధికంగా విక్రయిస్తున్నారని మండి పడుతున్నారు. స్ప్రే మందులు కూడా ఒక్కొక్క షాప్‌లో ఒక్కో రేటుతో అమ్ముతున్నారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం వల్లనే దళారులు దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ప్రతి వస్తువు రేటు బోర్డు పై ఉంచేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# డీ-మార్ట్ అక్రమ నిర్మాణంపై లోకాయుక్త కొరడా!

- ప్రభుత్వ భూమిపై సమగ్ర నివేదిక ఇవ్వాలి
- ఆమ్ఆద్మీ పార్టీ నాయకులు సయ్యద్ హైదర్ ఫిర్యాదుతో ఆదేశాలు




**నిర్మల్ బ్యూరో ఆగస్టు 29 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ సర్వే నంబర్ 256లోని ప్రభుత్వ భూమిలో డీ-మార్ట్ వాణిజ్య భవనం నిర్మించారన్న ఫిర్యాదుపై లోకాయుక్త సీరియస్‌గా స్పందించింది. ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ చేసిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ఈ మేరకు నిర్మల్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్‌డీవో, అర్బన్ తహసీల్దార్‌కు నోటీసులు జారీ అయ్యాయి. సెప్టెంబరు 8లోగా సమగ్ర విచారణ నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు సయ్యద్ హైదర్ తెలిపారు. గతంలో సర్వే నంబర్ 256 భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అధికారులు రికార్డులు ఇచ్చారని, అనంతరం వాటిలో మార్పులు చేసి ప్రైవేటు భూమిగా చూపించారని ఆయన ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై రికార్డుల్లో మార్పులు చేసి డీ-మార్ట్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సర్వే నంబర్ 256లోని భూమిని స్వాధీనం చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన డీ-మార్ట్ భవనాన్ని కూల్చివేయాలని సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణానికి సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని భవనాన్ని కూల్చివేసే వరకు ప్రజాక్షేత్రంలో, న్యాయస్థానాల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ప్రజాప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు పెద్దపీట

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- గణపురం మండలంలో రేషన్ కార్డుల పంపిణీ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే, పలు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంతో పాటు మహిళా వీవో సంఘ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని 5 క్లస్టర్లలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. చెల్పూర్ గ్రామపంచాయతీ ఆవరణలో చెల్పూర్, గొల్లపల్లి గ్రామాల లబ్ధిదారులకు, ధర్మారావుపేటలో బసవరాజ్‌పల్లి, పరశురాంపల్లి, ధర్మారావుపేట, వెంకటేశ్వర్లపల్లి, నగరంపల్లి గ్రామాల లబ్ధిదారులకు, సీతారాంపూర్‌లో కొండాపూర్, సీతారాంపూర్, అప్పయ్యపల్లి గ్రామాల వారికి, గణపురంలో గణపురం, బురకాయలగూడెం గ్రామాల వారికి, గాంధీనగర్‌లో గాంధీనగర్, మైలారం, లక్ష్మారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన మొత్తం 15 గ్రామాల లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. అనంతరం వెంకటేశ్వర్లపల్లి, అప్పయ్యపల్లి గ్రామాల్లో మహిళా వీవో సంఘం భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజక వర్గంలోని ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో గణపురం మండల ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సివిల్ సప్లై అధికారులు, రేషన్ కార్డు లబ్ధిదారులు, మహిళా సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ శాఖల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడారం మీదుగా గంజాయి స్మగ్లింగ్..

- నిందితుడు అరెస్ట్, 1.4 కిలోలు స్వాధీనం..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. భూపాలపల్లి సీసీఎస్ పోలీసులు, ముత్తారం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి, అరెస్ట్ చేశారు. ఒడిశా నుంచి మేడారం మీదుగా కాటారం వైపు గంజాయిని తరలిస్తున్న దానం శశికృష్ణ (కాటారం గ్రామం)ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి కిలో 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని అంచనా వేశారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

# పిట్టల్లా రాలుతున్న మూగజీవాలు

- వ్యాధితో దుక్కిటెద్దు మృతి



**పలిమేల ఆగస్టు 29(జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమేల మండలం పంకెన గ్రామానికి చెందిన రైతు కాల్వపల్లి అనిల్ దుక్కిటెద్దు ఐదు రోజులుగా వ్యాధి బారిన పడి మృతి చెందింది. రైతు అనిల్ తెలిపిన వివరాల ప్రకారం ఎద్దు నెమరు వేయకపోవడం అలాగే నీళ్లు మాత్రం తాగేదని, తాను వైద్యం చేపించినప్పటికి, అలాగే సమయం మించి పోవడంతో ఎద్దు మృతి చెందిందని అన్నాడు. తమకు దగ్గరలో వైద్యశాల ఉంటే ఇలాగే జరిగేది కాదన్నారు. సరైనా సమయంలో వైద్యశాలకు తీసుకెళ్లి లేదా పశు వైద్యులను రప్పించు చికిత్స చేపించే వానన్ని అన్నారు. అదేవిధంగా ఇప్పటికే పంకెన గ్రామానికి చెందిన పలువురి (కల్లురి. లచ్చిమల్లు(దుక్కిటేద్దు), పాగె ఆగయ్య (గేదె), మోతె గట్టయ్య (దుక్కిటేద్దు).. తదితరుల ఎద్దులు, గేదెలు, మేకలు, గొర్రెలు మృతి చెందాయి. పశు వైద్యశాల అందుబాటులో ఉంటే కొంత మేలు జరిగేదని బాధితులు, ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు పశు వైద్యశాల ఏర్పాటు కోసం కృషి చేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు. ఈ సందర్భంగా కేవీపీస్ జిల్లా నాయకులు పాగె సంతోష్ మాట్లాడుతూ మంత్రి చొరువ తీసుకొని మండల ప్రజలకు అందుబాటులో పశువైద్యశాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. దీనితో అన్నీ పశువుల మందులు ప్రజలకు అందుబాటులో ఉండి, ఉచిత వైద్యం అందుతుందని, రైతులకు ఖర్చు తగ్గుతుందని అన్నారు.

# ప్రణాళికాబద్ధమైన బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 29(జనంసాక్షి) :** ప్రణాళికాబద్ధమైన బోధనతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని నిఘా కెమెరాల పనితీరు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. జూనియర్ కళాశాల విద్యార్థినులకు నిర్వహిస్తున్న యూనిట్ పరీక్షల తీరును పరిశీలించి, పరీక్షల నిర్వహణపై సంబంధిత ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు నిర్ణీత ఆహార పట్టిక ప్రకారం నాణ్యమైన, పౌష్టికమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం ఆహార పట్టిక ప్రకారం అందించాల్సిన భోజన పదార్థాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భోజనం తయారీలో నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యాభ్యాసం, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వాతి, రికార్డు అసిస్టెంట్ రాజు, సంబంధిత అధికారులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# రామప్పను సందర్శించిన సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం



**వెంకటాపూర్ (రామప్ప), ఆగస్టు 29 (జనం సాక్షి):** యునెస్కో గుర్తింపు పొందిన వెంకటాపూర్ మండలం లోని రామప్ప దేవాలయాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ,ఉమాశంకర్ లు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి దర్శనం అనంతరం వారికి అర్చకులు స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదలను అందజేశారు. అదేవిధంగా వారికి ఆలయ మండపంలో ఈవో ఉమ్మడి భాస్కర్ వారిని శాలువాతో సత్కరించారు. అంతేకాకుండా వారికి ఆలయ చరిత్ర, శిల్పకళా వైభవాన్ని టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ వివరించారు. వారి వెంట టూరిస్ట్ పోలీసులు శ్రీకాంత్, బద్రు, పురావస్తు, దేవాదాయ శాఖ వారు ఉన్నారు.

# టీజీ ఐపాస్ ద్వారా 52 మందికి ఉపాధి అవకాశాలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి




**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 29(జనంసాక్షి):** టి జి ఐ పాస్ ద్వారా అర్హులైన పారిశ్రామిక అనుమతుల కోసం ప్రభుత్వం అనుమతితో 152 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో టి జి ఐ పాస్ ద్వారా పారిశ్రామిక అనుమ తుల కోసం దరఖాస్తు చేసుకున్న అంశాలను వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఇటీవల దరఖాస్తు చేసుకున్న 19 పరిశ్రమలకు సంబంధించి మొత్తం రూ.16.03 కోట్ల పెట్టుబడులతో 152 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు వివరించారు. ఆయా పరిశ్రమలకు అవసరమైన అనుమతులు, క్లియరెన్స్‌లను నిబంధనల మేరకు త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం టీ ప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు చెందిన 9 వాహనాలకు రూ.31.52 లక్షల రాయితీని కమిటీ ద్వారా మంజూరు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పారిశ్రామిక ప్రోత్సాహక పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. ఈ సమావేశంలో జి.ఎం ఇండస్ట్రియల్ నరసింహ మూర్తి ,లీడ్ బ్యాంక్ మేనేజర్ జీవన్ కుమార్ అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**పాలకుర్తి, ఆగస్టు 29(జనంసాక్షి) :** రాష్ట్రంలో అభివృద్ధిని పక్కకు పెట్టి, దోపిడి చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన సాగిస్తున్నాడని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరుగగా, ముఖ్య అతిథిగా దయాకర్ రావు హజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనులు చేపట్టకుండా కాంట్రాక్టర్ల కమీషన్ల కోసం నిలిపివేశారని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్ట్ నీటిని నియోజకవర్గంలోని పాలకుర్తి, దేవరుప్పులకు రాకుండా స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గానికి తరలించుకు వెళ్లాడని అన్నారు. ఆర్థికంగా బలపడి, కష్ట కాలంలో పార్టీని నష్టం చేసిన మోసగాళ్లను ఇక సహించ బోమని బీఆర్ఎస్ పార్టీలోకీ వస్తే చేర్చుకునేది లేనది స్పష్టం చేశారు. ఈ సమావే శంలో నాయకులు ఎర్రబెల్లి వినయ్ రావు, పసునూరి నవీన్, మాచెర్ల ఎల్లయ్య, నల్ల నాగిరెడ్డి, బొబ్బల అశోక్ రెడ్డి. కారు పోతుల వేణు. వీరమనేని సోమేశ్వరరావు. పాము శ్రీనివాస్. జోగు గోపి. సర్పంచులు కమ్మగాని విజయ, బానోత్ మహేందర్ నాయక్, పసులాది యాకస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# జనం సాక్షి కథనానికి కదిలిన యంత్రాంగం

- విఎస్ గార్డెన్స్‌ను నేరుగా పరిశీలించిన అధికారులు
- బాల కార్మికులను పనిచేయిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



**మాడుగులపల్లి ఆగస్టు 29 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని వి ఎస్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో బాల కార్మికులతో పనులు చేయిస్తున్నారంటూ జనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారుల యంత్రాంగం దిగివచ్చింది పత్రికా వార్త ఆధారంగా అధికారులు శనివారం నేరుగా వి ఎస్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుని క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ ప్రాంగణాన్ని, డైనింగ్ హాల్ పరిసరాలను పరిశీలించిన అధికారులు నిర్వాహకులతో మాట్లాడారు నిబంధనలకు విరుద్ధంగా చిన్నపిల్లలతో పనులు చేయించడం తీవ్రమైన నేరమని, మరోసారి బాల కార్మికులు పనుల్లో కనిపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు భవిష్యత్తులో బోర్డులు ఏర్పాటు చేసి బాల కార్మికులను అనుమతించబోమని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. జనం సాక్షి పత్రికలో వచ్చిన వార్తతో అధికారులు స్వయంగా ఫంక్షన్ హాల్ వద్దకే వచ్చి తనిఖీలు చేపట్టడంపై స్థానిక కుల సంఘాల నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న జనం సాక్షి పత్రికకు, తక్షణమే స్పందించిన అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అనంతరం విఎస్ ర్డెన్ వారు వచ్చిన అధికారులకు రాతపూర్వకంగా లెటర్ ఇచ్చినట్టుగా సమాచారం ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ అధికారులు, మండల అధికారులు, గ్రామ అధికారులు మండల పోలీసు అధికారులు, స్థానిక సర్పంచ్ అల్లూరి నరేష్, వి ఎస్ గార్డెన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల ఘాట్‌ల నిర్మాణాలకు శ్రీకారం

- రూ.49 కోట్లతో మూడు విడతల్లో పనులు
- మార్చిలోపు పూర్తి చేసేలా అధికారులకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు

**భద్రాచలం, ఆగస్టు 29 (జనంసాక్షి) :** వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలు - 2027కు భద్రాచలంలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టనున్న ఘాట్‌ల నిర్మాణ పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. గోదావరి పరివాహక ప్రాంతంలో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జేసీబీతో మట్టి తీసి పనులను ప్రారంభించారు.

## మూడు విడతల్లో రూ.49 కోట్ల పనులు

గోదావరి పుష్కరాల కోసం మూడు విడతల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు. తొలి విడతలో రూ.46.65 కోట్లు, రెండో విడతలో రూ.1.75 కోట్లు, మూడో విడతలో రూ.60 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. మొత్తంగా సుమారు రూ.49 కోట్లతో పుష్కర ఘాట్‌ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మొదటి దశలో భద్రాచలంలో ఘాట్‌ల నిర్మాణాలు చేపట్టి, అనంతరం దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల, బూర్గంపాడు మండలంలోని మోతే, పట్టినగర్ ప్రాంతాల్లో పనులు కొనసాగుతాయని కలెక్టర్ వివరించారు. ములుగు జిల్లాలోని చిన్నరావిగూడెం, రామానుజావరం, రామచంద్రాపురం ప్రాంతాల్లోనూ పుష్కర ఘాట్‌ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ 2027 జూన్--జూలైలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో జరిగే గోదావరి పుష్కరాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వాజేడు, వెంకటాపురం ప్రాంతాల్లోనూ పుష్కర ఘాట్‌ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం స్నాన ఘాట్‌లు, మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## కరకట్ట సర్వీస్ రోడ్డుపై ప్రత్యేక దృష్టి

భద్రాచలం కరకట్ట ప్రాంతంలో సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రణాళిక రూపొందించి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. పుష్కరాల నాటికి రహదారులు, రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి, మరమ్మతు పనులు రూ.351 కోట్లతో కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. దేవాలయ పనులను కలెక్టర్ అంకిత్, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా గోదావరి పుష్కర పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. భద్రాచలం ప్రాంతాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుతూ అభివృద్ధి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం టెంపుల్ ఈవో కె దామోదర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ మహేశ్వరరావు, డీఈ భాగ్యరాజ్ రాథోడ్, ఈఈ జానీ, భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణ, పంచాయతీ ఈవో శ్రీనివాస్, తహసీల్దార్ రవి, వార్డు సభ్యుడు సుబ్బారావు, స్థానికులు భోగాల శ్రీనివాస్‌రెడ్డి, బుడగం శ్రీనివాస్, ఏఈఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో కరువు ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీ తెచ్చిందే..

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**సూర్యాపేట, ఆగస్టు 29 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ సృష్టించిన కరువేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను వివరిస్తూ సూర్యాపేట నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతుందన్నారు.ఇది కాలమో ఎల్ నినో వల్ల వచ్చిన కరువు కాదన్నారు.ముమ్మాటికీ కాంగ్రెస్ సృష్టించిన కరువే అని విమర్శించారు.రాష్ట్రంలో రైతాంగం ఎంత మొత్తుకుంటున్న ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు.ఇవాళ కృష్ణా, గోదావరి నీళ్లు ఎట్లా పోతున్నాయో కేటీఆర్, తామంతా కళ్ళకు కట్టినట్లు చూపించామని తెలిపారు.సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు మంచిగా ఉన్నాయని సెంట్రల్ వాటర్ కమిషనే స్పష్టంగా తెల్చిందన్నారు.ఈ 75 రోజుల్లో గోదావరిలో 150 టీఎంసీల నీళ్లను వృధాగా సముద్రం పాలు చేశారని, కృష్ణాలో 150 టీఎంసీల నీటిని ఆంధ్రాకు తీసుకుపోయారని అన్నారు.శ్రీశైలం,సాగర్ పొంగిపొర్లేలా కృష్ణమ్మ నీళ్లిచ్చిందని,కానీ ఆంధ్ర సీఎం అనధికార ఉత్తర్వులతో అక్రమంగా నీళ్లను తీసుకుపోయారని,ఇది సీఎం రేవంత్ రెడ్డి అనుమతితోనే జరుగుతుందని అన్నారు.కేవలం బీఆర్ఎస్ పార్టీ ఒత్తిడితోనే సాగర్ గేట్లు కొంతమేరా వదిలిపెట్టారని చెప్పారు.అధికారులు స్వయంగా రైతాంగాన్ని ఆరుతడి పంటలు వేసుకొమ్మని చెప్పారని,ఎన్ని నీళ్లిస్తారో స్పష్టంగా ఏ మంత్రి కూడా చెప్పలేదన్నారు.అసలు విషయాలను పక్కదారి పట్టించే కుట్రలు చేస్తున్నారని తెలిపారు.విత్తనాలు, ఎరువులు,కరెంట్, బోనస్ అడుగుతారని మొదట్లోనే మోసం చేస్తున్నారని అన్నారు.కాల్వ కింద రైతుల వల్లనే ఉమ్మడి జిల్లాలో ఇద్దరికి మంత్రి పదవులు వచ్చాయని అన్నారు.ఇది రాజకీయంగా చేస్తున్న ఆరోపణ కాదని,రాష్ట్రంలో రైతాంగం పడుతున్న ఆవేదన అని తెలిపారు.కుడికాలువకు నీళ్లిచ్చి ఎడమ కాలువకు ఎందుకు ఇవ్వడం లేదని ఇక్కడి మంత్రులు ఎందుకు అడగటం లేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టడమే రైతులు చేసిన పాపమా అన్నారు.కేసీఆర్ నాయకత్వంలో రైతాంగానికి న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని అన్నారు.ఈ సమావేశంలో పాల్గొన్న మాజీ రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చంచల్‌గూడ జైలు మ్యూజియాన్ని సందర్శించిన సెయింట్ ఆన్స్ విద్యార్థులు



**సికింద్రాబాద్, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ప్రాథమిక దశ నుండే విద్యార్థులకు చట్టం, న్యాయం, సామాజిక బాధ్యత పట్ల అవగాహన పెంపొందించాలని జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పులకు దూరంగా ఉంటూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. శనివారం పేట్ బషీరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థులు చంచల్‌గూడ జైలు మ్యూజియాన్ని సందర్శించారు. పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ ఫీల్డ్ ట్రిప్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైలు ప్రాంగణంలోని క్రమశిక్షణ, ఖైదీల దినచర్య, వారిలో పరివర్తన తీసుకురావడానికి అమలు చేస్తున్న సంస్కరణలు, వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాల గురించి జైలు అధికారులు విద్యార్థులకు వివరంగా వివరించారు. ఖైదీలు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడారు. జీవితంలో చేసే చిన్న చిన్న తప్పులు కూడా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, జైలు వాతావరణాన్ని చూసి ప్రతి ఒక్కరూ నైతిక విలువలను అలవర్చుకోవాలని హితవు పలికారు. విద్యార్థులు తప్పులకు దూరంగా ఉంటూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్, జైలర్ దేవ్ సింగ్, స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ శాంతి, ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి ఫెలసిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తాగు, సాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, ఆగస్టు 29 (జనంసాక్షి) :** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో తాగునీరు, సాగునీటి అవసరాలు తీర్చడంమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నాడు పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుండి నియోజకవర్గ పరిధిలోని చెరువులు, కుంటలను నింపేందుకు సాగర్ ఎడమ కాలువ నుంచి 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పెద్దదేవులపల్లి వద్ద ఉన్న అవుట్‌ఫాల్ రెగ్యులేటర్‌నుఎమ్మెల్యే ఆన్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు. సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్ట్ గేట్లను ఎమ్మెల్యే స్వయంగా ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. అనంతరం వజీరాబాద్ మేజర్, కిష్టాపురం మేజర్, మల్కల్ కాలువ మేజర్, తక్కెలపాడు లిఫ్ట్ గేట్ల ద్వారా కూడా నీటిని విడుదల చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను నింపేందుకు నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతాంగానికి మేలు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. చెరువులు, కుంటలు, కాలువలను నీటితో నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని, తద్వారా ప్రజలకు తాగునీటి లభ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలతో పాటు పంటలకు అవసరమైన సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, షేక్ జిందా,రవీందర్ రెడ్డి, సారెడ్డి శంకర్ రెడ్డి, సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# త్రిబుల్ ఆర్ భూసేకరణలో సమన్వయం భేష్

- ఆర్ అండ్ బి ప్రత్యేక కార్యదర్శి గంగాధర్
- భూసేకరణ పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షల ద్వారా పటిష్ట చర్యలు
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, ఆగష్టు 29 (జనం సాక్షి) :** త్రిబుల్ ఆర్ భూ సేకరణ ప్రక్రియలో మెదక్ జిల్లా అధికారుల సమన్వయం మరువలేనిదని ఆర్ అండ్ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్ ఐఏఎస్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, నేషనల్ హైవే, రెవిన్యూ అధికారులతో సమీక్షించారు. ముందుగా భూసేకరణ పురోగతిపై నర్సాపూర్ తూప్రాన్ ఆర్డీవోలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ అండ్ బి ప్రత్యేక కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీజనల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై ప్రభుత్వం ఆదేశాల మేరకు భూ సేకరణ పై జిల్లాల వారీగా రివ్యూ నిర్వహించి మెదక్ జిల్లాకు రావడం జరిగిందని. మిగతా జిల్లాలతో పోలిస్తే మెదక్ జిల్లా జిల్లా కలెక్టర్ గారి ప్రత్యేక చొరవతో భూ సేకరణలో ఉత్తమ ప్రతిభలో ఉందన్నారు. అవార్డు పాసైన భూములను భూమి రాసి పోర్టల్ లో నమోదు చేయడం, రైతులకు. పేమెంట్ అందేలాచర్యలు తీసుకోవడం విషయాలపై చర్చించడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ భూసేకరణలో మెదక్ జిల్లాలో పూర్తి పారదర్శకత జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అవార్డు పాసైన వాటికి వెంటనే డబ్బులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పూర్తి చేయడం ద్వారా రింగ్ రోడ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ ,భూ సేకరణ కన్సల్టెంట్ సుందర్ అద్నాన్ , నేషనల్ హైవే పిడి మాధవి, నేషనల్ అవే మేనేజర్ రాహుల్, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, తూప్రాన్ ఆర్డీవో బావయ్య, కలెక్టరేట్ సూపరిండెంట్ గఫర్ ,మండల తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి, పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు.అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఉక్కుపాదం

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా.. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు.
- ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో డీఎస్పీ అరుణ్‌కుమార్ ఆదేశాలు



**భద్రాచలం, ఆగస్టు 29 (జనంసాక్షి) :** భద్రాచలం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నిరంతరం చర్యలు చేపట్టాలని భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్టేషన్‌లోని రికార్డులు, ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు.

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి.

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీఎస్పీ సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

## రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

భద్రాచలం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్, దేవాలయాల పరిసరాల్లో ట్రాఫిక్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. బ్లూకోల్ట్స్ వాహనాలతో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ట్రాఫిక్ అంతరాయాలను గుర్తించిన వెంటనే నియంత్రించాలని సూచించారు.

- ప్రమాదకర ప్రాంతాల గుర్తింపునకు ఆదేశం

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని డీఎస్పీ అరుణ్‌కుమార్ సూచించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్ 2.0లో ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

## పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీఎస్పీ.. స్టేషన్ ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ తిరుపతితో పాటు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి



**నవాబ్‌పేట్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు పేర్కొన్నారు. శనివారం నవాబ్‌పేట్ మండల కేంద్రంతో పాటు మండలంలోని రుద్రారం, కాకర్లపాడు, తీగలపల్లి గ్రామాలలో ఆయన విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత షూ, టై, బెల్ట్‌ల పంపిణీ:మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న షూ, టై, బెల్ట్‌లను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గారు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు, యూనిఫాం, షూ తదితర సామగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత:అనంతరం మండలంలోని అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే గారు పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# రూ.లక్షకే 'కోణార్క్'

## ఏథర్ నుంచి మరో ఎలక్ట్రిక్ స్కూటర్..

**ముంబై(జనంసాక్షి):**ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ మరో స్కూటర్‌ను విపణిలోకి విడుదల చేసింది. 'కోణార్క్' పేరుతో తీసుకొచ్చిన ఈ స్కూటర్ ఎస్, జెడ్ అనే రెండు వేరియంట్స్‌లో లభించనుంది. రూ.లక్ష ప్రారంభ ధరతో వీటిని అందుబాటులోకి తెచ్చింది. ఎస్ వేరియంట్‌లో మొత్తం నాలుగు మోడల్స్‌ను తీసుకొచ్చింది.2.1 బ్యాటరీ సామర్థ్యం కలిగిన సింగిల్ ఛార్జ్‌తో 100 కి.మీ. వరకూ ప్రయాణించవచ్చని కంపెనీ చెబుతోంది. ఇటు వినియోగదారులు, అటు ఏథర్ సర్వీస్ సెంటర్‌లలోని టెక్నీషియన్స్ సమయం ఆదాయ చేయడం కోసం కోణార్క్ డిజైన్‌లో కీలక మార్పులు చేసినట్లు ఏథర్ చెబుతోంది. క్షేత్రస్థాయిలో ఏథర్ వాహనాల 26 లక్షల కి.మీ. డేటాను విశ్లేషించి, సరికొత్త ఛాసిస్, పవర్‌ట్రైన్, ఎలక్ట్రానిక్స్ ఆర్కిటెక్చర్‌తో వీటిని తీర్చిదిద్దినట్లు చెబుతోంది. వివిధ విడి భాగాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా సర్వీసింగ్ చేసే సమయం ఆదా అవుతుందని, నిపుణుడైన టెక్నీషియన్ కేవలం 3 నిమిషాల్లో బ్యాటరీని ఊడదీసి, బిగించేలా తీర్చిదిద్దినట్లు తెలిపింది.ఇక కోణార్క్ 31 లీటర్ల స్టోరేజ్ సామర్థ్యంతో రానుంది. 18చి యూఎస్‌బీ టైప్‌-సిపోర్ట్, అండర్ సీట్ ల్యాంప్, ఎస్100 వేరియంట్‌కు 4.2 అంగుళాల డిస్‌ప్లే మిగిలిన వాటికి 7 అంగుళాల డిస్‌ప్లే ఇచ్చారు. పార్క్ అసిస్ట్ రివర్స్, ఆటోహోల్డ్ తదితర ఫీచర్లు కూడా ఉన్నాయి. కోణార్క్ జెడ్ వేరియంట్ అడ్వాన్స్డ్ ఎలక్ట్రానిక్ బ్రేకింగ్ సిస్టమ్‌తో రానుంది. అలాగే దీనికి మేజిక్ కీ ఇవ్వనున్నారు. స్కూటర్ లాక్, అన్‌లాక్‌ను యాప్ ద్వారా నియంత్రించవచ్చు. గూగుల్ మ్యాప్స్, వాట్సాప్‌లను కూడా జెడ్ వేరియంట్‌లో ఉపయోగించుకోవచ్చు. థెఫ్ట్ అలర్ట్, రైడ్ స్టాటిస్టిక్స్, ఫైండ్ మై స్కూటర్, ఛార్జింగ్ పర్యవేక్షణ, ఓటీఏ అప్‌డేట్స్ వంటి వాటికి జెడ్ వేరియంట్ సపోర్ట్ చేస్తుంది.

## బర్డ్‌ఫ్లూపై బీఅలర్ట్

మరింత ప్రాధాన్యం ఏర్పడింది.ఆగస్టు 25- 27 వరకు డబ్ల్యూహెచ్‌ఓ ఆగ్నేయాసియా, పశ్చిమ పసిఫిక్ ప్రాంతీయ కార్యాలయాలు సంయుక్తంగా బర్డ్‌ఫ్లూ వైరస్ గురించి ఓ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ మీటింగ్‌లో 150 మందికి పైగా ఇన్‌ఫ్లుయెంజా నిపుణులు, సైంటిస్టులు, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు. పక్షులలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి కొనసాగుతుందని ప్రజారోగ్య నిపుణులు పేర్కొన్నారు. జంతువుల నుంచి మానవులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇదే విషయంపై ఈటీవీ భారత్‌లో ఆరోగ్య నిపుణులు, సైంటిస్టులు, వైద్యులు మాట్లాడారు.

**లక్షణాలు ఏంటంటే?**

బర్డ్‌ఫ్లూ సోకిన చాలా మంది రోగులలో జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయని అంటువ్యాధుల నిపుణురాలు, మెడికల్ మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ మనాలి అగర్వాల్ తెలిపారు. ఈ లక్షణాలతో పాటు న్యుమోనియాకు సంబంధించిన లక్షణాలు కూడా కనిపిస్తాయని చెప్పారు. తరచుగా కనిపించే శ్వాసకోశేతర లక్షణాలలో విరేచనాలు, వాంతులు, కడుపు నొప్పి ఉన్నాయని వివరించారు.

# రూ.37,700 కోట్ల జియో ఐపీఓ

## సెబీ పచ్చజెండా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదముద్ర వేసింది. ఈ ఐపీఓ ద్వారా 3.8 బిలియన్ డాలర్లు (సుమారు రూ.37,700 కోట్లు) సమీకరించాలన్నది జియో ప్రతిపాదన. ఇదే జరిగితే దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలిచే అవకాశం ఉంది. ఐపీఓకు అనుమతి కోరుతూ ముసాయిదా పత్రాలను జూన్‌లో సెబీకి జియో ప్లాట్‌ఫామ్స్ సమర్పించింది. శుక్రవారం (ఆగస్టు 28న) సెబీ అంగీకరించింది. ఈ ఐపీఓలో 27 కోట్ల తాజా షేర్లను (కంపెనీలో 2.9% వాటాకు సమానం) కంపెనీ జారీ చేయనుంది. ఐపీఓ కోసం కంపెనీ విలువను 137 బిలియన్ డాలర్లు (సుమారు రూ.13,00,000 కోట్లు)గా అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రకారం చూస్తే ఐపీఓ ద్వారా రూ.37,700 కోట్లు రావొచ్చని జియో అంచనా వేస్తోంది. దేశీయ అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) కూడా ఐపీఓకు రానుండగా, ఆ ఇష్యూ పరిమాణం రూ.30,000 కోట్లుగా ఉండే అవకాశం ఉంది. దీంతో పోలిస్తే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓనే పెద్దది కానుంది. పబ్లిక్ ఇష్యూ




ద్వారా సమీకరించే నిధులను జియో ప్లాట్‌ఫామ్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు చెందిన దాదాపు రూ.27,500 కోట్ల రుణాల చెల్లింపునకు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించనుంది.

**మరో నాలుగు సంస్థలకూ..**

జియో ప్లాట్‌పామ్‌తో పాటు మరో 4 సంస్థల ఐపీఓలకూ సెబీ ఆమోదముద్ర వేసింది. వీటిల్లో పారస్ హెల్త్‌కేర్, ఎంకే సన్స్ ఫైన్ జ్యువెల్స్, భారత్ పీఈటీ, సద్భావ్ ఫ్యూచర్‌టెక్ ఉన్నాయి. ఐపీఓ ద్వారా పారస్ హెల్త్‌కేర్ రూ.1,800 కోట్ల వరకు సమీకరించనుంది. రూ.500 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద రూ.1,300 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదార్లు విక్రయించనున్నారు. రుణాల చెల్లింపునకు, అనుబంధ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం ఐపీఓ నిధులను కంపెనీ వినియోగించనుంది. ఎంకే సన్స్ ఫైన్ జ్యువెల్స్ ఐపీఓలో 1.36 కోట్ల తాజా షేర్ల జారీతో పాటు, 34 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ ద్వారా విక్రయించనున్నారు. కొత్త విక్రయ కేంద్రాల ఏర్పాటుకు, రుణాల చెల్లింపునకు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం ఐపీఓ నిధులను కంపెనీ వినియోగించనుంది. భారత్ పీఈటీ ఐపీఓ పరిమాణం రూ.760 కోట్లుగా ఉండనుంది. ఇందులో రూ.120 కోట్ల విలువైన తాజా షేర్లను, ఓఎఫ్ఎస్ ద్వారా రూ.640 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను రుణాల చెల్లింపునకు, మూలధన వ్యయాలు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనున్నారు. సద్భావ్ ఫ్యూచర్‌టెక్ ఐపీఓలో భాగంగా 2.55 కోట్ల విలువైన తాజా షేర్లు జారీ చేయనున్నారు. ఓఎఫ్ఎస్ ద్వారా రూ.235 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. సమీకరించే నిధులను నిర్వహణ మూలధనం, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ ఉపయోగించనుంది.

## ఐటీ షేర్ల అండతో లాభాల్లోకి

రెండు రోజుల వరుస నష్టాల అనంతరం స్టాక్ మార్కెట్ పుంజుకుంది. ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ప్రధాన సూచీలు లాభాల్లో ముగిశాయి. విదేశీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడమూ కలిసొచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 2 పైసలు పెరిగి 95.43 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు 0.76% నష్టంతో 89.20 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో చైనా, దక్షిణ కొరియా మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలో ఆరంభమయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.28 లక్షల కోట్లు పెరిగి రూ.492.82 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.వారం మొత్తం మీద నష్టమే..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,128.05 పాయింట్ల వద్ద లాభాల్లో (క్రితం ముగింపు 76,934) ఆరంభమైంది. ఆ తర్వాత 77,357.97 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. అక్కడ నుంచి కిందకు వచ్చిన సూచీ, సానుకూల ధోరణిలో స్వల్ప శ్రేణిలో కదలాడింది. చివరకు 330.92 పాయింట్ల లాభంతో 77,264.51 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 84.80 పాయింట్లు లాభపడి 24,175.65 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,188.30 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని; 24,076.85 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 276.32 పాయింట్లు, నిఫ్టీ 76.35 పాయింట్లు కోల్పోయాయి.


21 కంపెనీల షేర్లు పైకి..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 9 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి.

# వెండికి ఎంత చెల్లిస్తున్నారో చూసుకోండి

- స్వచ్ఛత ఆధారంగా చెల్లింపులకు హెచ్‌యూఐడీ హాల్‌మార్కింగ్‌తో వీలు
- ఏడాదిలో 77 లక్షల ఆభరణాలకు మార్కింగ్
- ఇందులో దక్షిణాది రాష్ట్రాల వాటా 62%
- 25,000 మంది వ్యాపారులు.. 341 అస్సేయింగ్ కేంద్రాల నమోదు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రస్తుతం వివాహాలు/శుభకార్యాలు జరుగుతున్నందున.. పూజల కోసం వెండి ప్రతిమలు, ఆభరణాలు కొనడం పెరిగింది. వెండి ధర కిలో రూ.2.50 లక్షల సమీపంలో కదలాడుతున్న క్రమంలో ఆభరణాలు కొనేవారు, వాటిల్లోని లోహ స్వచ్ఛత విషయంలో అప్రమత్తంగా లేకపోతే నష్టపోవచ్చు. సాధారణంగా విక్రయశాలల్లో వెండి వస్తువులు అమ్మేప్పుడు, ఆరోజు కిలో వెండి ధర ప్రకారం, గ్రాము ఇంత అని చెబుతారు. అంతేకానీ అందులో వెండి శాతం (స్వచ్ఛత) ఎంత ఉందో చెప్పరు. వస్తువు బరువు ప్రకారం ధర లెక్కించి, దానిపై 3% జీఎస్‌టీ, తయారీ వ్యయాలు కలుపుతారు. ఇక్కడే కొనుగోలుదార్లు జాగ్రత్తగా ఉండాలి. 2025 సెప్టెంబరు 1 నుంచి బంగారం తరహాలోనే వెండికీ హాల్‌మార్కింగ్ తప్పనిసరి అయిన నేపథ్యంలో, ప్రతి ఆభరణంపై 6 అంకెలు - అక్షరాలతో కూడిన హెచ్‌యూఐడీ (హాల్‌మార్క్ యునీక్ ఐడెంటిఫికేషన్) కూడా ఉండాలి. ఇందులోనే ఆ ఆభరణంలో ఉన్న వెండి స్వచ్ఛత తెలుస్తుంది.

హాల్‌మార్కింగ్ చేసిన వెండి వస్తువుల్లో 999, 990, 970, 958, 925, 835, 800 గ్రేడ్‌ల వరకు స్వచ్ఛత ఉంటుంది. కిలో వెండి ధర అంటే 999 స్వచ్ఛత కలిగిన దానికి అని అర్థం. విపణిలో ఎక్కువగా విక్రయించే వెండి వస్తువులు 925 (92.5%), 835 (83.5%), 800 (80.0%) స్వచ్ఛత కలిగి ఉంటాయి. ఉదాహరణకు కిలో వెండి ధర రూ.2,50,000 అనుకుంటే 925 గ్రేడ్ కలిగిన వెండి ధర రూ.2,31,250 అవుతుంది. గ్రాము ధర రూ.250 బదులు రూ.232 మాత్రమే అవుతుంది. ఈ లెక్కనే చెల్లించాలి.వెండి ఆభరణాలు, ఉత్పత్తుల్లో లోహ స్వచ్ఛత ఎంత ఉందనే విషయాన్ని ధ్రువీకరించే హాల్‌మార్కింగ్‌లో 6 అంకెలు - అక్షరాలతో కూడిన హెచ్‌యూఐడీ (హాల్‌మార్క్ యునీక్ ఐడెంటిఫికేషన్) తప్పనిసరి అయ్యింది. గత ఏడాది కాలంలో 77 లక్షల వెండి వస్తువులకు ఈ ధ్రువీకరణ ఇచ్చినట్లు ముద్రించినట్లు భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) తెలిపింది. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలే ముందున్నట్లు వెల్లడించింది. 2024-25లో 32 లక్షల వెండి ఉత్పత్తులకు హాల్‌మార్క్ వేసినా, వాటికి హెచ్‌యూఐడీ లేదు. ఇప్పటివరకు హాల్‌మార్కింగ్ చేసిన వెండి ఆభరణాల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా 62% అయితే, పశ్చిమ ప్రాంతం 18%, మధ్యప్రాంతం 10%, ఉత్తరాది ప్రాంతం 10% వాటా కలిగి ఉన్నాయి.హాల్‌మార్కింగ్ కోసం దేశంలో 25,000 మందికి పైగా వెండి ఆభరణాల వ్యాపారులు బీఐఎస్ వద్ద నమోదయ్యారు. ప్రస్తుతం దేశంలోని 102 జిల్లాల్లో 341 వెండి అస్సేయింగ్-హాల్‌మార్కింగ్ (ఏహెచ్‌సీ) కేంద్రాలు హెచ్‌యూఐడీ ముద్రిస్తున్నాయి.బీఐఎస్ నిర్వహించిన సర్వేలో 10-25 గ్రాములు, 25-50 గ్రాముల వెండి ఆభరణాలు, వస్తువులకు 74% వాటా ఉంటోంది.వెండితో చేసిన కాలిపట్టీలు, గొలుసులు, చెవి రింగులు, ఉంగరాలు, బ్రేస్‌లెట్లకు అధిక గిరాకీ ఉంటోంది. 925-800 గ్రేడ్ స్వచ్ఛత కలిగిన ఆభరణాలను అధికంగా విక్రయిస్తున్నారు.




# పశ్చిమాసియాలోనూ విమానాశ్రయాలు




## జీఎంఆర్ ప్రణాళికలు




హైదరాబాద్: విమానాశ్రయాల నిర్వహణ సంస్థ జీఎంఆర్ గ్రూపు, అంతర్జాతీయంగా తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు అడుగులు వేస్తోంది. పశ్చిమాసియా, మధ్య ఆసియా, తూర్పు ఐరోపా, ఆగ్నేయాసియా ప్రాంతాల్లో విమానాశ్రయాల నిర్వహణ, అనుబంధ వ్యాపార రంగాల్లో ఉన్న భారీ అవకాశాలను చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తామని సంస్థ ఛైర్మన్ జీఎం రావు 2025-26 వార్షిక నివేదికలో వెల్లడించారు. విమాన ప్రయాణాలకు గిరాకీ వేగంగా పెరుగుతోందని, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఇది మరింత ఎక్కువగా ఉందని జీఎం రావు పేర్కొన్నారు. అందుకే వివిధ దేశాల్లో విమానాశ్రయ కాంట్రాక్టులతో పాటు, అనుబంధ వ్యాపారాల విస్తరణపై దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, సంక్లిష్టతలున్నా, సరైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, నిలకడైన వృద్ధి సాధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కంపెనీ ఇండోనేషియాలో విమానాశ్రయాన్ని నిర్వహిస్తుండగా, గ్రీస్‌లో కొత్త విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తోంది.తక్కువ మూలధనంతో: తక్కువ మూలధనం అవసరమయ్యే 'అసెట్ లైట్', 'క్యాపిటల్ లైట్' అనుబంధ వ్యాపారాలను వేగవంతం చేయడాన్ని జీఎంఆర్ తమ ప్రధాన వ్యూహంగా పెట్టుకుంది. డ్యూటీ ఫ్రీ రంగాలు, కార్గో సర్వీసులు, రిటెయిల్ ఔట్‌లెట్లు, ఆహార-పానీయ విభాగాలు, నిర్వహణ-పర్యవేక్షణ ఒప్పందాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందువల్ల స్థిరమైన రాబడులు లభిస్తాయని కంపెనీ భావిస్తోంది. తమ అనుభవంతో, కొత్త భౌగోళిక ప్రాంతాల్లో ఈ సేవలను అందుబాటులోకి తేనున్నట్లు సంస్థ వెల్లడించింది.దేశీయంగా భారీ అవకాశాలు: భారతీయ విమానయానయాన రంగానికి దీర్ఘకాలంలో మంచి వృద్ధి అవకాశాలున్నాయని జీఎం రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆదాయాలు పెరుగుతుండడం, పర్యాటక రంగం విస్తరణ, మౌలిక వసతులు మెరుగుపడటం, ప్రభుత్వ సానుకూల విధానాలు ఇందుకు ఊతమిస్తున్నాయని వివరించారు. 2025-26లో జీఎంఆర్ నిర్వహణలోని భారతీయ విమానాశ్రయాలు 11.46 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించాయి. దేశీయ విమాన ప్రయాణాల్లో 25.6%, అంతర్జాతీయ ప్రయాణాల్లో 33.9%

**వాటాను జీఎంఆర్ విమానాశ్రయాలే**

దక్కించుకున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, దిల్లీ సహా దేశంలో 6 విమానాశ్రయాలను కంపెనీ నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం విమానాశ్రయం ఈనెల 17న వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించింది.జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ 2025-26లో ఏకీకృత ప్రాతిపదికన రూ.472 కోట్ల నికర లాభాన్ని సాధించింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించనున్న 11 ప్రాంతీయ విమానాశ్రయాల వేలంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు జీఎంఆర్ ప్రకటించింది.

# 15 రోజులకోసారి మిల్లులకు పంచదార కోటా

## కృత్రిమ కొరత నివారణకు ప్రభుత్వ చర్యలు

దిల్లీ: దేశంలో చక్కెరకు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచే యత్నాలను ప్రభుత్వం అడ్డుకుంటోంది. ఇప్పటికే నిల్వలపై పరిమితులు విధించడం, విదేశాల నుంచి సుంకం లేకుండా 10 లక్షల టన్నుల ముడిచక్కెర దిగుమతికి అనుమతించడంతో.. మిల్లుల నుంచి విక్రయించే చక్కెర ధర 20% వరకు తగ్గింది. ఫలితంగా పంచదార రిటెయిల్ ధరలు కూడా దిగి వస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. సరఫరా సజావుగా కొనసాగేందుకు, కృత్రిమ కొరత నివారించేందుకు సెప్టెంబరు నుంచి చక్కెర మిల్లులకు ప్రతి 15 రోజులకు ఒకసారి విక్రయ కోటా కేటాయించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఆహార మంత్రిత్వ శాఖ, చక్కెర మిల్లులకు నెలవారీ కోటా కేటాయిస్తోంది. దేశంలో చక్కెర లభ్యత, ధరలను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని ఆహార మంత్రిత్వ శాఖ వివరించింది. దేశంలో చక్కెరకు కొరత లేదని మరోసారి స్పష్టం చేసింది. చక్కెర మిల్లుల్లో నిల్వలను తనిఖీ చేయగా.. కొన్ని మిల్లులు నెలవారీ నివేదికల్లో ప్రకటించిన దానికంటే ఎక్కువ నిల్వలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. మరికొన్ని మిల్లులు తమకు కేటాయించిన నెలవారీ కోటా కంటే తక్కువ చక్కెర విక్రయించినట్లు తేలింది. కొన్ని సందర్భాల్లో, నెల ప్రారంభంలో మిల్లులు విక్రయించిన చక్కెరను కొనుగోలుదారులు నెల చివరి వరకు తీసుకెళ్లడం లేదనీ ప్రభుత్వం గుర్తించింది. ఈ సమస్య నివారించేందుకే సెప్టెంబరు నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి చక్కెర కోటా కేటాయిస్తారు.

మిల్లులు తమకు కేటాయించిన చక్కెరలో కనీసం 40 శాతాన్ని మొదటి వారంలో, మిగిలిన మొత్తాన్ని తదుపరి వారంలో విక్రయించాలి. కొత్త విధానం వల్ల డిమాండ్-సరఫరా పరిస్థితిని మెరుగ్గా పర్యవేక్షించొచ్చని, మార్కెట్ పరిస్థితుల్లో మార్పులకు త్వరగా స్పందించొచ్చని ఆహార మంత్రిత్వ శాఖ తెలిపింది. అవసరమైతే అదనపు నిల్వలను కూడా విడుదల చేయొచ్చు.



విక్రయం జరిగిన 7 రోజుల్లోపు మిల్లు నుంచి నిల్వలు పంపించేలా చక్కెర మిల్లులకు ఆదేశాలు జారీ అయ్యాయి. చక్కెరను పెద్ద మొత్తంలో వినియోగించే సంస్థలు, తమ కార్యకలాపాలకు అవసరమైన పరిమాణం కంటే ఎక్కువగా నిల్వ ఉంచుకోవద్దని ప్రభుత్వం సూచించింది.దేశంలో చక్కెరకు కొరతే లేదని, అందువల్ల పండగలకు దొరకదనే భావనతో ప్రజలు అవసరానికి మించి కొనుగోలు చేసి, నిల్వ చేసుకోనవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే 2026-27 చక్కెర మార్కెటింగ్ సంవత్సరానికి సంబంధించి, చెరకు క్రషింగ్ అక్టోబరు 15న ప్రారంభమవుతుందని ఆహార మంత్రిత్వ శాఖ తెలిపింది. మొదటి నెలలోనే 10 లక్షల టన్నులకు పైగా చక్కెర ఉత్పత్తి అవుతుందని అంచనా వేసింది. అక్టోబరులో ఉత్పత్తి అయ్యే చక్కెరను ఎలాంటి పరిమితులు లేకుండా విక్రయించేందుకు మిల్లులకు అనుమతి ఇచ్చారు. దీంతో కొత్త సీజన్‌లో ఉత్పత్తి అయ్యే చక్కెర, దేశీయ మార్కెట్లో వీలైనంత త్వరగా అందుబాటులోకి వస్తుంది.నవంబరులో సుమారు 45 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి అవుతుందని అంచనా.

## మెటా నుంచి ఓపెన్ ఏఐకు సంధ్య దేవనాథన్

దిల్లీ: సామాజిక మాధ్యమం మెటా వైస్ ప్రెసిడెంట్, భారత్, ఆగ్నేయాసియా అధిపతి సంధ్య దేవనాథన్ దశాబ్దకాలం తర్వాత కంపెనీ నుంచి నిష్క్రమించనున్నారు. కృత్రిమమేధ సంస్థ ఓపెన్ ఏఐలో ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియాకు వైస్ ప్రెసిడెంట్‌గా సంధ్య చేరనున్నారు. సంధ్య కోసం కొత్తగా సృష్టించిన ఈ పదవి ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియాల్లో అత్యున్నత సీనియర్ హోదా కావడం గమనార్హం. ఆయా ప్రాంతాల్లో వినియోగదారు వృద్ధి, కంపెనీలతో భాగస్వామ్యం, నియంత్రణ సంస్థలతో చర్చలు నిర్వహించడంతో పాటు, కార్యకలాపాలకు ఆమె బాధ్యత వహించాల్సి ఉంటుంది.

## పారిశ్రామికోత్పత్తిలో 6.7% వృద్ధి

దిల్లీ: దేశ పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) వృద్ధి జులైలో 6.7 శాతంగా నమోదైంది. జూన్‌లో వృద్ధి 8.8% కాగా, గనుల రంగంలో క్షీణత కారణంగా జులైలో కొంత తగ్గింది. కొత్త సిరీస్‌లో విడుదలైన నాలుగో నెలవారీ ఐఐపీ గణాంకాలు కావడం విశేషం. '2026 జులైలో తయారీ రంగంలో 7.3%, విద్యుదుత్పత్తి-గ్యాస్ సరఫరాలో 8.7%, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, వ్యర్థ పదార్థాల నిర్వహణ రంగం 7.4% రాణించడంతో మొత్తం పారిశ్రామికోత్పత్తి 6.7% వృద్ధి చెందింద'ని జాతీయ గణాంక కార్యాలయం(ఎన్ఎస్ఓ) శుక్రవారం పేర్కొంది.

# 9 ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా విక్రయాలతో రూ.55,757 కోట్లు

**2026-27 లక్ష్యంలో 5 నెలల్లోనే 78% పూర్తి**

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో నిర్దేశించిన పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణ లక్ష్యంలో కేంద్రం ఇప్పటికే 78 శాతాన్ని సాధించింది. 2026-27 మొత్తానికి రూ.80,000 కోట్ల లక్ష్యం నిర్దేశించుకోగా, ఏప్రిల్-ఆగస్టులోనే 9 ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో వాటాల విక్రయంతో రూ.55,757 కోట్లు సమీకరించగలిగింది. ఎల్ఐసీ, కోల్ ఇండియా వంటి పెద్ద కంపెనీలతో పాటు ఇండియన్ మెడిసిన్స్ ఫార్మాసూటికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ వ్యూహాత్మక విక్రయం, ఎస్‌యూయూటీఐ నుంచి రెమిటెన్సెస్ కలిపి ఈ మొత్తం వచ్చింది. ఎల్ఐసీలో 6.5% వాటా విక్రయంతోనే రూ.31,515 కోట్లు సమీకరించగలిగింది. కోల్ ఇండియాలో 2% వాటా అమ్మకంతో రూ.5,542 కోట్లు, ఎన్‌హెచ్‌పీసీలో 6.01% వాటా విక్రయంతో రూ.4,357 కోట్లు చొప్పున వచ్చాయి. ఈ వారం మొదట్లో హిందుస్థాన్‌కాపర్‌లో 6% వాటా ఉపసంహరణతో రూ.3041 కోట్లు ఖజానాకు జమయ్యాయి. కేంద్రం తన వాటాలు విక్రయించిన ఇతర సంస్థల్లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎన్ఎల్‌సీ ఇండియా, జీఐసీ, ఐఆర్ఎఫ్‌సీ, కొచ్చిన్ షిప్‌యార్డ్ ఉన్నాయి. ఇన్విట్ ద్వారా ఆస్తుల నగదీకరణతో మరో రూ.6,367 కోట్లు వచ్చాయి. దీంతో మొత్తం రూ.62,124 కోట్లు సమీకరించింది.

# మీడియా, వినోద మార్కెట్ దూసుకెళ్తుంది

**2030 నాటికి రూ.3.5 లక్షల కోట్లకు**

**ఏఐ, ఓటీటీ, గేమింగ్ కలిసొస్తాయ్.. పీడబ్ల్యూసీ అంచనాలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మన దేశంలో మీడియా, వినోద రంగ మార్కెట్ వేగంగా విస్తరించనుంది. డిజిటల్ వ్యాపార ప్రకటనలు, గేమింగ్, స్ట్రీమింగ్, కృత్రిమ మేధ(ఏఐ) వంటివి ఇందుకు దోహదం చేయనున్నాయని పీడబ్ల్యూసీ ఇండియా తన తాజా 'గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ మీడియా అవుట్‌లుక్ 2026-30'లో పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం..ప్రస్తుతం దేశంలో వినోద, మీడియా మార్కెట్ విలువ 25.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.2.45 లక్షల కోట్లు)గా ఉంది. 2030 నాటికి 36.7 బి. డాలర్ల (రూ.3.5 లక్షల కోట్ల)కు చేరొచ్చని అంచనా వేసింది. 2025 నుంచి 2030 మధ్య ఏటా 7.4% సమ్మిళిత వృద్ధి రేటు (సీఏజీఆర్)ను సాధించొచ్చని తెలిపింది. అంతర్జాతీయ అంచనా అయిన 4% వృద్ధికి దాదాపు రెట్టింపు ఇది. వీక్షకులను పెంచుకునే స్థాయి నుంచి, స్థిరమైన ఆదాయాలను కొనసాగించే స్థాయికి ఈ పరిశ్రమ చేరుతోంది. ఈ ప్రయాణంలో డిజిటల్ వ్యవస్థ, ప్రాంతీయ కంటెంట్, సాంకేతికత కీలక పాత్ర పోషించనున్నాయి. డిజిటల్ వ్యాపార ప్రకటనలు మరింత కీలకంగా వ్యవహరించనున్నాయి. ఈ విభాగ ఆదాయం 2025లోని 7.5 బి. డాలర్ల (సుమారు రూ.71,250 కోట్ల)తో పోలిస్తే 2030 కల్లా 13.9% సీఏజీఆర్‌తో 14.3 బి. డాలర్ల (సుమారు రూ.1.36 లక్షల కోట్ల)కు చేరొచ్చని అంచనా. సెర్చ్, వీడియో ప్రకటనలు ఈ వృద్ధికి దోహదం చేయనున్నాయి. ఓటీటీ వీడియో మార్కెట్ ఇదే సమయంలో 2.2 బి. డాలర్ల (సుమారు రూ.21,000 కోట్ల) నుంచి 10.2% సీఏజీఆర్‌తో 3.6 బి. డాలర్ల (సుమారు రూ.34,200 కోట్ల)కు చేరే అవకాశం ఉంది. వీడియో గేమ్స్, ఇస్పోర్ట్స్ ఆదాయాలు 2025లోని 1.5 బి. డాలర్ల నుంచి 2030 కల్లా 2.6 బి. డాలర్లకు చేరొచ్చు. ఇన్-గేమ్ వ్యాపార ప్రకటనలు, స్పాన్సర్‌షిప్‌లు, రికరింగ్ ఆదాయ మోడళ్లు కలిసి గేమింగ్ కంపెనీలకు ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. ఏఐ (కృత్రిమమేధ) కూడా ఈ రంగంపై ప్రభావం చూపనుంది. కంటెంట్ సృష్టితో పాటు ప్రొడక్షన్ నుంచి వ్యాపార ప్రకటనల వరకు అన్నిటా ఇది మద్దతు పలకనుంది. డిజిటల్ ప్లాట్‌ఫారాలతో పాటు సంప్రదాయ టీవీ, పత్రికా రంగ ఆదాయాలూ పెరగనున్నాయి. టీవీ ఆదాయాలు 2025లో 7.2 బి. డాలర్లు (సుమారు రూ.68,400 కోట్లు)గా ఉండగా, 2030 నాటికి 7.5 బి. డాలర్లకు వార్తాపత్రికల ఆదాయాలు 3 బి. డాలర్ల(సుమారు రూ.28,800 కోట్ల) నుంచి 3.5 బి. డాలర్ల (రూ.33,600 కోట్ల)కు చేరనున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
29 ఆగస్టు 2026

# చిన్న నీటిపారుదలపై సీఎంకు నివేదిక



జూబ్లీహిల్స్ (జనంసాక్షి) : చిన్న నీటిపారుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదికను వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సమర్పించారు. రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి హాజరయ్యారు. కమిషన్ నివేదికలో ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక యూనిట్లతో ప్రత్యేక చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను కలిపే కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని నివేదికలో సూచించింది. చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని, తక్షణం చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) సరిహద్దులను గుర్తించి ఆక్రమణలను తొలగించి పరిరక్షించాలని సూచించింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని పేర్కొంది. ఈ సందర్భంగా పంటల మార్పిడి, ఉద్యానవన పంటల సాగు పెంపు, ఎఫ్ పీవో ల ఏర్పాటు వంటి అంశాలపై కమిషన్ దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా రెండేళ్ల కాలంలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను సీఎంకు కమిషన్ బృందం వివరించింది. కమిషన్ పనితీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

# 24 కిలోల గంజాయి చాక్లెట్ల పట్టివేత

- పాన్ షాప్ ముసుగులో విక్రయం
- బీహార్‌కు చెందిన బైద్యనాథ్ కుమార్ అరెస్టు




**శామీర్‌పేట్, ఆగస్టు 29(జనం సాక్షి) :** పాన్ షాప్ ముసుగులోఅమ్ముతున్న గంజాయి చాకలేట్లు గుట్టు రట్టయిన సంఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో ఏ సీపీ చక్రపాణి మీడియా సమావేశం శనివారం నిర్వహించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన బైద్యనాథ్ కుమార్ (29) తుంకుంటలో పాన్ షాప్ నడుపుతూ చంద్రారెడ్డి కాలనీలో భార్య పూజ కుమారి, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నాడు. పాన్ షాప్ లో సరిపడ ఆదాయం రాకపోవడంతో బీహార్ నుంచి భార్య పూజ కుమారి గంజాయి చాక్లెట్లు తక్కువ ధరకు తీసుకు వచ్చి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయించేవారు. బైద్యనాథ్ కుమార్ ఇంట్లో పోలీసులు సోద చెయ్యగా 24.56 కిలోల బరువున్న 5,298 గంజాయి చాకోలెట్లు భద్ర పరచిన సూట్ కేసు, మొబైల్ ఫోన్, 1760 రూపాయల నగదు స్వాదీనం చేసుకొని బైద్యనాథ్ కుమార్ ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. గంజాయి విక్రాయల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి రహస్యాలు గుప్తంగా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ నర్సిహ్మా రెడ్డి, డి ఐ మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలి



- రాజకీయ ఖైదీల విడుదల ఐక్య వేదిక..

**ముషీరాబాద్ ఆగస్టు 29 (జనం సాక్షి):** జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలను, ముఖ్యంగా ఆదివాసీ ఖైదీలను వెంటనే విడుదల చేయాలని, అక్రమంగా నమోదు చేసిన ఉపా కేసులను ఎత్తివేయాలని రాజకీయ ఖైదీల విడుదల ఐక్య వేదిక–తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద గల ధర్మచౌక్లో వరాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సిపిఐఎం కార్యదర్శి జాన్ వెస్లీ, పిఓడబ్ల్యు సంధ్య తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ప్రజా ఉద్యమాలు, సామాజిక సమస్యలపై పోరాటాలు, రచనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, న్యాయ పోరాటాలు, జర్నలిజం తదితర రంగాల్లో పనిచేస్తున్న ఉద్యమకారులు, మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, న్యాయవాదులు, జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని ఐక్యవేదిక ఆరోపించింది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో మావోయిస్టు లనే ఆరోపణలతో అనేక మంది ఏళ్ల తరబడి విచారణ ఖైదీలుగా జైళ్లలో మగ్గుతున్నారని పేర్కొంది. వీరిలో అధిక సంఖ్యలో ఆదివాసీలు ఉన్నారని, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులు, మహిళలు కూడా ఉన్నారని తెలిపింది. దీర్ఘకాలిక నిర్బంధం కారణంగా ఖైదీల ఆరోగ్యం, కుటుంబ సంబంధాలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ముస్లిం మైనారిటీలపై నమోదు చేసిన ఉపా కేసులను కూడా ఎత్తివేసి, రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేసింది. తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసులను కూడా తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరింది. ఈ ధర్నాలో ప్రజాస్వామిక వాదులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరకట్న వేధింపులతో వివాహిత మృతి



**వలిగొండ, ఆగస్టు 29 (జనం సాక్షి) :** వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భువనగిరి మండలంలో చోటుచేసుకుంది. తాజ్‌పూర్ గ్రామానికి చెందిన అశ్వినికి వలిగొండ మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన కొలిచేలిమి మహేష్‌తో 2023లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త మహేష్ తరచూ అదనపు వరకట్నం కోసం అశ్వినిని వేధించేవాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో అశ్విని ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు భర్త మహేష్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది.

# హైదరాబాద్‌లో ఏడు రెస్టారెంట్లలో ఆహార భద్రతా ఉల్లంఘనలు

**అమీర్ పేట్ (జనంసాక్షి) :** నగరంలోని ఏడు రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అధికారులు గుర్తించారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఆరు బృందాలు ఆహార భద్రతా అధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టాయి. బంజారాహిల్స్‌లోని చట్నీస్, స్పైస్ 6, ఓగ్రీస్, జూబ్లీహిల్స్‌లోని ది స్పైసీ వెన్యూ, టోలిచౌకిలోని 4 సీజన్స్ మల్టీకుయిజిన్ రెస్టారెంట్, షా గౌస్ రెస్టారెంట్, గచ్చిబౌలిలోని పిస్తా హౌస్ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రెస్టారెంట్లలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోపాటు గడువు ముగిసిన ఆహార పదార్థాలు, కుళ్లిన కూరగాయలు గుర్తించారు. ఆహార పదార్థాల నిల్వ, నిర్వహణలోనూ లోపాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎఫ్ఎస్ఎస్ లేబులింగ్, డిస్‌ప్లే నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు కొన్ని చోట్ల పురుగుల బెడద ఉన్నట్లు గుర్తించారు. కల్తీపై అనుమానంతో 11 ఆహార నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. నిబంధనలను ఉల్లంఘించిన రెస్టారెంట్లకు నాలుగు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు, మూడు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు టీజీ సేఫ్ అధికారులు తెలిపారు.

# వివాద రహిత భూములన్నింటినీ సర్వే చేసి పట్టాలిస్తాం

- భూ సమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం
- మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- సీలింగ్ భూములకు పట్టాల పంపిణీ
- నూతనకల్,మద్దిరాల మండలాల రైతులకు తీరిన భూ సమస్యలు



**నూతనకల్ /మద్దిరాల ఆగస్టు 29 (జనంసాక్షి) :** రానున్న సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత భూములన్నిటీని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి భూ ఆసాములకు పట్టాలు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.శనివారం అయన సూర్యాపేట జిల్లా, నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు సంబంధించి దశాబ్దాల తరబడి పెండింగ్ లో ఉన్న15 గ్రామాల లోని 1921 మంది రైతులకు 2091 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాలతో పట్టా హక్కులు కల్పించి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న భూములకు ఏళ్ళ తరబడిగా పట్టాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, దాని ద్వారా వివాద రహిత భూములన్నింటికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో తాతలనాటి నుండి వస్తున్న భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం చేస్తున్నామన్నారు.భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రతి అంగుళం భూమిని అధికారులు సర్వే చేసి నిజమైన ఆసాములకు హక్కు పత్రాలు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని వారు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో మొదటి విడతన 70 గ్రామాలను ఎంపిక చేసుకొని సర్వే చేయించడం జరిగిందన్నారు.రాష్ట్రంలో పలుచోట్ల రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు కబ్జాకు గురవుతుండడం తమ దృష్టికి వచ్చిందని,వీటిని అరికట్టేందుకు తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రానున్న సంవత్సరకాలంలో ప్రతి అంగుళాన్ని సర్వే చేస్తామని, వివాదారహిత భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని పునరుద్ఘాటించారు. పంచాయతీలేని భూములకు, భూములున్న ఆసాములు అందరికీ పట్టాలిస్తామన్నారు. గత ప్రభుత్వం 8 లక్షల ఇరవై ఒక్క వేల కోట్ల అప్పును తమ ప్రభుత్వం పై మోపినప్పటికీ తల తాకట్టు పెట్టైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అపకూడదన్నదే తమ ఉద్దేశమని,సంక్షేమ కార్యక్రమాలు కుంటు పడకుండా తమ ప్రభుత్వం అమలు చేస్తున్నదని, అందులో భాగంగానే రైతులకు కూడా న్యాయం చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు.గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పట్టాలు ఇవ్వలేదని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నదని అన్నారు. గడచిన రెండున్నర సంవత్సరాలలో రాష్ట్రంలో మహిళలకు 63 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని, రానున్న రెండున్నర ఏళ్లలో కూడా అంతే రుణాలు ఇస్తామని ,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం, రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఘనత తమదేనని మంత్రి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జనం బ్రహ్మ రథం పడుతున్నారని,హైద్రాబాద్ లో కోట్ల రూపాయల విలువచేసే భూములలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి మొదటి విడత,3500,రెండో విడత 2000 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, మూడవ ,నాలుగో విడతల్లో కూడా ఇస్తామని, ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేదవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల రైతుల సమస్యలకు పరిష్కారం పట్టాలు ఇవ్వడమని అన్నారు. భూమికి హక్కు ఉంటే రైతుకు ధైర్యం ఉంటుందని,రైతులకు రైతు భరోసా,రైతు భీమా ఇతర లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 5 లక్షల రూపాయలు ఇచ్చిన దాఖలాలు లేవని, రాష్ట్రవ్యాప్తంగా 36వేల కోట్ల రూపాయలతో డబుల్ ట్రిబుల్ లైన్ల రోడ్లను నిర్మిస్తున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి 100 కోట్ల రూపాయలతో రోడ్లు మంజూరు చేయడం జరిగిందని,మరో 200 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే సూర్యాపేట నియోజకవర్గం లోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లను వేస్తామని తెలిపారు. ప్రజలకు సన్నబియ్యం, రైతు భరోసా, రైతుబంధు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లను ఎట్టి పరిస్థితులలో ఆపమని, గుడిసె ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి గుడిశలేని తెలంగాణగా మారుస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, రాష్ట్ర రెవెన్యూ,సిసి ఎల్ ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, ల్యాండ్ సర్వీస్ సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు,అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ ,ఆర్డీవోలు వేణు మాధవరావు, తహసిల్దారులు పి శ్రీనివాసరావు, తబిత,రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్,సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి,నూతనకల్ మండల పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి, పచ్చిపాల వెంకన్న యాదవ్, పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, ఎంపీడీవోలు సునీత, సత్యనారాయణ రెడ్డి వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# 180 ఎజెండా అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

- ప్రజా సమస్యలపై విస్తృత చర్చ
- నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్
- ప్రశాంతంగా ముగిసిన కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం



కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి): కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11 గంటలకు తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభమైన సమావేశం సాయంత్రం 3:40 గంటలకు జాతీయ గీతంతో ముగిసింది. నగర ప్రగతి, ప్రజారోగ్యం, అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన మొత్తం 180 ఎజెండా అంశాలకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సభలో సభ్యులు పారిశుధ్యం, వీధిదీపాలు, తాగునీరు, ప్లాస్టిక్ నివారణ, కుక్కలు, కోతుల బెడద, రోడ్లు, డ్రైనేజీలు, స్మశాన వాటికలు, పారిశుధ్య కార్మికుల కొరత, భవన నిర్మాణ అనుమతులు, డిజిటల్ ఇంటి నంబర్లు, ఆక్ర మణలు, వ్యర్థాల నిర్వహ ణ, ఇందిరమ్మ గృహాలు, ఆస్తి పన్నులు, పార్కుల పరిరక్షణ తదితర ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై మేయర్, కమిషనర్ సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్‌ను ప్లాస్టిక్ రహిత మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాలకు ఉచిత విద్యుత్ అందించేం దుకు సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.17 కోట్లు, స్మార్ట్ సిటీ నుంచి రూ.8 కోట్లు కేటాయించి ప్రక్షాళన చేపడుతున్నట్లు చెప్పారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు జేసీబీ లు, లాడర్లు, ఫాగింగ్ యంత్రాలు, అంతిమయాత్ర రథాలు, బ్లేడ్ ట్రాక్టర్లు, రిక్షాలు కొనుగోలు చేస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకంలో నగరాన్ని చేర్చి రూ.840 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనలు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. యూఐడీఎఫ్ కింద పలు డివిజన్లలో పనులు ప్రారంభించామని, నిలిపివేసిన పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుం టామన్నారు. ఏబీసీ సెంటర్‌లో 150 కెన్నెల్స్ ఏర్పాటు చేసి సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.2 కోట్లతో టెండర్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. నగరంలోని 66 డివిజన్ల ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, విలీన గ్రామాల డివిజన్లలో మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ స్కామ్ కేసులో రూ.4.50 లక్షలు రికవరీ

- బోరబండ పోలీసుల సేవలకు బాధితుడి కృతజ్ఞతలు

**అమీర్‌పేట్ (జనంసాక్షి) :** ఆన్‌లైన్ స్కామ్‌కు గురైన బాధితుడి నుంచి మోసపోయిన రూ.4.50 లక్షల నగదును బోరబండ పోలీసులు విజయవంతంగా రికవరీ చేశారు. కేసును ఛేదించి బాధితుడి డబ్బును తిరిగి ఇప్పించడంలో పోలీసులు చొరవ చూపారు. ఈ సందర్భంగా బాధితుడు షేక్ మహమ్మద్ ఇర్ఫాన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఆన్‌లైన్ స్కామ్ కేసును సమర్థవంతంగా పరిష్కరించి, కష్టపడి సంపాదించిన నగదును తిరిగి రికవరీ చేసిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, బోరబండ సీఐ రవికుమార్, డీఐ సైదులుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పోలీసులు స్పందించి వేగంగా చర్యలు తీసుకోవడం వల్లే తన డబ్బు తిరిగి లభించిందని పేర్కొన్నారు.

# అధికారుల, పాలకవర్గం సమన్వయం అవసరం



- డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శనివారం రోజు నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొన్నారు. యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... నగరంలోని వివిధ డివిజన్లకు సంబంధించి కార్పొరేటర్లు సభ దృష్టికి తీసుకువచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని మేయర్ కొలగాని శ్రీనివాస్, నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌లను కోరారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు, నగర పరిధిలోని సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించేందుకు పాలకవర్గం, అధికారులు పరస్పర సమన్వయం తో కృషి చేయాలని సూచించారు. ముఖ్యం గా నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగు టపరిచేందుకు ప్రతి డివిజన్‌లో అదనంగా ఇద్దరు లేబర్లను (పారిశుధ్య కార్మికులను) తాత్కాలిక పద్ధతిలో నియమించాలని తాను మేయర్, కమిషనర్ లను కోరగా, ఈ ప్రతిపాదనను టేబుల్ ఎజెండాగా ప్రవేశపెట్టగా పాలకవర్గ సభ్యులు దానిని ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించడం జరిగిందని తెలిపారు.

# క్రైమ్ పారామీటర్లలో నల్లగొండ పోలీస్ సత్తా



- 8 అంశాల్లో సమగ్ర పనితీరు.. క్లస్టర్-3లో జిల్లాకు అగ్రస్థానం
- ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు ప్రశంసాపత్రం అందజేసిన డీజీపీ సీవీ ఆనంద్

నల్లగొండ, ఆగస్టు 29 (జనం సాక్షి) : క్రైమ్ పారామీటర్ల అమలు, పోలీస్ శాఖ పనితీరులో నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల పనితీరుపై నిర్వహించిన సమీక్షలో 8 కీలక అంశాల్లో సమగ్ర పనితీరు ఆధారంగా నల్లగొండ జిల్లా క్లస్టర్–3లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్కు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, అంకితభావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించడంపై డీజీపీ ప్రశంసలు వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీజీపీ సీవీ ఆనంద్ జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. నల్లగొండ జిల్లా పోలీస్ శాఖకు లభించిన ఈ గుర్తింపుపై ఎస్పీ శరత్ చంద్ర పవార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, వివిధ విభాగాల బృందాలకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సమష్టి కృషితోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు.

# సర్వేనెం.151 ముమ్మాటికి ప్రభుత్వ భూమే..

- శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్
- బై నంబర్ తో నిర్మిస్తున్న ఓ భవనాన్ని సీజ్ చేసిన ఎమ్మార్వో



**శేరిలింగంపల్లి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** హఫీజ్ పేట డివిజన్ దీప్తి శ్రీనగర్ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 151 ప్రభుత్వ భూమి గానే పరిగణించబడుతుందని, ఇందులో ఎవరు ఎలాంటి చర్యలకు పూనుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్ శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు హఫీజ్పేట్ దీప్తిశ్రీనగర్ రేగుల కుంట సర్కారీ శిఖంలో తప్పుడు దృపత్రాలను సృష్టించి బై నెంబర్లతో నిర్మిస్తున్న ఓ భవనాన్ని తనిఖీ నిర్వహించిన మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా నిర్ణయిస్తూ దాంట్లో హెచ్చరిక బోర్డును పెట్టి ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్ మరియు తహసీల్దార్ అయిన మహిపాల్ రెడ్డి ఈ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటున్నామని, ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడినా.. నిర్మాణాలు కొనసాగించినా.. తెలంగాణ భూఆక్రమణ చట్టం 1905 ప్రకారం న్యాయపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేస్తూ అక్రమ నిర్మాణంగా నిర్ధారించిన సదరు బహుళ అంతస్తుకు కట్టిన బ్యానర్ లో స్పష్టం చేశారు. ఈ క్రమంలో జనం కోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి మండల డిప్యూటీ కలెక్టర్కు ఫిర్యాదు చేస్తూ దీప్తి శ్రీనగర్ అక్రమ నిర్మాణాన్ని మొత్తం తొలగించి 1202 తోపాటు 374 గజాల పూర్తి చెరువు సర్కారీ శిఖం స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు, కింది స్థాయి సిబ్బంది కబ్జాదారులతో అక్రమ పద్ధతులలో బేరసారాలకు దిగినట్లు తమ దృష్టికి వస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, మానుకోవాలని కసిరెడ్డి భాస్కర్ రెడ్డి చేశారు.



> ### భారీ కుంభకోణానికి తెరలేపారు..
> ఉమ్మడి మెదక్ డీసీసీబీ బ్యాంకు నుంచి ప్రత్యేకంగా సర్క్యూలర్ జారీ చేసి ఉమ్మడి జిల్లా రైతుల నుంచి సుమారు రూ.8 నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేసి భారీ కుంభకోణానికి తెరలేపారు. మరి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసిన డబ్బులు ఎక్కడికి వెళ్లాయనే విషయంపై విచారణ చేయాల్సిన అవసరం ఉంది. నిబంధనలు కాదని డబ్బులు వసూలు చేసిన చైర్మన్, డీసీసీబీ సీఈఓలపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. కేవలం రైతుల నుంచే కాకుండా ఉద్యోగుల బదిలీల్లోనూ భారీ ఎత్తున వసూళ్లు చేసినట్లు రైతు సంఘాల నాయకులు, ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అయితే వీటిపై రైతు సంఘాల నాయకులు సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ఫిర్యాదులు చేశారు. దీంతో మంత్రి విచారణకు ఆదేశించారు. పూర్తి విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# డీసీసీబీలో దొంగలు

## అక్రమాలకు అడ్డగా డీసీసీబీ

### నిబంధనలకు విరుద్ధంగా రూ. 8 నుంచి రూ.10 కోట్ల వసూలు

**గతంలో పలు ఆరోపణలు.. వెలుగులోకి వచ్చిన అవినీతి... ఆ ఫైసల్ ఏమయ్యాయి?**

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 29(జనంసాక్షి) :** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. వడ్డీల రాయితీలు, రుణాల కిస్తీలు, లబ్ధిదారుల పేరిట రుణాలను స్వాహా చేయడంలో.. బ్యాంకు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇదే అదునుగా అక్రమార్కు లు రెచ్చిపోతున్నారు. తమకు అడ్డు చెప్పేవారు లేకపోవడంతో.. అవినీతికి పాల్పడుతున్నారు. తాజాగా ఉమ్మడి మెదక్ జిల్లా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ పరిధిలో రైతుల నుంచి నిబంధన లకు విరుద్ధంగా సుమారు రూ. 8 నుంచి రూ. 10 కోట్ల వరకు వసూలు చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.

**ఎవరిని కదిలించినా...**

సహకార రంగంపై అవగాహన ఉన్న వారు ఎవరిని కదిలించినా.. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో జరిగిన కుంభకోణం దేశంలో ఏ సహకార సంస్థలోనూ జరిగి ఉండదని ఆరోపణలు వినిపిస్తున్నాయి అంతే కాదు, ఈ వ్యవహారం గురించి సీరియస్‌గా తీసుకుంటే రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఎక్కడ డీసీసీబీ గుర్తింపును రద్దు చేస్తుందోనని ఆందోళన కూడా చెందుతు న్నారు. ఉమ్మడి జిల్లాలోని సహకార బ్యాంకులో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై డీసీసీబీ వర్గాలు అంత సీరియస్‌గా ఏమీ లేవు. రైతుల నుంచి ఇన్స్‌పెక్షన్ చార్జీల పేరిట గత డీసీసీబీ సీఈఓ, చైర్మన్ ఇద్దరు కలిసి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేశారు.

ఇన్స్ పెక్షన్ ఛార్జీలు వసూలు చేయాలంటూ గత సీఈఓ శ్రీనివాస్ 2025 జూన్ 16 నుంచి అక్రమంగా ఉమ్మడి జిల్లా రైతుల నుంచి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమంగా ఇన్స్‌పెక్షన్ చార్జీలు వసూలు చేయడంపై ఉమ్మడి జిల్లా రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీసీసీబీ సీఈఓగా పనిచేసిన శ్రీనివాస్, ఇంకొందరు అధికారులు కలిసి ఈ వ్యవహారాన్ని చక్క బెట్టినట్లు ఆరోపిస్తున్నారు. కాగా దీనిపై శ్రీనివాస్ పై విచారణ జరుగుతుండగా ఆయనను నిజామాబాద్‌కు బదిలీ చేశారు. కేవలం ఒక సర్క్యూలర్ ద్వారా కోట్ల రూపాయాలు వసూలు చేయడంలో అధికారులు కీలకపాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




> ### అక్రమాలకు అడ్డగా...
> బ్యాంకును ఆర్థికంగా పటిష్టంగా ఉంచడంలో కీలకపాత్ర వహించాల్సిన సొసైటీలు అనేక అక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. బ్యాంకు సొమ్ములను దిగమింగే అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నాయి. దీంతో డీసీసీబీ సొమ్ము చాలా వరకు దొంగల పాలవుతోంది. అప్పుల రూపంలో ఇచ్చిన సొమ్ము వెనక్కు తిరిగి రావడం కలగానే మారుతోంది. డీసీసీబీ ద్వారా జారీ చేసే రుణాల్లో అసలు రైతులకు ప్రయోజనం చేకూరేది పిసరంత.. కొందరు నేతలు, అక్రమార్కులకు డీసీసీబీ బంగారుబాతులా మారింది. తమ పలుకుబడి, అధికారాలతో అనేక మంది నేతలు రూ. 8 నుంచి రూ. 10 కోట్ల వరకు స్వాహా చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# అన్నదాతకు సౌర వెలుగులు

***దమ్మన్నపేటలో 2 మెగావాట్ల సోలార్ ప్లాంట్ టెస్ట్ రన్***

- గ్రిడ్‌కు అనుసంధానం చేసిన అధికారులు
- జిల్లాలో ఐదు ప్రాజెక్టులు.. 10 మెగావాట్ల సామర్థ్యం
- యూనిట్‌కు రూ.3.13 చొప్పున డిస్కం చెల్లింపు



**గంభీరావుపేట, ఆగస్టు 29 (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేటలో 2 మెగావాట్ల పీఎం-కుసుమ్ సోలార్ ప్లాంట్‌ను గ్రిడ్‌కు అనుసంధానించి టెస్ట్ రన్ నిర్వహించారు. నాగంపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రాపెల్లి రవీంధర్ సాంకేతిక పరీక్షలు చేపట్టారు. పీఎం-కుసుమ్ పథకం రైతులకు ప్రయోజనకరమని, సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఐదు పీఎం-కుసుమ్ ప్రాజెక్టులు గ్రిడ్‌కు అనుసంధానమయ్యాయని, వాటి మొత్తం సామర్థ్యం 10 మెగావాట్లని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 95 మంది రైతులు 125.9 మెగావాట్లకు పీపీఏలు చేసుకున్నారని రెడ్కో జిల్లా మేనేజర్ మనోహర్ వెల్లడించారు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.3.13 చొప్పున డిస్కం చెల్లిస్తుందని తెలిపారు. ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్‌కు 3.5 ఎకరాల భూమి, సుమారు రూ.3.5 కోట్ల పెట్టుబడి అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిస్కం అధికారులు, ప్లాంట్ యజమాని జూనూతుల రాజారెడ్డి, శ్రేయాస్ ఇన్ఫ్రా కరుణాకర్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసాలపై కదం తొక్కాలే...!

- **సెప్టెంబర్ 02 నుంచి బీఆర్ఎస్ సమరభేరి నిరసన కార్యక్రమాలు చేపట్టాలి**
- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపు**



**మంథని, ఆగస్టు 29, (జనంసాక్షి) :** అనేక హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలను చేసిన మోసాలపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కదం తొక్కాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. శనివారం మంథని పట్టణంలోని రాజగృహలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి ప్రతి మండల కేంద్రంలో వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీలు , 420 హామీలిచ్చి గద్దెనెక్కి తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆయన తెలిపారు. అధికారంలోని వచ్చి వేయి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆయన వివరించారు. ఓట్ల కోసం ప్రతి ఇంటికి గ్యారెంటీ కార్డులు ఇచ్చారని, ఆ బాకీ కార్డులతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారని, కాంగ్రెస్ 6 గ్యారెంటీలు, 420 హామీల మోసాలను ప్రతి నియోజకవర్గంలోని గల్లీ గల్లీలో ఎండగట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. వారం రోజుల పాటు ప్రతి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి బీఆర్ఎస్ సమరభేరిని మ్రోగించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

**స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్‌కుమార్ షట్కర్**

**కామారెడ్డి, ఆగస్టు 29 (జనం సాక్షి):** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లిలోని రెడ్డి సంఘం ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులు పొందడంతోపాటు పలు సంక్షేమ పథకాలకు అర్హత లభిస్తుందని చెప్పారు. ఆరు గ్యారంటీలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో రోడ్లు, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని ఎంపీ సురేష్‌కుమార్ షట్కర్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులతో పేద కుటుంబాలకు మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రాణి రాజు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలి

***ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 కోట్లు***

- **ప్రజాభిప్రాయంతో అభివృద్ధి పనులు**
- **గోదావరి పుష్కరాలకు మరో రూ.40 కోట్లు**
- **మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం**



**జగిత్యాల బ్యూరో, ఆగస్టు 29 (జనం సాక్షి):** ధర్మపురి క్షేత్రంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ఆలయ పునర్నిర్మాణంపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి శనివారం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రజాభిప్రాయ సేకరణ, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఉగ్ర నరసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. అగ్రహారం బ్రాహ్మణులు, వేద పండితులు, పట్టణ ప్రజల అభిప్రాయాలను తీసుకొని పనులను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే రూ.117 కోట్లు కేటాయించగా, బైపాస్ రోడ్లు, పుష్కర ఘాట్ల నిర్మాణానికి మరో రూ.40 కోట్లు విడుదల కానున్నాయని వెల్లడించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, అదనపు కలెక్టర్ రాజగౌడ్, ఆర్డీవో మధుసూదన్, ఆలయ ఈవో శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, బ్రాహ్మణులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు నీట్ పీజీ-2026 ప్రవేశ పరీక్ష

**పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ బి. సత్య ప్రసాద్**



**జగిత్యాల బ్యూరో, ఆగస్టు 29 (జనం సాక్షి):** జగిత్యాల జిల్లాలో నీట్ పీజీ-2026 ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆగస్టు 30న కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒకే షిఫ్టులో జరుగుతుంది. జిల్లాలోని కొడిమ్యాల మండలం నాచుపల్లిలోని జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఉదయం 7 నుంచి 8.30 గంటలలోపు కేంద్రానికి చేరుకోవా లని కలెక్టర్ సూచించారు. పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తు, నిరంతర విద్యుత్, ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, వైద్య సదుపాయాలు, పారిశుధ్య చర్యలు ఏర్పాటు చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా సైబర్ పోలీసులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అభ్యర్థుల రాకపోకలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లను వ్యక్తిగతంగా పరిశీలించి, లోపాలను పరీక్ష ప్రారంభానికి ముందే సరిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లోని సూచనలను తప్పనిసరిగా పాటించి ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

# అధికారుల, పాలకవర్గం సమన్వయం అవసరం

**డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 29 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శనివారం రోజు నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొన్నారు. యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... నగరంలోని వివిధ డివిజన్లకు సంబంధించి కార్పొరేటర్లు సభ దృష్టికి తీసుకువచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని మేయర్ కొలగాని శ్రీనివాస్, నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌లను కోరారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు, నగర పరిధిలోని సమస్యలన్ని ంటినీ త్వరితగతిన పరిష్కరించేందుకు పాలకవర్గం, అధికారులు పరస్పర సమన్వయం తో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రతి డివిజన్‌లో అదనంగా ఇద్దరు లేబర్లను (పారిశుధ్య కార్మికులను) తాత్కాలిక పద్ధతిలో నియమించాలని తాను మేయర్, కమిషనర్ లను కోరగా, ఈ ప్రతిపాదనను టేబుల్ ఎజెండాగా ప్రవేశపెట్టగా పాలకవర్గ సభ్యులు దానిని ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించడం జరిగిందని తెలిపారు.

# సర్కారు బడుల విస్తరణకు చర్యలు

- **బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్**
- **1,120 మంది విద్యార్థులతో జిల్లాలోనే అత్యధిక నమోదు**
- **నీట్ పీజీ కేంద్రాల్లో ఏర్పాట్లపై పరిశీలన**
- **లోటుపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం**



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29 (జనం సాక్షి):** మోపాల్ మండలం బోర్గాం(పి)లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం సందర్శించారు. పాఠశాలలో 1,120 మంది విద్యార్థులు చదువుతున్నారని, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డులు లభించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా మైదానం లేకపోవడంతో పాఠశాలకు ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం, గ్రంథాలయ భవనాలను ఇతర ప్రాంతాలకు తరలించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. తద్వారా క్రీడా మైదానంతోపాటు అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పాఠశాల విస్తరణకు అవసరమైతే ఆనుకుని ఉన్న ప్రైవేటు స్థలాన్ని కొంతమేర సేకరించే చర్యలు చేపట్టాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో భౌతికశాస్త్రం, గణితం, ఆంగ్లం అంశాలపై ప్రశ్నలు వేసి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. సరైన సమాధానాలు చెప్పిన వారికి పెన్నులు అందజేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు బయటి ప్రపంచంపై అవగాహన కల్పించాలని, ఏకాగ్రతతో చదివి పోటీ ప్రపంచంలో రాణించేలా ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, తహసిల్దార్ రేఖ, ఎంఈఓ సాయిలు, ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పీజీ పరీక్షకు జిల్లాలో 265 మంది అభ్యర్థులు హాజరుకానున్న నేపథ్యంలో అర్సపల్లిలోని ఏవీ ఎంటర్‌ప్రైజెస్, మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ భవేష్ మిశ్రా పరిశీలించారు. కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పరికరాలు, ఇంటర్నెట్ తదితర సదుపాయాలను తనిఖీ చేశారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఈఓ అశోక్, డీఐఈఓ రవికుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ, ఏసీపీ ప్రకాశ్ పాల్గొన్నారు.

# పౌర హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావులేదు

- **పౌర హక్కుల దినోత్సవంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**
- **ఎస్సీ, ఎస్టీల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29 (జనంసాక్షి) :** ఎస్సీ, ఎస్టీల పౌర హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తూముకుంటలో శనివారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, సామాజిక అణచివేత, దాడులు, వేధింపులు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పౌర హక్కుల పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం విలువలను ఆచరించాలని పిలుపునిచ్చారు.

బాధితులు పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా చట్టప్రకారం వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. దాడులు, అవమానాలు, భూవివాదాలు, సామాజిక వివక్షకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పెండింగ్ భూముల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, పౌరహక్కుల ఉల్లంఘన కేసులను జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు కమిషన్ అండగా ఉంటుందని బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


# వేపచెట్టు చిచ్చు.. ఇద్దరి ప్రాణాలు బలి!

- **పాత కక్షలతో ఇరువర్గాల ఘర్షణ**
- **గొడ్డలి దాడిలో ఇద్దరి మృతి**
- **ఘర్షణను అడ్డుకునే క్రమంలో ఎస్సైకి గాయాలు**

**మేళ్లచెరువు ఆగస్టు 29 (జనం సాక్షి):** మేళ్లచెరువు మండల పరిధిలోని ఎర్రగట్టు తండాలో వేప చెట్టు విషయంలో తలెత్తిన వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసి ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఎర్రగట్టు తండాలో శనివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసు కుంది. స్థానికుల సమాచారం ప్రకారంవేప చెట్టు విషయం లో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తడం తో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో గొడ్డలితో జరిగిన దాడిలో మంద వెంకటేశ్వర్లు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో వ్యక్తి సైదాకు తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు సమాచారం. ఘర్షణను అదుపులోకి తీసుకునేం దుకు ప్రయత్నించిన మేళ్లచెరువు ఎస్సై నవీన్‌కుమార్‌కు కూడా గాయాల య్యాయి. విషయం తెలుసుకున్న కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మఠంపల్లి, చింతలపాలెం ఎస్సైలు సైతం అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు లు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.





















## సెప్టెంబర్ 6న చలో హైదరాబాద్: ఉద్యోగుల జేపీసీ

**హైదరాబాద్, (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యోగుల జేఏసీ మరోసారి ఉద్యమ బాట పట్టింది. పెండింగ్లో ఉన్న పీఆర్సీ, డీఏలను వెంటనే విడుదల చేయడంతోపాటు.. సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేసింది. సెప్టెంబర్ ఒకటిన సీపీఎస్ విద్రోహ దినం, సెప్టెంబర్ 6న చలో హైదరాబాద్ చేపడుతున్నట్లు తెలిపింది. ఇందుకోసం కార్యాచరణ సిద్ధం చేసింది. హైదరాబాద్లో జేఏసీ భాగస్వామ్య సంఘాలతో సమావేశమైన జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్.. ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ డిమాండ్లు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

సెప్టెంబర్ ఒకటో తేదీని సీపీఎస్ విద్రోహ దినంగా పాటించాలని జేఏసీ నిర్ణయించింది. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి.. మధ్యాహ్నం సమయంలో కార్యాలయాల ముందు నిరసనల్లో పాల్గొనాలని జేఏసీ పిలుపునిచ్చింది. హైదరాబాద్లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్లో భారీగా ఉద్యోగుల సంకల్ప సభ నిర్వహించనున్నట్లు జేఏసీ ప్రకటించింది.






















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370